# తొలి పలుకు

"ఓం" అనేది ఒక్కటే అక్షరం, నాశరహితమైన బ్రహ్మం (అందరికీ ఆత్మ) అయి ఉందనే విషయాన్ని నిరంతరం జ్ఞాపకంలో ఉంచుకోవాలని మన మహర్షుల ఆదేశం !

అక్షరమైన "ఓం" నశ్వరములైన దేహేంద్రియాదుల నుండి ఉద్భవించదనే విషయాన్ని మనం గ్రహించాలి. అలాంటి స్థితిలో ఉండే వాడే జిజ్ఞాసువు. ఆ "ఓం" మనలో (దేహంలో) వ్యాప్తమై వ్యవహరిస్తోంది.

ఉపనిషత్తుల్ని దర్శించిన మహర్షులు ఈ విశ్వంలో సర్వశ్రేష్ఠం. అన్నిటి కంటే గొప్పది – ప్రాణమే అని అంటారు. ఈ ప్రాణమే మనస్సుతో కలిసినపుడు 'వాక్కు' ఉత్పన్నమౌతుంది. ఈ వాణి ఇంద్రియాల ద్వారా ఉద్భవిస్తుంది. ఈ వాక్కుకు మూలకారణమైన 'ప్రాణం' స్థాయిలోనే ప్రకాశించేది. (ప్రకటింపబడేది)

'ఓం' ప్రాణం స్వయంప్రకాశమానమైనది. దాన్నే 'సవితా" అంటారు. ఇదే గాయత్రి. (మూడు స్థాయిలలో గానం చేయబడేది). ఆ త్రిస్థాయి గానమే ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం. ఈ మూడు విద్యల్ని ఉపాసించడమే ఉద్గీథ; ప్రాణుడే ఉద్గాత. ఆ ప్రాణునిలో పుట్టే స్వరమే (శబ్దమే) ప్రణవం. ఆ ప్రణవోపాసనయే కారకం. దీన్నే అమృత విద్య, బ్రహ్మ విద్య అంటారు. ఇదొక్కటే విద్య. వ్యాకరణం, ఛందస్సు, వేదాలు, ఇతిహాస పురాణాదుల నన్నిటినీ 'అవిద్య' అని, జ్ఞాన రహితమైన కర్మకాండను 'ఉవిద్య' అని ఉపనిషత్‌కారులు ప్రకటించారు.

ఉపనిషత్తులు వేదాల్లోని భాగాలే. మరి ఆ ఉపనిషత్తుల్ని కంఠస్థం చేసి చెప్పడం కూడా అవిద్యే కదా ? ఈ అవిద్య 'ఏది విద్య?' అనే విషయాన్ని తెలిపే సంకేతం మాత్రమే అనే విషయాన్ని మరువరాదు.

ప్రాణోపాసన చేస్తున్నామనే వ్యక్తుల్లో ముక్కు, నోరు – మొదలైన వాటి ద్వారా విచిత్రమైన చేష్టలు చేస్తూ దాన్నే 'విద్య' అని పలికే వాళ్ళున్నారు. ఉపనిషత్తుల్లో దేవతలు ముక్కు, నోరు, కన్ను, చెవి, మనస్సు – మొదలైన వాటి ద్వారా ఉద్గీథం కావించినపుడు రాక్షసులు దాన్ని భేదించారు. అయితే 'ముఖ్యప్రాణుని' ద్వారా ఉద్గీథం చేశాక రాక్షసులు ఇంద్రియాల ద్వారా అభ్యసించటం లేదు అనే విషయాన్ని అర్థం చేసు కోవాలి. దేహానికి మూలధారమైన ప్రాణం తన ఉపప్రాణాలైన ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదానా లనే ఐదింటి సహాయంతో దేహంలో వ్యవహరిస్తోంది.

ప్రాణంలో అపానాన్ని చేర్చి వేరే వేరే గతుల్ని కల్గిన ప్రాణాపానాల్ని నిరోధించి ఒకే గతిలో ఉండేట్లు చేయాలి. అలా చేసిన వేళ – వ్యానం ప్రాణాపానాలతో చేరి, వీటన్నిటిలో ఊర్ధ్వ ముఖమై 'ఉదానం'లో కలిసి, సాగిపోతూ సమానంలో (సమాన స్థితిలో) ఈ వాయువుల మధనంలో ఉద్భవించే 'అశనా'న్ని ప్రాణుదు గ్రహించేట్లు చేయటమే విద్యోపాసన. వాయువు అగ్నికి మూలం కావడంతో ఈ పంచవాయువుల పూజయే పంచాగ్ని పూజగా వర్ణింపబడింది. ఇది ఆధ్యాత్మికం. స్థూలమైన అగ్ని పూజ. వాతావరణశుద్ధి (ఆధిభౌతికం), దేవతలను ప్రార్థించటం, అగ్నిని ప్రార్థించటం, స్వర్గాదిలోకాల ప్రాప్తి కోసం చేయాల్సినటువంటి వాటిని (ఆధిదైవికం) ఉపనిషత్తుల్లో గమనించాలి. దేహేంద్రియాల పై ఆధిపత్యం కల్గిన మనస్సు మరియు దేహంలోని శక్తుల్లో జ్యేష్ఠమూ, శ్రేష్ఠమూ అయిన

ప్రాణాల సంగమమే యోగపు తొలిమెట్టు. అలా కలిసి పోయి 'బ్రహ్మ స్థానం'లో ఆత్మతో చేరిన వేళ ఆత్మకు తన సహజావస్థలోని ఆనందపు అనుభూతి కల్గుతుంది.

ఆ అనుభవంతో ఇంతకు మునుపు ఉండే అజ్ఞానపు తెరలు క్రమంగా తొలగిపోయి, కన్నుల్లో చిచ్ఛక్తి ప్రజ్వలించి, తనకు మూలమైన 'సత్యం' అనే దాన్ని గ్రహించి, అందులో చేరిపోవడమే మోక్షం. 'సత్తు' అనే దాన్ని గ్రహించి, తనలో తాను నిమగ్నుడై ఆనందించే వాడే బ్రహ్మ జ్ఞాని. బ్రహ్మ జ్ఞానియై మోక్షాన్ని పొందే ముందు లోకకళ్యాణం కోసం పని చేసే వ్యక్తి బ్రహ్మవేత్తల్లో వరిష్ఠుడు అనే అభిప్రాయాన్ని ఉపనిషత్కారులు చెప్పారు. దాన్నే గీతలో 'జ్ఞానిభ్యోஉపి మతోధికః, తస్మాద్యోగీ భవార్జున" అని అన్నారు. బ్రహ్మజ్ఞానుల్లో వరిష్ఠుడై క్రియా శీలుడైన వాడే యోగి. 'నీవు అలాంటి యోగివి' కమ్మని చెప్పాడు పరమాత్మ.

దీని వల్ల 'యోగి' అయిన వ్యక్తి వల్లనే లోకకల్యాణం జరుగు తుందని తెలుస్తుంది. బ్రహ్మజ్ఞానులైన క్రియాశీలురుగా ఉండే వాళ్ళల్లో సాత్విక ప్రధాన కార్యాలు చేసేది బ్రహ్మర్షులు. రాజస ప్రధాన కర్మలు చేసేది రాజర్షులు. గుణాతీతులై లోక కల్యాణానికి అవసరమైన అన్ని రకాల కార్యాల్ని చేస్తూ సమత్వ స్థితిలో నిర్లిప్త స్థితిలో దైవానికి ప్రాతినిధ్యం వహించే వాళ్ళే యోగులు.

అలాంటి యోగ్యులైన యోగి అచ్యుతులు మా గురువు గారు. వారు "ఉపనిషత్తుల గురించి నీవొక పుస్తకం రాయాలి" అని నన్ను ఆదేశించారు. అయితే "నేనేం రాయగలను స్వామీ ! నాకు సంస్కృతంలో పాండిత్యమే లేదు" అన్నాను. అప్పుడు ప్రభువులన్నారు –

"అవసరం లేదు. విద్యలో కొనసాగుతూ సుసంస్కృతుడవై నట్లయిన జ్ఞానుల భాష అయిన సంస్కృతం తనకు తానే స్ఫురిస్తుంది" అని చెప్పారు. వారి ఆదేశానుసారంగా ఈ రచనకు ఉపక్రమించాను. నాకు స్ఫురించిన రీతిలో అవసరమైన వాక్యాల్ని మాత్రమే ఉద్ధరించి, వాటి అర్థాన్ని వివరించాను. ఉపనిషద్వాక్యాలకు ప్రతి పదార్థం, తాత్పర్యం రాయడం నా ఉద్దేశ్యం కాదు. ఆ పనిని ఎంతో మంది చేశారు. ఉపనిషత్కారుల వాక్యాల ప్రకారంగా "ఆత్యంతిక సత్యమంటే ఏమిటి? దాన్ని గ్రహించేందుకు ఉపయోగపడే విద్య ఏది?" అనే అంశాన్ని వివరించడమే నా ప్రధానాశయం.

ఉపనిషత్కారులు బోధించిన తత్వాలన్నీ ఒకే స్థాయికి చెందినవని చెప్పడం సాధ్యం కాదు. ఉపనిషత్తుల్ని చదువుతూ పోయినట్లయిన అక్కడ చెప్పబడ్డ వాక్యాల ద్వారా వాళ్ళు విభిన్న విషయాల్ని గ్రహించగల్గుతారు. 'సత్' నుంచి 'అసత్' పుట్టిందని ఒకరు, తొలుత 'మృత్యు'వొక్కటే ఉన్నది. అది అన్నిటినీ సృష్టించిందనే వాళ్ళొకరు. క్షర, అక్షర, బ్రహ్మ గురించి వివరిస్తూ అక్షరమే తురీయమనే వాళ్ళొకరైతే, అక్షరం ఆత్మ నుండి పుట్టిందనే వాళ్ళొకరు ! ఆత్మలు (దేహధారులు) అసంఖ్యాకులనే వాళ్ళొకరు. 'ఆత్మ ఒక్కడే' అని మరికొందరు. ఒకరు ఆత్మ నిర్లిప్తం అంటే మరొకరు కర్మానుగుణంగా ఆత్మ లిప్తమౌతుందని మరొకరు. ఇహంలో (దేహంలో), పరంలో (జగత్తుకు అవతల) ఉండే ఆత్మ ఒక్కటే అని, వేర్వేరని, ఒక్కొక్కరూ ఒక్కోరకంగా చెప్పడం గోచరిస్తుంది. గీతలో కన్పించే 'సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ' అనే ఆదేశం ఉపనిషత్తుల్లో దొరకదు. ఉపనిషత్కారులు చెప్పేదేమంటే "మాలోని మంచి ఆలోచనల్ని మాత్రమే గ్రహించండి" అని. ఇది సమంజసం కూడా!

తమ జ్ఞానం అసంపూర్ణం అని గ్రహించారు కాబట్టే – సత్యాన్ని కప్పి పుచ్చకుండా అలా చెప్పడం వాళ్ళ ఔదార్యాన్ని సూచిస్తుంది.

మనస్సు విషయంలో కూడా ఉపనిషత్కారుల్లో ఏకాభిప్రాయం కనిపించదు. 'యన్మనసాన మనుతే' అని ఒకరంటే – మనస్సుతోనే బ్రహ్మను తెలుసుకోవాలి; వేరే మార్గం లేదు' అని మరొకరు అన్నారు. చాంచల్యానికి గురై 'అది కావాలి ! ఇది కావాలి' అని అడిగేదే మనస్సు కాదు, సత్యాన్ని యధాతథంగా గ్రహించే మనన శక్తియే మనస్సు. బుద్ధి, మనస్సు – ఇవన్నీ ఆత్మశక్తులే ! వాటికన్న భిన్నమైనవి కానే కావు. ఈ విషయాన్ని గ్రహించినట్లయితే ఆత్మ గురించి 'నేతినేతి' (ఇది కాదు ఇది కాదు) అనే పద్ధతిని అవలంబించాల్సిన అవసరమే రాదు. 'ఇది ఇలాగే' అని చెప్పడం సాధ్యమౌతుంది.

మనస్సంటే ఏమిటో తెలుసుకున్న వాళ్ళే ఆత్మను 'మనోమయుడి' గా, 'ప్రాణశరీరుడి'గా వర్ణించారు. దేహంలోని పది ఇంద్రియాలన్నీ మనస్సులో చేరితే– అంటే జ్ఞానశక్తి ఆదేశాల్ని పాలించినపుడే 'యోగం' అంటే జ్ఞానకర్మ ఉద్భవిస్తుంది. అందువల్ల ముక్తిని పొందేందుకు ఏకాదశీ వ్రతమే మంచిదన్నారు జ్ఞానులు. అయితే జ్ఞానపు ఇచ్ఛయే లేకుండా ఏదేదో చేస్తే అది ఏకాదశీ వ్రతమెలా అవుతుంది?

ఉపనిషత్తుల్లో యజ్ఞాలకు ప్రాధాన్యం లేదు. అగ్నిలో పది వస్తువుల్ని కలిపి ఆజ్యంతో ఆహుతి అందించే యజ్ఞాల వర్ణన ఉంది. అలాగే మోక్షమే మన ముఖ్య లక్ష్యమైననూ ధూమ్రాది మార్గాల వర్ణన ఉంది. అలాగే 33 దేవతలు, 6 దేవతలు, 3 దేవతలు, ఇద్దరు, ఒకటిన్నర దేవతలు, ఒక్కడే దేవుడు ఇలా విచిత్రంగా చెప్పే వేళ – దేవుడొక్కడే అని ప్రాణం గురించి చెప్పారు. ఆత్మను కాని, బ్రహ్మను కాని వర్ణించ

లేదు. ఇక్కడ అష్ట వసువులనే వేళలో ఆదిత్యుడు, అగ్ని వంటి అధి భూతాల గురించి చెప్పారే కాని తదభిమానీ దేవతల గురించి చెప్పలేదు. ఆ మునులు తమ వద్ద అడిగేందుకు వచ్చిన వాళ్ళకు తమకు తెలిసిన దాంట్లో అవసరమనిపించిన వాటిని వివరించి యుండవచ్చు. ఏదేమైనా ఉపనిషత్తులనేవి ప్రజల్లో జ్ఞానాకాంక్షను పెంపొందించడంలో బాగా ఉపకరిస్తాయనే మాట మాత్రం వాస్తవం.

ఉపనిషత్తుల్ని చదివి, జ్ఞానాకాంక్ష ప్రబలమై, జ్ఞానులైన గురువుల్ని సమాశ్రయించి, 'విద్య'ను పొంది, శ్రద్ధతో ఆ మార్గంలో సాగుతూ సత్య సామీప్యాన్ని అనుభవించి, వేరే వాళ్ళకు తెలిసి జిజ్ఞాసువులుగా మార్చే జ్ఞానులు ఈ రోజు కావాలి. అలాంటి వాళ్ళ బోధలే ఉపనిషత్తులు. అయితే గ్రంథ పఠనంతోనే సంశయాలు తొలగవు. ఎందుకంటే రహస్యాల్ని వివరించేందుకు ఆ ఉపనిషత్కారులు ఇపుడు సజీవంగా లేరు. 'విద్య' మాత్రం ఎల్లప్పుడూ ఉంటుంది. దాన్ని తెలిసిన వాళ్ళ దగ్గర నుండి పొంది, ముందుకు వెళ్ళి, వేరే వాళ్ళను ముందుకు నడిపించే జ్ఞానులు కండని సత్పురుషులకు నేను విన్నవించుకుంటున్నాను.

దేవుడే లేడు, జ్ఞానం అంటే స్థూల ప్రయోజనాల్ని అందించే తెలివి అనే మూఢత్వం ఈ కాలంలో పెరిగి మనుషులు ప్రాణుల్లాగా మిగిలిపోతున్నారు. దీని వల్ల మున్ముందు మృగత్వం పెరిగిపోతుంది. అలాంటి తెలివే జ్ఞానం అని వాదించే వాళ్ళకింకేం చెప్పాలి?

కల్కిసుధను వద్దు అనే వ్యక్తులు ఖడ్గధారిని చూశాకైనా భయంతో మానవులయ్యేందుకు ప్రయత్నిస్తారు !

ఓం శాంతిః !

**–జయతీర్థులు**

# 1. ఈశావాస్యోపనిషత్తు

ఇది చాలా చిన్నదైనా అత్యంత విఖ్యాతమైన ఉపనిషత్తు. దీనికి కారణం ఇందులో జ్ఞాన, కర్మలకు రెండింటికీ ప్రాముఖ్యం ఇవ్వబడింది. అంతే కాకుండా సత్తు, అసత్తు – వీటికి అవతల ఉండే దేవుని గురించి కూడ ఇందులో చెప్పబడింది. దేవునిలో ఐక్యమై జన్మరాహిత్యాన్ని (మోక్షాన్ని) పొందే మార్గం చెప్పబడింది. ముముక్షువులకు అవసరమైన విషయాలన్నీ ఇందులో ఉన్నాయంటే తప్పేమీ కాదు. అందువల్ల ఈ ఉపనిషత్తులోని అన్ని మంత్రాలకు తాత్పర్యం అందించి వాటిని వివరించే ప్రయత్నం చేశాను.

పాఠకులకు దీని వల్ల ప్రయోజనం సమకూరుతుందని నమ్ముతున్నాను.

**శాంతి మంత్రం**

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**

**పూర్ణస్యపూర్ణ మాదాయ పూర్ణమే వావ శిష్యతే**

**ఓం శాంతిః శాంతిఃశాంతిః**

అది పూర్ణం (బ్రహ్మ), ఇది (జగత్తు) పూర్ణం. పూర్ణంలోంచి పూర్ణం పుట్టింది. ఆ పూర్ణం నుండి ఈ పూర్ణం బయటకు వచ్చినా పూర్ణమే మిగులుతుంది. ఇక్కడ కొంచెం ఆలోచించాల్సి ఉంది. బ్రహ్మం పూర్ణం. అంటే బ్రహ్మకు ఇంకొక వస్తువు యొక్క అవసరం లేదు. ఈ జగత్తు పూర్ణం ! ఎంత వరకు? ఈ జగత్‌లోని జీవులకు ఇంకొకరి అవసరం లేదా? కేవలమైన తృప్తిని పొందగల్గుతాడా?

అలాగైతే బ్రహ్మ విచారం పుట్టేదే కాదు. ఈ జగత్తు యొక్క పూర్ణత్వాన్ని గ్రహించడం వల్లనే బ్రహ్మ చింతన ప్రారంభమైంది. ఈ ప్రపంచం జీవియొక్క భౌతికావసరాల్ని తీర్చేందుకు తగిన పూర్ణత్వాన్ని మాత్రమే పొంది ఉంది.

ఆ పూర్ణం చైతన్య స్పందనలోంచి శక్తి పుట్టింది. ఆ శక్తిలోంచి పుట్టిన భూతధాతువులతో ఈ విశ్వం ఆవిర్భవించింది. ఆ పూర్ణుని చైతన్యం అతనిలోనే ఉండడం వల్ల అతడు పూర్ణంగానే ఉన్నాడనే విషయాన్ని గ్రహించాల్సి ఉంది. ఋక్, యజుస్సామ వేదాలలో వ్యాప్తమై ఉన్న చైతన్యం అతనిలోనే ఉండిపోయి, దాని స్పందన లోంచి పుట్టిన అథర్వం నుండి ఈ విశ్వం ఉద్భవించింది. "స్థూలమైన దృష్టాంతాలతో తత్త్వాన్ని వివరించడం సాధ్యం కాదు. భాష ఈ కార్యాన్ని చేయజాలదు. అందువల్ల ఆ బ్రహ్మపాదాలు మూడూ (ఋగ్, యజుస్, సామ) పై నుండి (దివి నుండి) ఒక్క పాదంతోనే ఈ జగత్తు ఆవిర్భవించింద"ని జ్ఞానులు వర్ణించారు.

**ఈశావాస్యమిదం సర్వం । యత్కించ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనం॥** 1

ఈ ప్రపంచంలో పుట్టి, నశించే ప్రతిదీ 'ఈశుని'చే వ్యాపించ బడింది. అందువల్ల మీకు లభించిన దాన్ని స్వీకరించి నిన్ను నీవు రక్షించుకో! (దాన్ని వదలి వేరే దాన్ని అనుభవించవద్దు). వేరేవాళ్ళ సంపదకు ఆశ పడవద్దు.

ఇక్కడ ఆలోచన చాలా అవసరం. 'ఈశ' అనే మాటకు బ్రహ్మ (దేవుడు) అనే అందరూ అర్థం చెప్పారు. అంతా అతని చేత వ్యాప్తమైం దన్నపుడు దాన్ని త్యజించు అనటంలో అర్థం లేదు.

రెండో అభిప్రాయం ప్రకారం అన్నిటా అతడే ఆవరించిన వేళ, దాన్ని వదలిన, వేరేది ఏముంది? అలాంటప్పుడు వేరే దేన్నీ భుజించ వద్దు అనడం కూడా నిరర్థకం. అలాగే మొత్తం ఈశునిచే వ్యాప్తమయ్యాక ఇంకా ఇంకొకరి వస్తువేది? వేరేవాళ్ళ సంపదకు ఆశపడవద్దు అనే మాట ఆవశ్యకత ఎక్కడుంది?

ఇలా ఆలోచిస్తే – 'ఈశ' అంటే దేవుడు (బ్రహ్మ) అని కాదు. సమస్తంలో వ్యాప్తమైన వాయువు; ఇది మన శరీరంలోనూ ఉంది. బయటా ఉంది. మన దేహంలోని ముఖ్యశక్తి అయిన ప్రాణుడు "అశనాధారి" (ఓం అశనగతః ప్రాణః ఓం – బ్రహ్మ సూత్రాలు).

మన దేహంలోని గాలిని చిలకడం వల్ల ఈ అశనం ఉత్పత్తి ఔతుంది. ఈ అశనాన్ని మానవుడు మాత్రమే తయారు చేసుకోగల్గుతాడు. వేరే ప్రాణులు బ్రతకడానికి కావలసిన 'అశనం' కోసం దేహానికి బయట ఉండే వాయువు పైనే ఆధారపడతాయి. అందువల్ల అది మానవ ప్రాణులకు పరధనం; దాని కోసం ఆశించరాదు – అనే అర్థం ఇక్కడ స్ఫురిస్తుంది. ఈ వాయు మథనం ద్వారా తన దేహంలోనే అశనోత్పత్తి చేసుకొనే ప్రక్రియే ప్రాణవిద్య. దీన్ని తెలిసిన గురువుల వద్ద అభ్యసించాలి. దీన్ని మాటలతో వర్ణించడం సాధ్యం కాదు.

**"కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతం సమాః**

**ఏవం త్వయి నాన్యథేతోఽస్తి న కర్మ లిప్యతే నరే" 2**

దేని వల్ల (ఏ క్రమం వల్ల) మానవుడవైన నీకు కర్మ లేపం కల్గదో, ఆ క్రమాన్ని అనుసరిస్తూ నూరేళ్ళు జీవించాలి. ఇంతకంటే వేరే మార్గం లేదు.

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే ముక్తికి కర్మత్యాగం మార్గం కాదు. నిర్లిప్త రీతిలో కర్మలనాచరిస్తూ నూరేళ్ళ దాకా జీవించ గల్గితేనే ముక్తిని సాధించడం సుసాధ్యం.

ఇక్కడ నిర్లిప్తంగా కర్మల నాచరించాలనీ, ఇచ్ఛామరణం పొందే మార్గాన్ననుసరించాలనీ సూచించబడింది.

**అనేజదేకం మనసో జవీయో నైనద్దేవా ఆప్నువన్ పూర్వమర్షత్**
**తద్ధావ తోఽ న్యానత్యేతి తిష్ఠత్ తస్మిన్న పో మాతరిశ్వా దధాతి**
**4**

అది నిశ్చలం. చాంచల్య రహితం. ఇంద్రియాలు దాన్ని పొంద లేవు. ఎందుకంటే – వాటికన్న ఇది ముందుగానే ఉన్నది. (భావించే అన్నిటినీ మించి ముందుకు సాగిపోయేది) మనోవేగం కూడా దీని ముందు దిగదుడుపే ! ఇది దేహంలో ఉన్న వేళ వాయుకార్యాన్ని చేస్తుంది. దాని సహజత్వం (అన్ని శరీరాల్లోనూ) ఒకే రకంగా ఉంది.

ఇక్కడ వర్ణింపబడిన 'అది' మన దేహంలోని ప్రాణునికి సంబంధించినదే అని తెలుసుకోవాలి. ఆత్మను గురించి కాదు. ఎందు కంటే ధ్యానస్థితిలో శరీరంలో ప్రాణాన్ని వదలి, ఆత్మ బయటికి వెళ్ళి లోకాంతరాల్లో సంచరించి, అనేక అనుభవాల్ని పొంది, మళ్ళీ వచ్చి, ఈ శరీరంలోకి ప్రవేశిస్తాడని ఉపనిషత్‌కారులు వర్ణించడం ముమ్ముందు గోచరిస్తుంది. అంతే కాకుండా విద్యలో ముందుకు సాగిన చాలా మంది వ్యక్తుల స్వానుభవం కూడా ఇదే.

**తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే**
**తదంతరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః 5**

అది కదలుతుంది. కదలదు. అది దూరంలో ఉన్నది. అది చాలా దగ్గరలో ఉన్నది – అది అందరి లోపల ఉన్నది. అది వెలుపలా ఉన్నది.

ఇక్కడ కూడా ప్రాణుని గురించే వర్ణించబడింది. ఈ మన దేహంలో జీవాత్మకు ముఖ్యసారథిలా ఉండే ఈ ప్రాణమనే శక్తి మన దేహంలో ఉండడం వల్లనే ఇది శవం కాకుండా సజీవంగా ఉంటోంది. ఆ ప్రాణశక్తి మన దేహాల వెలుపల కూడా ఉంది. (ఆకాశం – బయలు) మన దేహాన్ని వదలి అది ఒకసారి బయటకు పోతుంది కదా ! మన మానవుల శరీరాల్లో ఉన్నట్లే – అది ప్రాణులన్నిటి దేహాల్లోనూ ఉంది. బయటా ఉంటుంది. ఆ ప్రాణం జడం కాదు. శక్తి. అందువల్ల చలిస్తుంది. అయినా, అది మన దేహంలో ఏ స్థానంలో ఉండి గాలి ద్వారా పని చేయిస్తోందనే విషయాన్ని యోగ విద్యాభ్యాసంతో లభించే అనుభవం ద్వారానే తెలుసుకోగల్గుతాం. వేరే విధంగా తెలుసుకోలేము. గాఢనిద్రలో (సుషుప్తి) ఈ ప్రాణం చలించి (పైకి వెళ్ళి) దేహంలో బ్రహ్మరంధ్రంలోకి చేరుతుంది. మళ్ళీ అక్కడ నుండి అది క్రిందికి దిగి వచ్చాకే మనకు స్వప్నం కానీ, జాగ్రదావస్థ అనే స్థితి కానీ లభిస్తుంది. గాఢనిద్రలో అన్ని కార్యకలాపాలు చేసేందుకు, చూసేందుకు ముఖ్యమైన మనస్సుకు హెచ్చరిక ఉండదు. కాబట్టి ఈ ప్రాణశక్తి సంచారం దానికి తోచదు. అందువల్ల అది చలించదని (సామాన్యుల దృష్టిలో) చెప్పబడింది. ఆ ప్రాణం మనకు (దేహంలోని జీవాత్మకు) సమీప స్థానంలోనే అన్నట్లుగా ఉంటుంది. అయినా ఎచ్చరిక లేకపోవడం వల్ల మనస్సుకు అది తెలియదు. అందుకనే తన నుంచి చాలా దూరంలో ఉందని అనిపిస్తుంది.

ఇక్కడ దేహంలో జీవాత్మ స్థానం బ్రహ్మ రంధ్రమే అనేది యోగ విద్యా సాధనానుభవం వల్లనే తెలుస్తుందని గ్రహించాలి. యోగవిద్యలో

ముందుకు వెళ్ళి అనుభవాన్ని పొందడం వల్లనే ఉపనిషత్ ఋషులు ఆ ప్రాణం గురించి వర్ణించగల్గారు. ఆ 'విద్య' గురించి తెలియని వాళ్ళకు ఆ ఉపనిషత్ వాక్యాల అర్థం ఎలా బోధపడుతుంది? అందువల్ల వాళ్ళ వాక్యాల్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా కల్పించి, వ్యాఖ్యానించి, గ్రంథాలు రాసి – వివిధ పంథాలు పుట్టి – అనేక వివాదాలు చెలరేగాయి.

అందుచేత ఆత్మజ్ఞానం, సృష్టి విజ్ఞానం – వీటి గురించి గ్రహించాలనుకునే వాళ్ళు యోగవిద్యను పొంది, శ్రద్ధతో సాధించి, అనుభవ జ్ఞానాన్ని సంపాదించి, తర్వాత ఉపనిషద్వాక్యాల అర్థాన్ని జన సామాన్యులకు బోధిస్తే – అపుడు అది ప్రజల్లోని అజ్ఞానాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఆ విద్యా గంధమే లేని వాళ్ళుజ్ఞానుల గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాసి, తమలో తాము గ్రహించుకోలేక తప్పుదారిలో నడుస్తూ – ప్రజల్ని కూడా వ్యర్థంగా నడిపిస్తారు. ఇది గ్రుడ్డివాళ్ళ వెంట గ్రుడ్డివాళ్ళు వెళ్ళినట్లే ఔతుంది.

ఈ ప్రాణశక్తి మన దేహంలో లోపలా, వెలుపలా ఉంటుంది. అయినా భౌతిక విజ్ఞానంలో ప్రగతి సాధించిన ఈ కాలంలోనూ ప్రాణశక్తి ఎక్కడుంది? ఎలా చలిస్తుంది? అనే అంశాల్ని కనుక్కోవడం విజ్ఞానానికి సాధ్యం కాదు. కళ్ళకు కనిపించకున్నా గాలి చలనం మనకు అర్థమౌతుంది. 'విద్యుత్తు' శక్తి అయినా దాని చలనాన్ని స్థూల పరికరాలతో గుర్తించడం సాధ్యం అయింది. అయితే సూక్ష్మాతిసూక్ష్మమైన ఈ ప్రాణ శక్తి, ఉనికి, స్థానం, చలనం – వీటిని బుద్ధితోనో, పరికరాలతోనో గ్రహించడం సాధ్యం కాలేదు. కాదు కూడా ! అది సాధ్యమైతే స్థూలమైన శాస్త్రవేత్తకు స్థూల ప్రయత్నాలతోనే మరణాన్ని జయించగల్గడం సాధ్యమయ్యేది. ఇచ్ఛా మరణం పొందగల్గే వాళ్ళం. అది సాధ్యం కాదు.

భౌతిక విజ్ఞానానికి ఈ సూక్ష్మ విషయాలు తెలియాలంటే అతడు కూడా యోగ విద్యనే ఆశ్రయించడం తప్ప వేరే మార్గం లేదు. అలాగే ఆత్మ జ్ఞానం పొంది, ముక్తి కావాలనే వాళ్ళు కూడా ఈ విద్యనే ఆశ్రయించాలి.

ఈ జగత్తు పాంచ భౌతికం. ఈ భౌతిక జగత్తును సృష్టించి, పోషించి, ధరించేందుకు మూలం ప్రాణం. అలాంటి మూలశక్తిని ఆశ్రయించకుండా మూల రహస్యాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. ఆనందానుభవం, ఇచ్ఛామరణ స్థితుల్ని పొందడం సాధ్యం కాని వేళ వాళ్ళకు మోక్షమనేది ఎలా లభిస్తుంది?

గ్రంథాలు చదివి, రాసి, మాట్లాడే వాచాల వ్యక్తుల కార్యకలాపాలు పిల్లల పిచ్చి అరుపులతో సమానం. ఇలాంటి వాళ్ళ సంఖ్య ముమ్ముందు బాగా పెరుగుతుందని గ్రహించిన మన మహర్షులు 'కలౌ వేదాంతినో ఘల్గుణోయువా' అని సెలవిచ్చారు.

**యస్తు సర్వాణి భూతా న్యాత్మన్నేవాను పశ్యతి**
**సర్వభూతేషు చాత్మానం తతోన విజుగుప్సతే॥ 6**
**యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవా భూద్విజానతః**
**తత్ర కోమోహః కఃశోకః ఏకత్వమనుపశ్యతః 7**

తనను తాను తెలుసుకున్న జ్ఞానికి, ఆ జ్ఞానోదయ మయ్యాక, సుఖశోకాలెలా ఉంటాయి? ప్రాణులన్నీ తనలాగే ఉన్నాయని గ్రహించాక సమదృష్టి వస్తుంది. సహజత్వం వస్తుంది.

ఆత్మజ్ఞానం పొందేందుకు గురువు నాశ్రయించి, యోగ విద్యోపదేశం పొంది ముందుకు సాగిన సాధకుడు ఆత్మరతుడై ఆనందాన్ని అనుభవించి, బహిర్ముఖుడైనాక శాస్త్ర వాసనల ఫలితంగా (ఆనందో

బ్రహ్మేతి వ్యజానాత్) అంటే ఆనందమే బ్రహ్మ లక్షణం మొదలైన వాక్యాల్ని చదివి, 'నేనే బ్రహ్మ' (అన్నిటికీ మూల కారణం, శాశ్వతం, సర్వజ్ఞం, సర్వశక్తం ఇత్యాది) అనే భ్రమకు గురై, 'అహం బ్రహ్మాస్మి' (నేనే బ్రహ్మనైనాను) అనే వికల్పానికి బలై, తనకు యోగవిద్యతో లభించిన సిద్ధుల, శక్తులను ప్రదర్శించి, దురుపయోగం చేసి, తాను అజ్ఞానిగానే మిగిలిపోయి, తన సిద్ధుల ప్రయోగాల ద్వారా జనంలో భయాశ్చర్యాలు కల్గించి, కీర్తిని పొంది, శక్తి నశించాక అతృప్తితో, అశాంతితో కుమిలి మరణిస్తాడు.

అదీగాక, అలాంటి వ్యక్తి ఆనందానుభవానికి తనకు లభించిన అల్ప సత్యాంశాల్ని (కాలజ్ఞానం, పూర్వజన్మ జ్ఞానం లాంటివి) ప్రదర్శించి, కీర్తిని పొంది 'ప్రజ్ఞానం బ్రహ్మ' మొదలైన పలుకులు పలుకుతూ, భ్రమిస్తూ తన అరకొర జ్ఞానం, సిద్ధులు, అహంకారం – వీటి కారణంగా తనకు మూలం ఏది? అక్కడ నుండి ఈ జీవాత్మ ఎందుకు వచ్చి ఈ దేహంలో పడింది? జనన మరణాలతో ఎందుకు సతమతమౌతోంది? ఇది ఈ బంధనంలోంచి విడుదలై ఆనందధామమైన తన మూలస్థానాన్ని ఎలా చేరగల్గుతుంది? వీటిని తెలుసుకోలేక, ప్రయత్నించక, అహంకారపు సుడిగుండంలో చిక్కుకుని – సంసార చక్రం నుండి బయట పడకుండా సతమతమౌతూంటాడు. అలాంటి వాళ్ళకు ఇతరులు కూడా తనలాగే అన్న సహజత్వం ప్రాప్తించదు. వాళ్ళ జ్ఞానమంతా కేవలం మాటల్లోనే కన్పిస్తూంటుంది. చేతల్లో ఏమీ ఉండదు. చెప్పేవి జ్ఞానపు మాటలు – ఆత్మవత్ సర్వ భూతానాం, సర్వంఖల్విదం బ్రహ్మ, వాసుదేవః సర్వమితి' మొదలైనవి.

ఇలా అయితే, విద్యాసాధన ఫలం సంపూర్ణంగా లభించదు. అతడు నష్టపోతాడు. జనాల్లో తప్పుడు అభిప్రాయాన్ని నాటుతాడు. ఈ పాపాన్ని అతడు భరించాల్సి ఉంటుంది. అలా కాకుండా గురుకృపతో విద్యను పొందిన సాధకులు సిద్ధుల, ఆనందానుభూతుల భ్రాంతిలో పడకుండా ఆ ఆనందానుభవాన్ని పొందిన తన పూర్వపు ఆనంద రహిత స్థితికి కారణమేమి? ఇప్పుడు ఆనందాన్ని అనుభవిస్తున్న తన మూలం ఏమిటి? ఎక్కడుంది? అనే అంశాన్ని అర్థం చేసుకొనేందుకు జాగృతుడై, తపించి, గ్రహించి, ముక్తుడు అయ్యేందుకు విశ్వంలో తాను చేసి ముగించాల్సిన కర్తవ్యమేమనే విషయాన్ని గ్రహించి ఆ కర్తవ్యం ద్వారా జగత్కల్యాణానికి కారణమై, కర్తవ్య పూర్ణత వల్ల ముక్తుడౌతాడు. అలా అయితేనే 'విద్య' తనకు లభించినందుకు సార్థకత్వం సమకూరుతుంది.

ఇలా తపస్సుతో తత్వాన్ని గ్రహించిన జ్ఞానికి 'తన మూలమే అందరికీ మూలం' అనే జ్ఞానం కల్గి విశ్వసౌభ్రాతృత్వం అంకురిస్తుంది. అది అతని సహజ గుణంగా, ప్రవర్తనగా భాసిస్తుంది. అంతే కాకుండా జ్ఞాని అయిన అతనికి జనన మరణాల మూల కారణం, క్రమం – వీటి మర్మం తెలుస్తుంది. అందువల్ల ఎవరి పట్ల అతనికి అసహ్యం, ద్వేషం, మోహం – లాంటి భావనలే కలుగవు.

**సపర్యగా చ్ఛుక్రమకాయమవ్రణ**
**మస్నావిరం శుద్ధమపాపవిద్ధం**
**కవిర్మనీషీ పరిభూస్స్వయం భూ**
**ర్యాథా తథ్యతోఽ ర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః 8**

అతడు సర్వవ్యాపి, జ్యోతిర్మయుడు, శుద్ధుడు, పాపరహితుడు, కవి,

మనీషి (బుద్ధిమంతుడు) సర్వోత్తముడు, స్వయంభువు. శాశ్వతమైన సంవత్సరాలకు అతడు అర్థాన్ని యథాతథంగా పంచాడు.

తన చైతన్యవ్యాప్తితో ఈ విశ్వ నిర్మాణానికి మూల కారణుడైన ఆది పురుషుడు తన అర్థాన్ని (శక్తి) శాశ్వతమైన, ప్రజల ఆశ్రయ స్థానాల రచన కోసం, వినియోగించి విశ్వాన్ని సృష్టించాడు. సర్వవ్యాప్తమైన అతని చైతన్యం ఇంద్రియగోచరం కాని నిరాకారశక్తి. అలాంటి శక్తిని, సంపత్తును కల్గిన వాడే జ్యోతిర్మయుడు (తేజఃశరీరి). గాయపడే కండరాలతో కూడిన మన భౌతిక శరీరం లాంటి శరీరం అతనిది కాదు. అజ్ఞానరహితుడు. ఎల్లప్పుడు శుద్ధుడు. అదే కారణం వల్ల పాపస్పర్శ లేని వాడు. విశ్వంలో ఉండే వాళ్ళందరి కంటే ఉత్తముడు, సర్వజ్ఞుడు, ప్రభువు, స్వయంభువు (తనంతట తానే ఉద్భవించిన వాడు. అంటే జ్యోతిర్మయుడైన పరమాత్మ మరొకరి సంకల్పం లేకుండానే తనంతట తానే ఉద్భవిస్తాడని అర్థం.)

ఆ ఆదిపురుషుణ్ణి పురుషుడనీ, పరమాత్మ అనీ, పరమేశ్వరుడనీ, పరబ్రహ్మ అనీ, అదిదేవుడనీ వేర్వేరు జ్ఞానులు వివిధమైన రకాలుగా వర్ణించారు. అతనొక్కడే సర్వజ్ఞుడు కావడం వల్ల అతన్నే 'గురు'వనీ, సర్వశక్తుడు కావడం వల్ల ప్రభువనీ, సమానత్వం అత్యధికంగా ఉండడం వల్ల 'యోగి' అని, సహజంగా శాంతిమయుడు కావడం వల్ల 'శివుడు' అనీ వర్ణించడం జరిగింది.

**అంధం తమః ప్రవిశంతియేఽ విద్యాముపాసతే**
**తతోభూయ ఇవ తేతమోయ ఉ విద్యాయాంరతాః** **9**

అవిద్యోపాసకులు అజ్ఞానాంధకారంలో ప్రవేశిస్తారు. విద్యను ఉపాసించే వాళ్ళు దానికన్న అధికమైన అంధకారంలో ప్రవేశిస్తారు.

ఉపనిషద్ మహర్షుల అభిప్రాయంలో – 'విద్య' అంటే జ్ఞానప్రాప్తికి సాధనమైన యోగ విద్య. (ముఖ్య ప్రాణోపాసన) వేదశాస్త్రాదుల అధ్యయన మంతా అవిద్య. అవిద్యోపాసకులు జ్ఞానులు అయ్యేందుకు అవకాశం లేదు. వాళ్ళు చీకట్లో ఉన్నట్లే. అవిద్యను వదలి 'విద్య'ను మాత్రమే ఉపాసించే వాళ్ళు అవిద్యోపాసకుల కన్న అధికమైన అంధకారంలో ఉన్నట్లే అంటారు ఋషులు.

ఎందుకంటే జ్ఞానం లేని వాళ్ళకు వేదశాస్త్రాదుల అధ్యయనం. స్థూలపూజ, కర్మకాండలలో మునిగే తామేదో చేస్తున్నామని ఒక సంతృప్తిని పొందే అవకాశమైనా ఉంది. అయితే వీటన్నిటిని వదలి కేవలం 'విద్య'నే ఉపాసించే వారికి అలాంటి తృప్తిని కల్గించడం సాధ్యం కాదు. జ్ఞాన ప్రాప్తి కూడా సాధ్యం కాదు. ఎందుకంటే కర్మత్యాగం వల్ల జ్ఞానప్రాప్తికి విరోధం కల్గుతుంది. అందుకోసమే లిప్తుడు కాని రీతిలో కర్మ చేస్తూ నూరేండ్లు జీవించాలని కోరుకో" అని ఈ ఉపనిషత్తులో 3వ వాక్యంలో ఋషులు సెలవిచ్చారు.

'రాత్రింబగళ్ళలో పగటిని మీ శరీర పోషణ కోసం అవసరమైన, మరియు ఇతర ధర్మకర్మల (పరోపకారాదులు) కోసం, రాత్రిని తపస్సు కోసం వినియోగించు" అని సాధకులకు మన గురువు గారైన ప్రభు యోగి అచ్యుతులు ఆదేశించి ఉన్నారు. ఇక్కడ ఉపనిషత్ కారుల అభిప్రాయం కూడా అదే !

**అన్యదేవా హుర్విద్యయాన్య దాహుర విద్యయా**

**ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్త ద్విచచక్షిరే"** **10**

విద్య వల్ల వేరే, అవిద్య వల్ల వేరే అన్నారు. ఏ ధీరులు దీన్ని వివరించారో వాళ్ళ నుంచి విన్నాం. విద్య, అవిద్యల నుంచి లభించే ఫలం విభిన్నమన్నది ఇక్కడ ఉపనిషత్కారుల అభిప్రాయం.

**విద్యాంచావిద్యాం చ యస్తద్వేదో భయం సహ**

**అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే" 14**

ఎవరైతే విద్యను, అవిద్యను ఏక కాలంలో గ్రహిస్తాడో అతడు అవిద్య ద్వారా మృత్యువును దాటి విద్య ద్వారా అమృతత్వాన్ని పొందుతాడు. విద్య, అవిద్య – ఈ రెంటినీ ఏకకాలంలో ఉపాసించాలనే అభిప్రాయంగా సూచ్యంగా ఈ మంత్రంలో వివరించబడింది. అయితే కేవలం స్థూలమైన ధర్మకర్మలతో, వేదశాస్త్రాధ్యయనంతో మృత్యువును దాటడం (జయించటం) అంటే – ఇచ్ఛా మరణం పొందడం సాధ్యమా? అందే సాధ్యం కానపుడు ఇక అజ్ఞానాంధకారాన్ని (మృత్యువు వలే ఇది కూడ) దాటడం సాధ్యమా? ఈ ప్రశ్నకు ఇక్కడ జవాబు లభించదు.

ఈ విషయంలో ప్రభువుల అభిప్రాయమేమంటే – అవిద్యతో, అంధకారం నుండి (మృత్యు అజ్ఞానం) బయటపడడం సాధ్యం కాదని అందరికీ తెలుసు. మృత్యువును దాటేందుకు, జ్ఞానాన్ని పొందేందుకూ విద్యయే ఆశ్రయమని వారికి తెలుసు. విద్యోపాసనలోనే స్థూలం, సూక్ష్మం అనే విభాగాలున్నాయి. విద్య యొక్క స్థూలోపాసనతో మృత్యువును తరించి, అంటే ఇచ్ఛా మరణ స్థితిని పొంది, విద్య యొక్క సూక్ష్మోపాసన ద్వారా అమృతత్వాన్ని (జ్ఞానాన్ని) పొందడం సాధ్యం. విగ్రహాదుల పూజలో, స్థూలపూజ (అభిషేకం, అలంకారం), సూక్ష్మపూజ (మానసిక చింతనం) లున్నట్లే విద్యోపాసనలో జపతపాలు ఉంటాయి. జపం

ప్రాణాయామంతో ప్రారంభమై ఆనందానుభవం దాకా సాగుతుంది. ఆ స్థితిలోనే అమృతపానమౌతుంది కాబట్టి ఇచ్ఛా మరణ స్థితి లభ్యమౌతుంది. అంతటితో ఆగకుండా ముమ్ముందు విద్య యొక్క సూక్ష్మోపాసన సాగాలి. అంటే అంతర్ముఖ స్థితిలో తన (ఆత్మ యొక్క) మూలాన్ని దర్శించి తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. అదే తపస్సు. ఆ పరమాత్ముని దయతో అయ్యే ఆ దర్శనం, ఆ జ్ఞానం – వీటి ద్వారానే పరమపదం (అమృతత్వం – చిరశాంతి – మోక్షం) సుసాధ్యమౌతుంది.

ఇక్కడ కర్మను వదలిపెట్టకూడదనే అంశాన్ని విస్మరించరాదు. జ్ఞానం లభించాక, దేహత్యాగం అయ్యే వరకు కూడ కర్మనాచరించాల్సిన అవసరం ఉందన్న విషయం జ్ఞానులకు తెలుసు. ఇక అజ్ఞానస్థితిలో ఉండే సాధకులు కర్మత్యాగం చేయడం అంటే కేవలం భ్రమతో కూడిన నాస్తికత్వమే తప్ప ఇంకేమీ కాదు.

**అంధం తమః ప్రవిశంతి యేఽ సంభూతి ముపాసతే**
**తతోభూయ ఇవతే తమోయ ఉ సంభూత్యాం రతాః॥** **12**
**అన్య దేవాహుః సంభవాదన్యదాహుర సంభవాత్**
**ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్తద్విచచక్షిరే॥** **13**

అసంభూతి (వ్యక్తం)ని ఉపాసించే వాళ్ళు అజ్ఞానాంధకారానికి గురౌతారు. సంభూతిని (అవ్యక్తాన్ని) ఉపాసించే వారు అత్యధికమైన అంధకారంలో మునుగుతారు. అవ్యక్తోపాసనా ఫలం వేరే. అసంభవోపాసన యొక్క ఫలం (వ్యక్తోపాసన) వేరే – ఈ రీతి మాకు ఉపదేశించిన ధీరుల నుండి విన్నాం.

వ్యక్తోపాసన (అసంభూతి) యొక్క ఫలం – పాపపుణ్యాలు, తదనుగుణమైన లోకం, జన్మాదుల ప్రాప్తి, అవ్యక్తోపాసన (సంభూతి) ఫలం

మృత్యువు నుండి (కర్మఫలాలైన, జనన మరణాల చక్రం) విముక్తి, ఈరీతి విద్యావిద్యల విషయంలో వివరించబడింది. అలాగే అమృతత్వాన్ని పొందేందుకు ఈ రెంటినీ ఉపాసించాలని చెప్పబడింది. అదే విషయం ఇక్కడ మళ్ళీ చెప్పబడిందా?

18 మంత్రాలుండే ఈ ఉపనిషత్తులో ఉపనిషత్కారులు చెప్పిందాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పారని మనకు అనిపించదు. సంభూతి, అసంభూతి – అనే శబ్దాలకు ఉపనిషత్కారుల అర్థమే వేరు అని అనిపిస్తుంది. "సంభూతి" అంటే పుట్టిన విశ్వం. "అసంభూతి" అంటే ఉత్పత్తి, ఉపాసన అంటే కర్మ, పూజ మొదలైనవి. వాటి ఫలం, తదనుగుణమైన జన్మ, విభిన్న లోకాల ప్రాప్తి. "అసంభూతి" అంటే ఉత్పత్తి, – నాశం – లేని దేవుని ధ్యానం. (బ్రహ్మనిష్ఠ) ఇందులోనూ రెండంశాలున్నాయి. ధర్మకర్మల్ని త్యజించి, కేవలం పూజ, చింతనం, స్మరణం – ఇత్యాదుల ద్వారా "అసంభూతి"ని ఉపాసించటం ఒకటి. నిరాకారశక్తే దేవుడని ఆ శూన్యస్థితిలో (అసంప్రజ్ఞాత సమాధి) మునిగేందుకు ప్రయత్నం చేయడం మరొకటి.

ఈ రెండురకాల అంశాల్లో ఏ ఒక్కటీ జ్ఞానప్రాప్తికి (అమృతత్వానికి) సాధనం కాజాలదనేదే ఉపనిషత్కారుల అభిప్రాయమనిపిస్తుంది. ఈ వ్యక్తోపాసనలోనూ మరొక విధమైన అంశం ఉంది. "మానస సేవే మాధవ సేవ. దేశ సేవే ఈశ్వర సేవ" అనే భావంతో కర్మ చేస్తే అదే యోగం. దాని ద్వారానే అమృతత్వ ప్రాప్తి, (మోక్షప్రాప్తి). అంతర్ముఖ సాధన అవసరం లేదని వాళ్ళ అభిప్రాయం.

నాకు తోచినట్లు విచారిస్తే – సంభూతిలో నిమగ్నం కావడం వల్ల (ఉత్పత్తి అయిన వ్యక్త విశ్వం, మరియు నిరాకారశక్తి) కర్మలిప్తత,

దాని ఫలాలైన జనన మరణాలు కల్గుతాయి, అసంభూతి ఉపాసన ద్వారా (ఉత్పత్తి నాశాలు లేని దేవుని దర్శనం, ధ్యానానందాలలో సదా నిమగ్నుడు కావడం) నిరంతరానంద స్థితి కల్గుతుందే కాని అమృతత్వం కల్గదు. (జ్ఞానమోక్షాలు కల్గవు)

ఇక్కడ శాశ్వతమైన దేవుని దర్శనం, దాని ఫలమైన జ్ఞానప్రాప్తి జరిగాక జ్ఞానఫలమైన మోక్షం లభిస్తుందా?

ఈ ప్రశ్నకు జవాబు - గీతలో "జ్ఞానిభ్యోఽ పి మతోధికః" అనే మాట. "నహిజ్ఞానేన సదృశం", "జ్ఞానిభ్యోఽ పి మతోధికః" (జ్ఞానికన్న యోగి శ్రేష్ఠుడు) అని కృష్ణుడన్నాడు. "తస్మాద్యోగీ భవార్జున" అని అన్నాడు.

కేవలం జ్ఞానం లభిస్తే మోక్షం లభించినట్లు కాదు. మోక్షప్రాప్తికి జ్ఞానం తర్వాత కర్మ చేయడం అవసరం అని అర్థం. దీన్ని గ్రహించిన ఉపనిషన్మునులు "ఆత్మ రతః, ఆత్మక్రీడః క్రియావాన్ ఏష బ్రహ్మవిదాం వరిష్ఠః" అని ప్రకటించారు.

**సంభూతించ వినాశం చ యస్తద్వేదో భయం సహ**
**వినాశేన మృత్యుం తీర్త్వా సంభూత్యామృత మశ్నుతే" 11**

ఎవడైతే అసంభూతిని, వినాశాన్ని ఏకకాలంలో గ్రహిస్తాడో, అతడు వినాశం ద్వారా మృత్యువును దాటి అసంభూతి ద్వారా అమృతత్వాన్ని పొందుతాడు.

'సంభూతి' అంటే నశ్వరమైన వస్తువులన్నీ (స్థూల, సూక్ష్మ వస్తువులు) 'అసంభూతి' అంటే నాశరహిత బ్రహ్మమనీ మాకు స్ఫురించిన భావమే ఉపనిషత్కారుల మాటల్లో స్పష్టంగా గోచరిస్తుంది.

చాలామంది అభిప్రాయం ప్రకారం అసంభూతి వ్యక్తం. సూక్ష్మ ప్రకృతి కలది. అయితే దాని ద్వారా 'అమృతత్వాన్ని' పొందడం సాధ్యం కాదు. అంతే కాకుండ ఇక్కడ 'సంభూతి' అనే శబ్దానికి బదులుగా ఉపనిషత్కారులు 'వినాశ' అనే శబ్దాన్ని వాడడం వల్ల 'అసంభూతి' అంటే నాశం లేని (అంటే పుట్టుక లేని, శాశ్వతం, పూర్ణమూ అయిన) దేవుడే అని వాళ్ళ అభిప్రాయమన్న విషయమని తేటతెల్లమౌతోంది. అందువల్ల ముముక్షువు ఈ రెంటినీ ఉపాసిస్తే మాత్రమే మోక్షానికి అర్హుడౌతాడు. అసంభూతి కృపతో జ్ఞానాన్ని పొంది జగత్కల్యాణకరమైన జ్ఞానోత్తర కర్మను చేసి ధన్యుడై సంసార చక్రంలోంచి ముక్తుడై అసంభూతి ద్వారా అమృతత్వాన్ని అతడు (మోక్షాన్ని) పొందుతాడు.

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం**
**తత్వం పూష న్న పావృణు సత్యధర్మాయ దృష్టయే 17**

బంగారు పాత్రతో సత్యపు ముఖం మూయబడింది. పూషుడా! ఆ మూతను తొలగించి సత్యధర్ముడవైన నిన్ను ప్రదర్శించు (నీ దర్శన మందించు) సత్తు, అసత్తులకు అవతల ఉండే పరమాత్మ గురించి ఇక్కడ సూచ్యంగా వివరించబడింది. 'అసత్' అంటే ఆకారముండే జగత్తు. అందులోనిదంతా అసత్తు. 'సత్' అంటే – ఈ సమస్తానికి కారణమైన శక్తి (నిరాకార బ్రహ్మ). దాన్నే 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అని చెప్పారు. 'ఏకోవశీ సర్వభూతాంతరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి, తమాత్మస్థం యేనుపశ్యంతి ధీరాస్తే షాం సుఖం శాశ్వతం నేతరేషాం' అని జ్ఞానులు చెప్పారు. ఈ రెంటికీ మూలమైన, ఈ రెంటికీ అవతల ఉండే పరమాత్మ గురించి ఇక్కడ చెప్పడమైనది.

ఆ శాశ్వత సత్యపు ముఖం, అతన్ని దర్శించే మార్గం బంగారు మూతతో మూయబడింది. అంటే – అతని చుట్టూ ప్రసరించే కాంతి కిరణాలతో ఆవృతమైనది. అందువల్ల దేవుని దర్శనం అసాధ్యమైనది. ఆ స్థితికి చేరుకున్న ఋషి దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు –

"పూషా ! నీ దర్శనంలో అవరోధంగా ఉన్న ఆ హిరణ్మయ పాత్రను (కాంతి కిరణ సమూహాన్ని) తొలగించి, శాశ్వతుడవు, సమస్తాన్ని ధరించే నీ దైవరూప దర్శనం కల్గించు" అని ప్రార్థించాడు.

**పూషన్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య వ్యూహరశ్మీన్ సమూహ**
**తేజోయత్తే రూపం కల్యాణతమం తత్తే**
**పశ్యామియోఽ సావసౌ పురుషః సోహమస్మి॥ 16**

"పూషా ! ఏకమాత్రుడవైన ఋషీ ! ఎల్లవేళలా ఋతంలో ఉండే వాడా ! యముడా (మృత్యురూపుడు) సూర్య ! (అన్నిటికీ శక్తి, ప్రకాశం, పోషణ అతని ద్వారానే లభిస్తుంది) ప్రజల ఉత్పత్తికి కారణం అతని తేజో కిరణాలు. వాళ్ళే ప్రజాపతి సుతులు. ప్రజాపతి పుత్రులైన నీ కిరణావళిని ఉపసంహరించుకో ! నీ రూపం చూసి నేను ధన్యుణ్ణవుతాను" అని దర్శనాకాంక్షి ప్రార్థిస్తున్నాడు.

**ఓం వాయురనిల మమృతమథేదం భస్మాంతం శరీరం**
**ఓం క్రతో స్మర కృతం స్మర క్రతోస్మర కృతం స్మర ॥ 15**

ఇలా శాశ్వతుడైన దేవుణ్ణి దర్శించాక అతని కృపా కటాక్షంతో జ్ఞాన, మోక్షాలకు అర్హుడైన వ్యక్తి తనకు తానుగా చెప్పుకునే మాట ఇది.

వాయువు మరియు అనిలం వీటి మథనంతో అగ్ని ఉత్పత్తి. ఆ అగ్ని ద్వారా అమృతోత్పత్తి. ఆ క్రమంలో భస్మమైన ఈ శరీరం. ఇపుడు మళ్ళీ ఆ అగ్నితోనే భస్మమై అంతరించనీ ! అందువల్ల నీవు ఏ క్రతు విద్యోపాసనతో ఈ స్థితిని పొందావో దాన్ని స్మరించు. మళ్ళీ యాగాన్ని చేయి. స్మరించు ! చేసిందాన్ని స్మరించు!

**అగ్నే నయ సుపథారాయే అస్మాన్ । విశ్వాని దేవ వయునాని విద్వాన్ ।**

**యుయోధ్యస్మజ్జు హురాణమేనో భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ ॥ 18**

ఓ అగ్నీ ! మమ్మల్ని మంచి మార్గంలో పెట్టు ! ఓ దేవా ! నువ్వు అన్ని కర్మలను తెలుసుకున్న వాడివి ! మా వలన జరిగిన పాప కర్మల్ని విడిపించు. నీకు నమస్కార వాక్యాలు చెబుతున్నాను.

ఉపనిషత్కారులు చివర్లో అగ్నిని ప్రార్థించారు. కారణమేమంటే – సత్కర్మలతో వాటి ఫలాలైన దివ్యలోకాల్ని పొందేందుకు అగ్ని ఉపాసనే చాలా ముఖ్యం. అంతే కాకుండా మోక్షార్థులైన వాళ్ళు అగ్నిని (తమలోని దోషాలన్నిటిని నశింపజేసే ప్రాణాగ్ని, అలాగే అజ్ఞానాన్ని నశింప జేసే జ్ఞానాగ్ని) స్తుతిస్తారు. ఆత్యంతికంగా దేవుణ్ణి 'అగ్ని' అని సంబోధించి ప్రార్థించడం సమంజసమే.

"నేనెలాంటి జ్ఞాని అయినా ప్రకృతి ఆవరణలో నిరంతరం నాకు వ్యక్తమౌతున్న అజ్ఞానం, అలాగే దాని వల్ల కల్గే పాపదోషాల్ని భస్మం చేసి నన్ను మంచి మార్గంలో నడిపించు" అనేదే ఈ ప్రార్థన.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# ౨. కేనోపనిషత్

ఈ ఉపనిషత్తు యొక్క ముఖ్య సారాంశమేమంటే ఇంద్రాది దేవతలే కానివ్వండి, మానవులే కానివ్వండి ఎవరూ దేవుణ్ణి పూర్తిగా తెలుసుకోలేరు. ఇంద్రియాలు కాని, మనస్సు కాని, బుద్ధి కానీ, ప్రాణం కానీ (మనలోని ఏ శక్తి కూడా) అతణ్ణి గ్రహించజాలదు. అంతా అతడి నుంచే ఉద్భవించేది కాబట్టి వీటి క్రియాశక్తి, గ్రహణ శక్తులన్నీ మన సొంతాలు కావు. పరమాత్మ అందించినవే. వీటన్నిటికీ భగవంతుడే ఆశ్రయం కావడం వల్ల అతని జ్ఞానము మనకు అతని దయ వల్లనే లభించాలి.

దేవతల అహంకారాన్ని నిర్మూలించేందుకు బ్రహ్మ యక్ష రూపంలో ప్రకటింపబడ్డాడనే కథలో మనం ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే యక్షునితో మాట్లాడి తమ అసమర్థతను గ్రహించిన దేవతలకు అతడెవరనే విషయం గోచరించలేదు. ఉమాదేవి ప్రత్యక్షమై వాళ్ళకు ఆ యక్షుడే పరబ్రహ్మమని చెప్పిన తర్వాతే వాళ్ళు గ్రహించగల్గారు. దీనివల్ల తెలిసేదేమంటే – మానవులైనా, దేవతలైనా బహిర్ముఖ స్థితిలో తమకన్న ఎక్కువ శక్తి కలిగిన పదార్థాన్ని చూశాక, అదేమిటనే అంశాన్ని బుద్ధితో గ్రహించలేరు. బహిర్ముఖ స్థితిలో తెలుసుకోవాలంటే – దాన్ని తెలుసుకున్న మరో వ్యక్తిని అడిగే తెలుసుకోవాలన్నమాట ! అంతర్ముఖులై తత్వాన్ని గ్రహించినా బహిర్ముఖత్వానికి వచ్చాక తాము గ్రహించింది సత్యమో, భ్రాంతియో అనేదాన్ని నిశ్చయించుకోవడానికి మరొక తత్వజ్ఞుడు అవసరం. తన అంతర్ముఖత్వంలో తెలుసుకున్న దాని గురించి అతణ్ణి అడిగి తృప్తి పడాల్సి ఉంటుంది. ఈ దిశలో అనుభవం, స్థూల గ్రంథాల్లోని సిద్ధాంతాలు కూడా ఉపకరిస్తాయి.

అంతర్ముఖస్థితిలో జ్ఞాన నేత్రానికి గోచరమైనదేమిటనే విషయం తనంతట తాను గోచరిస్తుంది. అలా సాధ్యమౌతుందని చెప్పడం ఎలా అనే ప్రశ్నకు ఉమాదేవి బ్రహ్మను ఎలా తెలుసుకుంది? అనేదే సమాధానం. ఆమె కూడా ఇంకొకరినడిగి తెలిసికొని ఉండాలి కదా? అనే విషయంలో తొట్టతొలుత గ్రహించిన వాళ్ళు ఎలా గ్రహించారు? వారికి ఎవరు చెప్పారు? అనే ప్రశ్నకు ఉత్తరం – బ్రహ్మమే చెప్పి ఉండాలి కదా? అంటే దేవతలకు సాక్షాత్కరించిన బ్రహ్మ ప్రతినిధి అయిన యక్షుడే తన గురించి చెప్పుకోలేదన్నప్పుడు బ్రహ్మం చెబుతుందా? అనే ప్రశ్నే జవాబు. బ్రహ్మ అంటే ఏమిటో తెలుసుకుంటే – అతనిలో మనలో లాగ బహిర్ముఖ క్రియలుండవు. అతడు నిరంతరం అంతర్ముఖి. అందువల్లనే అతడు నిరంతరం ఆనందంలో నిమగ్నుడై ఉంటాడు. అఖండానంద విగ్రహుడు "నిశ్శబ్దం బ్రహ్మముచ్యతే" అనే వాక్యం దీన్నే సూచిస్తుందనే విషయం స్ఫురిస్తుంది.

అదీ కాక "వేదం అపౌరుషేయం" అనే మాట ఎందుకు వచ్చిందనే విషయాన్ని గురించి ఆలోచించాలి. వేదాల్లో బ్రహ్మజ్ఞానం, సృష్టి జ్ఞానాల వర్ణన ఉంది. దాన్ని తొట్టతొలుతగా గ్రహించిన వారు – ఎవరినో అడిగి తెలుసుకోలేదు. ఈ సృష్టి ఏమిటి? నేనెక్కణ్ణుంచి వచ్చాను? ఎక్కడున్నాను ఇది వరకు? నావలె ఈ సృష్టికి మూలం ఏది? వీటన్నిటి గురించి తెలుసుకునేందుకు పరితపిస్తుండగా ధ్యానస్థితిలో (ఏకాగ్రత నిశ్చల మనస్సులో) ఆ ప్రశ్నలకు జవాబు లభించింది అంటే సత్యజ్ఞానం కల్గింది. అది ఆ జ్ఞాని ముఖం నుండి వాణి రూపంలో ప్రత్యక్షమైంది. ఆ వాక్కు ఆ జ్ఞానిదే అయినా, ఆ సత్య జ్ఞానం అతని సొంతం కాదు. ఇంకెవరో చెప్పింది కాదు. అది స్వతఃసిద్ధంగా వచ్చింది. అందుకే అతడు

'మంత్ర ద్రష్ట' అనిపించుకున్నాడు. ఆ శబ్దాల అంతరార్థాన్ని దర్శించ గల్గాడు. చర్మచక్షువులతో కాదు ! జ్ఞానదృష్టితో ! ఇలా జ్ఞానాన్ని ఆకాంక్షించే వ్యక్తిలో ఒక్కోసారి ఒక్కో ప్రశ్న (దేన్నో తెలుసుకోవాలనే కోరిక) కల్గి అతడు దాని కోసం పరితపించాక అతనికి ఆ సత్యాంశం తెలిసి అతని నుంచి వాగ్రూపంలో బయటికి వచ్చింది. ఇలా వేదోపనిషత్తులన్నీ జ్ఞానపు అంగాలు, ఉపాంగాలు. (పూర్ణుడైన పరమాత్మ యొక్క అంగాలు). పూర్ణుడైన పరమాత్మను పూర్ణంగా తెలుసుకోవడం అపూర్ణులైన జగత్తులోని జనులకు సాధ్యం కాదు. మీకు తెలియాలనే కోరిక పుడుతూనే ఆ తత్వం తెలియడం ఆ పూర్ణుని దయ వల్లనే జరుగుతుంది. ఈ విషయాన్ని గ్రహించినారు కాబట్టే "అనంతావై వేదాః" అని పల్కి "మేము బ్రహ్మన్ని తెలుసుకున్నాం" అనే వాళ్ళకు బ్రహ్మజ్ఞానం కలుగలేదు. "మేం తెలుసుకో జాలము" అని సవినయంగా పల్కే వాళ్ళకు మాత్రం ఆ పూర్ణుని కృప లభిస్తుంది. అందువల్ల వాళ్ళు తెలుసుకోగల్గుతారనేది ఈ ఉపనిషత్తులోని ముఖ్య సందేశం.

**శాంతి మంత్రం**

**ఓం అప్యాయంతు మమాంగాని వాక్ప్రాణశ్చక్షుః**
**శ్రోత్ర మథోబలమింద్రియాణి చ సర్వాణి**
**సర్వం బ్రహ్మోపనిషదం మాహం బ్రహ్మ నిరాకుర్యాం**
**మామాబ్రహ్మ నిరాకరోద నిరాకరణ మస్త్వ నిరాకరణం మేస్తు**
**తదాత్మని నిరతేయ ఉపనిషత్సు ధర్మాస్తే**
**మయిసంతు తే మయ సంతు**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

నా అంగాలైన వాక్కు, ప్రాణం, కన్ను, చెవులు తృప్తి చెందనీ. ఇవన్నీ బ్రహ్మత్వానికి అతి సమీపంలో ఉన్నాయి. నేను బ్రహ్మత్వాన్ని నిరాకరించకుందును గాక ! బ్రహ్మత్వం నన్ను నిరాకరించకుండు గాక! (అది నాకు ఆ బ్రహ్మ దయతోనే లభించనీ) నిరాకరణం కాకుండానీ ! నిరాకరణం కాకుండనీ ! ఆత్మరతుడనయ్యాక, సత్యసామీప్యం వల్ల ధర్మం నాలో చిరకాలం నిలువనీ, నాలో నిరంతరం ఉండనీ.

శాంతిమంత్రంలోనే ఉపనిషత్కారులు బ్రహ్మజ్ఞానం ఎలా సాధ్యం అనే విషయాన్ని సూచ్యంగా చెప్పారు. కర్మేంద్రియాల్ని నిగ్రహించి, ఇంద్రియ వృత్తుల్ని నిరోధించి, మనస్సు మరియు ప్రాణాల సహకారంతో బ్రహ్మత్వాన్ని గ్రహించేందుకు ఊర్ధ్వగాములు కావాలి. తాను (మనస్సు) బ్రహ్మత్వాన్ని నిరాకరించకుండా ఉండాలి. అంటే తెలుసుకోవాలనే ఆకాంక్ష ఉండాలి. అది లేకుంటే ఈ మానవ జన్మే వ్యర్థమని వాళ్ళ భావం. బ్రహ్మజ్ఞానాకాంక్ష పూర్ణం అయ్యేందుకు పూర్ణుని (పరమాత్మ) కృప చాలా అవసరం. అందుకే 'బ్రహ్మ నన్ను నిరాకరించకుండ ఉండనీ' అనే మాట వచ్చింది.

ఇలా పూర్ణుని దయతో జ్ఞానప్రాప్తి కల్గాక మనస్సుకు తృప్తి. ప్రాణుని ద్వారా కర్మేంద్రియాలకు అమృతప్రాప్తియై పుష్టి లభిస్తుంది. బ్రహ్మేంద్రియాలకూ అలాగే ! ఇంద్రియ వృత్తులకు నిర్వికారత్వం. ఇంత జరిగినా మళ్ళీ బహిర్ముఖ స్థితికి వచ్చి లౌకిక వ్యవహారంలో మునిగినాక మోహాది ద్వంద్వాలకు తగుల్కొని ఆ బ్రహ్మత్వపు నిరాకరణం (దాని వైపు నుండి దూరం కావడం, మళ్ళీ మళ్ళీ కోరని ఇంద్రియ లోలత్వం) కల్గుతుంది. ఇది సహజం అని అనుభవంతో గ్రహించి జ్ఞానులు పలికిన మాటే – 'నేను బ్రహ్మత్వాన్ని నిరాకరించకుందును గాక' అనేది.

ఆత్మరతుడై ఆ స్థితిలో తెలిసిన ధర్మానికి అనుగుణంగా జీవించేందుకు అవసరమైన క్రమం మన బ్రతుకులో నిరంతరం స్థిరమై నిలచి పోనీ ! తద్విరుద్ధమైన జీవనం మనది కాకుండా ఉండనీ ! అనే తపన, ఆత్మ జాగృతి ఇక్కడ గోచరిస్తోంది.

**ఓం కేనేషితం పతతి ప్రేషితం మనః**
**కేన ప్రాణః ప్రథమః ప్రైతియుక్తః**
**కేనేషితాం వాచమిమాం వదంతి**
**చక్షుః శ్రోత్రం క ఉదేవోయునక్తి ॥** 1

ఎవరి ప్రేరణతో మనస్సు విషయంలో ప్రవృత్తమౌతోంది? ఎవరి వల్ల మొట్టమొదటి ప్రాణం తన క్రియను ప్రారంభించింది? ఎవరి ఇచ్ఛతో వాక్కు పల్కుతుంది? కన్నులు, చెవులు - వీటిని ఆదేశించే దేవతలెవరు? తన అనుభవవేద్యమైన వస్తువులు, విషయాల వల్ల అనుభవానికి రాని వాటి మూలాలను తెలుసుకునేందుకు మానవునిలో జిజ్ఞాస కల్గుతుంది.

వస్తువుల సహవాసంతో మనస్సులో కోరిక పుడుతుందని చెప్ప వచ్చు. సహవాసం కల్గినా అనుభవించే కోరిక కొందరిలో కొన్నిసార్లు మాత్రమే కల్గుతుంది. కొన్నిసార్లు కల్గదు. ఇలా కోర్కె పుట్టడానికి, పుట్ట కుండా ఉండడానికి కారణం ఏమిటి? దీనికి బదులుగా "జన్మ సంస్కారం, పూర్వజన్మ వాసన" అంటే – జీవి యొక్క మొట్టమొదటి జన్మలో ప్రవృత్తి ఎందుకు కల్గింది? అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. అలాగే సృష్టి కార్యాన్ని ప్రారంభించిన ప్రథమ వృత్తిలోని ఆ కోర్కె ఎందుకు కల్గిందనే ప్రశ్న వస్తుంది.

ఇంద్రియ వృత్తులు వాక్కు, చెవులు, కళ్ళు మొదలైనవన్నీ మనస్సు యొక్క ఆదేశంతోనే ప్రవృత్తం కావడం నిజం ! అయితే కొన్నిసార్లు మనస్సు కోరినా మాట వెలువడదు. కాలు కదలదు. ఎందుకు? ఆ కర్మేంద్రియాలు శక్తిహీనంగా వుంటాయి. దానికి కారణం అక్కడ రక్త సంచారం లేకుండా ఉంటుంది. అలా కావడానికి అక్కడ గాలి కదలిక నిలిచి పోవడమే కారణం. దానికి కారణం ఆ దారిలో (నరాల్లో,నాడుల్లో) మలినం చేరిపోవడం. దాన్ని శుద్ధీకరించేందుకు తగిన శక్తి వాయువుకు లేకపోవడం కారణం. ఆ శక్తిని ప్రాణశక్తి నుండి పొందే విధానం మనస్సుకు తెలియకపోవడమే కారణం. దానికి కారణమేమిటంటే – ప్రాణం నుండి మనస్సు దూరమై, దాన్ని గ్రహించి ప్రాణాన్ని ఆశ్రయిస్తే, ప్రాణం ద్వారా వాయువుకు ఆ శక్తి కల్గేట్లు చేసి, కర్మేంద్రియాల, అలాగే బ్రహ్మేంద్రియాల అసామర్థ్యాన్ని తొలగించవచ్చు. అంతే కాకుండా ఇంద్రియ లోలత్వంలో పడిపోయి, తనలో కల్గిన అశాంతి, అధైర్యం, అసంతృప్తి వీటన్నిటిని తొలగించుకోవచ్చు.

ఇక్కడ మన దేహంలోని ప్రాణమనే శక్తి ఇంద్రియాలకూ, అలాగే మనస్సుకు కూడ ఆధారమనిపిస్తుంది. ఉత్పత్తి అయిన ఆదిభూత వాయువనే (ఆకాశంలో) శ్రుతి వాక్యం ఉంది. ఆకాశం భూతమనీ, అది ఆత్మలోంచి ఉత్పత్తి అయిందనీ భ్రమించడం, సత్యం కాదు. “ఆత్మావై ఆకాశః” అనే మాటకు “ఆత్మ ఆకాశంలో” (ఉండే వాడు, ఉంటాడు) అని అర్థం. ఆత్మ నుండి ఆకాశం ఉత్పత్తి అయిందనీ, ఆ వాయువు నుండి అగ్ని – ఇలా మిగిలిన భూతాల పుట్టుకను గ్రహించాలి. మొదటి భూతమైన “వాయువు' మన దేహంలో ప్రాణశక్తి లేకుంటే పని చేయదు. ప్రాణం నుండి పోషక ద్రవ్యం లభించ కుంటే శక్తి హీనమౌతుందన్నాక ఆ వాయువు 'ప్రాణం' లోంచి ఉత్పన్నమైనదని తెలుస్తుంది కదా !

ఇలా సమస్త భూతాల, ధాతువుల ఉత్పత్తికీ, పోషణకు మూల కారణమైన మరియు మనస్సుకు మూలాధారమైన ఈ ప్రాణశక్తి మొట్టమొదట తన క్రియను ఎవరి ఇచ్ఛతో ప్రారంభించింది. ఇది ఉపనిషన్మంత్రంలోని ప్రశ్న.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో**
**యద్ వాచోహవాచం స ఉ ప్రాణస్య ప్రాణః**
**చక్షుషశ్చక్షు రతి ముచ్చధీరాః**
**ప్రేత్యాస్మాల్లో కాదమృతా భవంతి ॥** **2**

ఏది చెవులకే చెవియో, కన్నుకే కన్నో, మనస్సుకే మనస్సో, వాక్కుకే వాక్కో అది ప్రాణానికి ప్రాణం. ధీరులైన వాళ్ళు వీటికి అవతలకు వెళ్ళతారు. (వీటన్నిటికీ మూలకారణమేదో అలాంటి దేవుని దగ్గరకు) ఈ లోకాన్ని వదలిపోయిన తర్వాత వాళ్ళు అమృతులౌతారు. (జనన మరణ చక్రంలో వాళ్ళు మళ్ళీ చిక్కుకుపోరు). ఎందుకంటే వాళ్ళు సర్వానికీ మూలమైన పరబ్రహ్మలో ఐక్యమౌతారు. ఇక్కడ మొదటి మంత్రంలోని ప్రశ్నలకు సూచ్యంగా ఉత్తరం ఇచ్చారు ఉపనిషన్మహర్షులు. ఈ ఇంద్రియాలు, వాటిని పరిపాలించే మనస్సు, దానికి ఆధారమైన, అన్నిటికీ మూలమైన బ్రహ్మం నుండే వీటన్నిటికీ శక్తి, ప్రవృత్తులుంటా యనేదే వారి భావన. ఇక ఆ బ్రహ్మ గురించి చెబుతారు.

**న తత్ర చక్షుసర్గచ్ఛతి నవాగ్గచ్ఛతి**
**నో మనో నవిద్మోన విజానీమో**
**యధైతదనుశిష్యా దన్య దేవ తద్విదితా**
**దథో అవిదితాదాధి ఇతి శుశ్రుమ**
**పూర్వేషాం యేనస్తద్వ్యా చచక్షిరే ॥** **3**

అది ఉండే చోటికి (బ్రహ్మం) మన దృష్టి పోజాలదు. వాక్కు మనస్సు పోజాలవు. శిష్యులకు అర్థమయే రీతిలో బోధించేందుకు దాన్ని గురించి జ్ఞానం మనకు తెలీదు. తెలిసిన, మరియు తెలియని ఇంద్రియ గోచరమైన, మాకు ఆ జ్ఞానాన్ని బోధించిన పూర్వీకులనుండి మేం ఇలాగే విన్నాం.

ఇక్కడ ఉపనిషత్కారుల సత్యవాక్య ప్రియత్వాన్ని అర్థం చేసు కోవాలి. ఆ బ్రహ్మ ఉండే స్థానం ఏది? అనేదాన్ని వాళ్ళు సూచ్యంగా చెప్పారు. మనకు ఇంద్రియగోచరమైన, అలాగే బుద్ధి గమ్యమైన వస్తువుల కవతల, ఇంద్రియ గోచరం కాని, బుద్ధి గ్రాహ్యం కాని వస్తువులెన్నో ఉన్నాయి. ఇలా తెలిసిన, మరియు తెలియని వస్తువుల కవతల ఉండేదే బ్రహ్మస్థానమనేదే వారి భావన. సత్తు, సత్తుల అవతలి ఆ స్థానమనేదే వారి భావం. దాన్నే గీతలో ఎక్కడ సూర్యుడు ప్రకాశించడో, గాలి వీచదో" మొదలైన వాక్యాల్లో వర్ణించడమైనది. ఆ బ్రహ్మను వాళ్ళు (ఋషులు) దర్శించినా దాన్ని మేమెరుగం అనడంలో వాళ్ళ వినమ్రత గోచరిస్తుంది. వారికి ఆ విషయంలో పరిజ్ఞానమే లేకుంటే ఆ విషయం గురించి వాళ్ళు చెప్పే వాళ్ళు కాదు. లేదా ఎరుగమని చెప్పి అక్కడితో దాన్ని ఆపివేసే వాళ్ళు. అలా చేయకుండా వాళ్ళు "శిష్యులకు అర్థమయ్యే రీతిలో బోధించే స్థాయిలో (సంపూర్ణం) మా జ్ఞానం లేదు. అంతే కాదు. తమకు ఉపదేశించిన పూర్వీకులు (మహానుభవం ఉన్న వాళ్ళు) అలాగే చెప్పార"న్న ఋషివాక్యంలో పూర్ణమైన బ్రహ్మను ఎవరూ పూర్ణంగా తెలుసుకోలేరు. ఎందుకంటే – సృష్టిలో అణుప్రాయుడైన వ్యక్తి యొక్క సర్వశక్తులూ పరిమితమైనవి. అందువల్ల బ్రహ్మ గురించి తెలుసుకోవాలను కునే వారికి తెలిసిన వాళ్ళు చెబుతూ కూర్చోరు. వాళ్ళే దాన్ని అంతర్ముఖ స్థితిలో

గ్రహించేందుకు ప్రేరేపించాలన్న ఋషుల ఉద్దేశం ఇక్కడ తేట తెల్లమౌతోంది. ఇదే నిజమైన మార్గదర్శనం. దీన్ని గురువు శిష్యుడికి అందించాలి. దాన్ని వదలి కేవలం గ్రంథాల్ని చదివి జ్ఞాని అయ్యానని భ్రమించే వాళ్ళు "నేను బ్రహ్మను తెలుసుకున్నా, నేనూ బ్రహ్మమే అయి ఉన్నాను. నీవు బ్రహ్మవే. అంతా బ్రహ్మమే" మొదలైన మాటలంటారు. వాళ్ళు తెలుసుకోకుండా తెలుసుకోవాలనే ఆకాంక్ష ఉన్న వాళ్ళను కూడా ఆ ప్రయత్నంలోంచి విరమింపజేసి, భ్రాంతిని కల్గిస్తారు. ముందు 4 నుండి 8 మంత్రాల దాకా వాక్కు యొక్క శక్తితో దేన్ని స్పష్టంగా తెలుసు కోవడం సాధ్యం కాదో, ఏది వాక్కు ప్రకటం కావడానికే ఆధారమో అదే బ్రహ్మ అని చెప్పబడింది. అలాగే ఆలోచనా శక్తికి అందని, కనులతో చూడశక్యం కాని, చెవితో ఆలకించ శక్యం కాని వస్తువు ఏదైతే ప్రాణుని వల్ల జీవించి ఉందో అదేదీ బ్రహ్మం కాదు. జనులు దేన్ని బ్రహ్మగా ఉపాసిస్తున్నారో అది బ్రహ్మం కాదని చెప్పబడింది.

**యది మన్యసే సువేదేతి దభ్రమే వాపిమానం త్వం వేత్థ**
**బ్రహ్మణో రూపం యదస్య యదస్యత్వం దేవేష్వథను**
**మీమాంస్యమేవ తే విదితమ్ మన్యే॥ 9**

నేను బ్రహ్మను తెలుసుకున్నానని నీవు తెలుసుకొని ఉంటే ఆ బ్రహ్మ స్వరూపాన్ని నీవు చాలా తక్కువ మోతాదులో గ్రహించావు. ఏ బ్రహ్మను నీవెరుగుదువని భావించినావో, అతని శక్తి నీలోనూ, దేవత ల్లోనూ ఏ రీతిలో ఉందనే అంశం గురించిన చర్చ ఇంకా నడవాలని నా అభిప్రాయం.

ఇక్కడ ఉపనిషన్మహర్షి చెప్పిన అభిప్రాయం గమనించదగింది. బ్రహ్మశక్తియే అన్ని చోట్ల వ్యాపించింది. లోకలోకాంతరాలతో కూడిన

బ్రహ్మాండమూ, అందులోని వస్తువులు, ధాన్యాలు, ప్రాణులు, పక్షులు, మృగాలు, కీటకాలు, మనుష్యులు, దేవతలు – ఇలా రకరకాలుగా ఉండే సమస్తంలో బ్రహ్మ శక్తియే ఉంది. వస్తువులు, ప్రాణి, పక్షి, మానవుడు, దేవతలు – వీరందరిలో ఒకే ప్రమాణంలో ఉంది. అలాగే కొన్నిటిలో వ్యత్యస్త ప్రమాణంలో ఉంది. ఈ జ్ఞానం ఇంకా నీకు కల్గలేదు. దాన్ని నీవు గ్రహించాలనేదే మా భావన.

**ప్రతిబోధ విదితం మత మమృత్వం హివిందతే ।**

**ఆత్మనా విందతే వీర్యం విద్యయా విందతేఽ మృతం (4–12)**

జ్ఞానం సత్యదర్శనం ద్వారానే కలుగుతుంది. (శాశ్వతుడైన బ్రహ్మ దర్శనమైనపుడే అతని స్వభావం మనలో ప్రతిఫలించి, అనుభవానికివచ్చి జ్ఞానమౌతుంది. అదే ప్రతిబోధం. దాని వల్లనే అమృతత్వ ప్రాప్తి, ఆత్మ వల్లనే వీర్యం (జ్ఞానప్రకటనా శక్తి) ప్రాప్తమౌతుంది. విద్యవల్ల, ప్రాణ మనోమిలన యోగ విద్య వల్ల అమృత రసం ఉత్పన్నమై ఇచ్ఛా మరణం పొందడం సులభమౌతుంది.

**ఇహ చే దవేదీ దథ సత్యమస్తి**

**న చేదహావేదీన్మహతీ వినష్టిః**

**భూతేషు భూతేషు విచింత్యధీరాః**

**ప్రేత్యాస్మాల్లో కాదహీతా భవంతి॥ 13**

ఈ లోకంలో దేన్ని తెలుసుకుంటే మాత్రం సత్యం ఉంటుంది. అలాగే ఈ లోకంలో గ్రహించకుంటే చాలా నష్టం జరుగుతుంది. ఇంతకు ముందు (అమృతత్వాన్ని పొందిన) ధీరులు ఇదే రీతిలో గ్రహించి ఈ మృత్యులోకాన్ని వదలిపోయాక అమృతత్వాన్ని పొందారు. ఇక్కడ

ప్రాణులన్నిటిలో మానవులకే ఈ జ్ఞానాన్ని పొందడం సాధ్యమనీ, ఈ భూలోకంలో మాత్రమే అది సాధ్యమనీ, వేరే లోకాల్లో ఇది లభ్యం కాదనీ మనం గమనించాలి.

**తద్ధ తద్వనం నామ తద్వన మిత్యుపాసితవ్యం ।**
**సయ ఏతదేవం వేదాభి హైనం**
**సర్వాణి భూతాని సం వాంఛంతి॥ (4-6)**

అది (బ్రహ్మ) ఆశ్రయమనీ (సర్వానికీ ఆనందస్వరూపమనే అర్థమూ ఉంది. 'వన' అనే శబ్దంలో) దాన్ని ఉపాసించాలి. ఇలాంటి బ్రహ్మజ్ఞాన ముండే వ్యక్తి యొక్క కృపను పొందాలనీ అందరూ కోరు కుంటారు.

**తస్యై తపో దయః కర్మేతి**
**ప్రతిష్ఠా వేదాః సర్వాంగాని । సత్యమాయతనం 4-8**

తపస్సు, దమం, కర్మ - వీటి పైనే జ్ఞానం ప్రతిష్ఠితమైంది. అంటే జ్ఞాన ప్రాప్తికి ఇవే ఆధారాలు. సకల వేదాలు (సత్యాంశాల నెరిగిన అనేక జ్ఞానుల ద్వారా ప్రకటించబడిన) ఆ జ్ఞానపు అంగాలు సత్యమే. శాశ్వత బ్రహ్మమే వాటికి ఆశ్రయస్థానం.

**యోవా ఏతామేవం వేద అపహత్య పాప్మాన మనంతే**
**స్వర్గేలోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి 4-9**

వీటిని ఇలా తెలుసుకున్న వ్యక్తి పాపాలన్నిటినీ అంతం చేసి స్వర్గ లోకంలో చేరుతాడు. ఇక్కడ స్వర్గలోకమంటే సువర్లోకం కాదు. తాను తొలుత ఎక్కడ నుండి వచ్చాడో (జీవాత్మ) ఆ స్థానం (బ్రహ్మ).

# 3. కఠోపనిషత్తు

ఈ ఉపనిషత్తులో తత్వజ్ఞానం ఒక కథ ద్వారా బోధింపబడింది. ఆ కథ ఇలా ఉంది. ప్రాచీన కాలంలో వాజశ్రవసుడనే బ్రాహ్మణుడు తాను మహాత్యాగి అనిపించుకోవాలని భావించి "విశ్వజిత్' యాగం చేశాడు. పేరుకు తగినట్లే విశ్వాన్నే జయించిన చక్రవర్తి చేసే యాగమది! అందులో కర్త తన సర్వస్వాన్ని దానం చేసే తీరాలి. దానం చేయడంలో ఉద్దేశ్యం పరోపకారం చేయడం, నిస్వార్థభావనను పెంపొందించు కోవడమే కదా ! అయితే ఆ పేద బాపడి దగ్గర ఏముంది? కొన్ని బక్క చిక్కిన ఆవులు, కాస్తో కూస్తో ధాన్యం. ఇంతే ! ఇలాంటి దానం వల్ల ఎంత మందికి ఉపకారం ఔతుంది? అందువల్ల అతడు యాగం చేసేది కీర్తికండూతితోనే ! ఉత్తమ లోకాల ప్రాప్తి కూడా అతని లక్ష్యం !

దీన్ని గమనించి ఆ విప్రుడి చిన్న కొడుకు (6 సం॥లు) అది తప్పని తెలిసి, అన్నాడు – "నాయనా ! నన్నెవరికి దానం చేస్తావు?" అని. తండ్రి కూడా కొడుకు తనను పరిహాసం చేస్తున్నాడని కుపితుడై "నిన్ను యముడికి దానం చేస్తున్నాను" అన్నాడు. తర్వాత తన క్రోధం తెలిసి పశ్చాత్తాపం పొందాడు. అయినా తండ్రికి అసత్య దోషం రాకూడదని, తనను యముని వద్దకు పంపాలనీ, మానవ జన్మ శాశ్వతం కాదనీ, చింత చేయరాదనీ తండ్రికి వివరించాడు. తండ్రి కూడా కొడుకును యముడి వద్దకు పంపించాడు. యముడు ఇంట్లో లేడు. మూడు రోజులు ఆ బాలకుడు (నచికేతుడు) అతని కోసం నిరీక్షించాల్సి వచ్చింది. తన కోసం మూడు రోజులు ఉపవాసం చేస్తూ కూర్చున్న ఈ బాల అతిథిని చూచి, ఆశ్చర్యపడిన యముడు క్షమించమని అడిగి, మూడు వరాలను కోరుకోమన్నాడు.

తన తండ్రి కోపం శాంతించి, తాను ఇంటికి తిరిగి వెళ్లాక అతడు తనను ప్రేమతో చూసుకోవాలి. అతని చింత లేకుండా శాంతిని పొందాలని నచికేతుడు మొదటి వరాన్ని కోరుకున్నాడు. 'తథాస్తు' అని యముడన్నాడు. తర్వాత స్వర్గలోక ప్రాప్తికి సాధనమైన అగ్ని ఉపాసనా విధానాన్ని తెలుపమని నచికేతుడు రెండో వరం అడిగాడు. ఆ బాలుడి మేధస్సుకు ఆశ్చర్యపడి మెచ్చుకొని, ఇక పై యజ్ఞపు అగ్ని 'నచికేతాగ్ని'గా పిలవబడుతుందని చెప్పి ఆ వరాన్ని కూడా ప్రసాదించాడు యముడు. మూడో వరంగా నచికేతుడు ఆత్మజ్ఞానాన్ని కోరాడు. అది చాలా కష్టం. అందువల్ల దానికి బదులుగా భోగైశ్వర్యాలు, రాజ్యాధికారం, ఆయువు – కానీ తనలోనే ఉంటూ సకల స్వర్గసుఖాల్ని అనుభవించే వరం కానీ వేడుకొమ్మన్నాడు. ఈ ప్రలోభాలకు లొంగక, నచికేతుడు తనకు బ్రహ్మ విద్యయే కావాలన్నాడు. "అది దుర్గమం, మహామేధావులైన తపస్వులు, దేవతలు కూడా దాన్ని సరిగ్గా తెలుసుకోలేక పోయారు. ఇంకో వరమేదైనా అడుగు" అని యముడు అన్నాడు. నచికేతుడు "అది అమూల్యమై నందు వల్లే దాన్ని కోరాను. దాన్ని ప్రసాదించేందుకు నీలాంటి యోగ్యులు మళ్ళీ దొరకరు. అందువల్ల నీవు నాకు దాన్నే ప్రసాదించమని కోరాక యముడు అతని సత్యాకాంక్ష, స్థిరసంకల్పాలకు మెచ్చి బ్రహ్మ జ్ఞానాన్ని ఉపదేశించాడు. ఆ ఉపదేశ సారాంశం ఇలా ఉంది.

సుఖమార్గాలు రెండు. ఒకటి శ్రేయో మార్గం. రెండోది ప్రేయో మార్గం. ఇహలోకంలో సుఖం, అలాగే చనిపోయాక స్వర్గాది సుఖాలనో, ముందరి జన్మలో సుఖానుభవాన్నో కోరుకుంటూ చేసే కర్మ, పూజ, వ్రతం, యజ్ఞం – ఇవన్నీ కలిపితే అదే ప్రేయోమార్గం. మూఢులు దీన్ని కోరుకుంటారు. మరో వస్తువు ద్వారా లభించే సుఖం శాశ్వతం కాదని

గ్రహించి, దేవుని దయతో మాత్రమే లభ్యమయ్యే జ్ఞాన మోక్షాలే శాశ్వత సుఖ (అమృతత్వ)మని గ్రహించి యోగస్థుడై జ్ఞానప్రాప్తి కోసం ప్రయత్నించడమే శ్రేయోమార్గం. జ్ఞానమనేది తర్కంతో గాని, వినడం ద్వారాగాని లభించదు. సూక్ష్మాతి సూక్ష్మమూ, అత్యంత శక్తివంతమూ అయిన ప్రణవమే దానికి మూలం. ప్రణవో పాసనలో కల్గే ఆత్మ ప్రసన్నత వల్లనే జ్ఞానప్రాప్తి ఔతుంది. దాన్ని కోరుకొనే వాడు ఇంద్రియాల్ని, మనస్సును నిగ్రహించుకుని, బుద్ధిని నిర్వికారం చేసి, పరమాత్మ ధ్యానంలో లీనం కావాలి. బుద్ధికి అవతల మహత్తత్వానికి అధిదేవుడైన హిరణ్యగర్భుడుండి, అతనికి అవతల అవ్యక్త శక్తి ఉంది. దానికి అవతల పరమపురుషుడు ఉన్నాడు. (బ్రహ్మ,దేవుడు) ధ్యాన యోగంతో అతణ్ణి దర్శించి, తీక్ష్ణ బుద్ధితో అతన్ని తెలుసుకోవాలి. మనస్సు యొక్క చాంచల్యం లేని స్థితే ధ్యానం. దీని సాధనకు అవసరమైన ఆత్మతత్వం అతి సూక్ష్మ పరిమాణంలో ప్రతిజీవిలోనూ ఉంది. అందువల్ల ఆత్మజ్ఞానం తనలోనే కల్గుతుంది. బయట కల్గదు. అంటే బహిర్ముఖ స్థితిలో కలుగదు.

దేవుడు విశ్వానికి మూలకారణమైనా నిర్లిప్తుడే. ఆత్మజ్ఞానం పూర్ణంగా లభించటమనేది మానవ జన్మలోనే సాధ్యం. దేవ, పితృలోకాల్లో ఇది సాధ్యం కాదు. అందువల్ల దేవుని ఉనికి పై స్థిరమైన నమ్మకం కల్గి, సాధన ద్వారా యోగస్థితిని పొందాలి. హృదయం నుండి వివిధ దిక్కులకు 101 నాడులు వెళ్ళుతున్నాయి. "సుషుమ్నా" అనే నాడి ఊర్ధ్వ గమనాన్ని సాధిస్తేనే యోగస్థితి సాధ్యం. జ్ఞానప్రాప్తితో ఇంద్రియ సుఖాధి సర్వ మోహాలు నశించి పూర్ణ సత్య సాక్షాత్కారమై ఆ వ్యక్తి జీవన్ముక్తుడౌతాడు." ఇదే ఆ ఉపనిషత్తు సారాంశం.

## శాంతి మంత్రం

**ఓం సహనవవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహై**
**తేజస్వినా వధీతమస్తు మా విద్విషావహై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

అతడు మా ఇద్దరినీ రక్షించనీ ! ఇద్దరూ కలిసి వీర్యాన్ని పొందుదాం. మా అధ్యయనం తేజస్వి కానీ (సత్య జ్ఞానాన్ని గ్రహించేందుకు బుద్ధి చురుకు కానీ) మాలో వైషమ్యాలు లేకుండనీ!

గురుశిష్యులిద్దరినీ బ్రహ్మ కాపాడాలనే అర్థాన్నే చాలామంది ఇక్కడ రాశారు. సూక్ష్మంగా వ్యక్తి యొక్క దేహంలోని మనస్సు, ధ్యానానికి ప్రాణశక్తి యొక్క సహకారం అవసరమై అక్కడ మా ఇద్దరినీ అనే దాన్ని మనస్సు, ప్రాణాలకూ అన్వయించుకోవచ్చు. జ్ఞాన గ్రహణానికి అవసరమైన గ్రహణ శక్తి తీక్షణం అయ్యేందుకు కావాల్సిన శక్తే 'వీర్యం'. దాన్ని మేమిద్దరం కలిసి పొందుదామని భావం. ప్రాణ మనస్సుల యొక్క సమ్మేళనపు యోగ స్థితి వీర్యోత్పత్తికి చాలా తగిందని అనిపిస్తుంది. అలాగే అధ్యయనమంటే – ఎక్కువగా గ్రంథాల అవలోకనమనే రాసి ఉండడం కన్పిస్తుంది. అందువల్ల (అవిద్య) జ్ఞానప్రాప్తి సాధ్యం కాదనేది ఉపనిషత్కారుల నిశ్చితాభిప్రాయం. ఇదే సర్వత్ర గోచరిస్తోంది. అందువల్ల అధ్యయనం అనేది అంతర్ముఖ స్థితిలో జరిగే సత్యాన్ని గ్రహించే ప్రయత్నమనే అంశాన్ని గమనించాలి. ప్రాణ మనస్సుల సంగమమే (మిలనం) అధ్యయనానికి సాధనమై, ఆ మిలన స్థితికి ఇంద్రియ వృత్తులతో కల్గే మనశ్చాంచల్యం, దేహంలో కశ్మల సంగ్రహం వల్ల కల్గే ప్రాణ గతిలోని అవరోధాలన్నీ అంతరించాలనేదే ఈ ప్రార్ధన.

ఈ ఉపనిషత్తులో ఉండే నచికేతుని కథలో నచికేతుడు యమ లోకానికి ఎలా వెళ్ళాడనే వివరాలు ఇవ్వబడలేదు. అతడు ఆ స్థూల దేహంతోనే వెళ్ళాడా? అలాగైతే అది అతనికి ఎలా సాధ్యమైంది? అలా కాకుండా అతను మృత్యుపాశ బద్ధుడై యమదూతలచే తీసుకొని వెళ్ళ బడ్డాడా? అలాగైతే మరి సూక్ష్మ శరరంతో మాత్రమే వెళ్ళి ఉండాలి కదా? ఈ ప్రశ్నలకు ఉత్తరం మాకు ముందు ఇవ్వబడిన మంత్రాల్లో సూచ్యంగా లభిస్తుంది. తాను యముణ్ణి మొదటి వరం అడిగే వేళ నచికేతుడు "శాంత సంకల్పః సుమనా యథా స్యాధీతమన్యు ర్గౌతమో మాభిమృత్యో త్వత్ప్ర సృష్టం మాభివదే త్ప్రతీత విత్త్రయాణాం ప్రథమం వరం వృణే" - అన్నాడు. గౌతముడు శాంత సంకల్పుడు కావాలి. అతడు ప్రసన్న మనస్కుడు కానీ; నా గురించిన (కొడుకు చచ్చాడు) చింత దూరం కానీ. నీ దగ్గర నుండి మరలి వెళ్ళిన నన్ను గుర్తించి ప్రీతితో పలకరించాలి. మూడింటిలో దీన్ని తొలి వరంగా అనుగ్రహించు అని కోరుకున్నాడు. ఇక్కడ తన తండ్రి అనకుండా గౌతమ వంశీయుడైన ఉద్ధాలకుడు అని అనడం వల్ల స్థూల దేహత్యాగమై ఉండడం వల్లనే అలా గౌతముడని చెప్పాడనిపిస్తుంది. రెండోది - ఇక్కడ నుండి నేను తిరిగి వెళ్ళాక అతడు నన్ను 'గుర్తించి' అనే చోట నచికేతుడు స్థూల దేహంలో లేడు అని అర్థం ఔతుంది. అలా ఉండి ఉంటే అతని తండ్రి సులభంగా గుర్తించేవాడు. వరం అడిగే వేళ ఇలా అడిగే అవసరం ఉండేది కాదు కదా ? ఉపనిషత్కారుల దృష్టిలో ఈ విషయానికి అంత మహత్వం లేదు. అయినా ఉపనిషత్తును అర్థం చేసుకోవాలనే వాళ్ళకు ఇది చాలా గొప్ప విషయం. ఎందుకంటే - ముందు మూడో వరాన్ని కోరే వేళ నచికేతుడు 'మనిషి చనిపోయాక వాడు ఉంటాడని (జీవాత్మ)

కొందరు ఉండదనీ (దేహంతో పాటు జీవాత్మ కూడ నాశనమైంది) కొందరు చెబుతారు. దీన్ని గురించిన నిశ్చితమైన జ్ఞానాన్ని నీ నుండి నేను పొందగోరుతున్నాను" అని చెప్పాడు.

స్థూల శరీరం లేకుండా సంభాషణ ఎలా సాధ్యం? అనే ప్రశ్న వస్తుంది. సాధకులకు అంతర్ముఖత్వంలో జ్ఞానులైన ఋషుల, సిద్ధ పురుషుల, దేవతల దర్శనం, వాళ్ళతో సంభాషణ జరగడం సహజం. అపుడు పని చేసేది మనోనేత్రం. వినడం, మాట్లాడడం మనోనేత్రంతోనే! అపుడతడు తన స్థూలదేహాన్ని వదిలే వచ్చి ఉంటాడు. మృత్యుపాశానికి బలై అక్కడ తానుండటం (సూక్ష్మ శరీరం నుండి జీవాత్మ) అనుభవంతో తెలుసుకున్న వ్యక్తి చనిపోయాక జీవాత్మ ఉంటాడో, లేడో అని ఎందుకు అడుగుతాడు? అదీ కాక జనన మరణాల చక్రం నుండి బయటపడిన తర్వాత మోక్షం లభ్యం అనేదే నచికేతుని అభిప్రాయం అనిపిస్తుంది. మోక్షమనే స్థితిలోనూ కొందరు చెప్పినట్లు మళ్ళీ జనన మరణాలకు లోను కాకుండా, నిరంతరం ఆనందానుభవం పొందుతూ జీవాత్మ ఉంటాడా? లేక మళ్ళీ కొందరు చెప్పినట్లు బ్రహ్మలో ఏకమై, జీవాత్మ అస్తిత్వమే లేనట్లవుతుందా? ఇదే నచికేతుని ప్రశ్న కాబోలు !

అతని బుద్ధి తీక్షణతను ప్రశంసించి యముడు అతనితో "నచికేతా! నీవు విద్యార్థివి (నిజమైన జ్ఞానాకాంక్షివి) అని అనడం కన్పిస్తుంది.

అలాగే స్వర్గ ప్రాప్తికి సాధనమైన అగ్ని ఉపాసనాక్రమాన్ని తెలపాలని నచికేతుడు రెండో వరాన్ని అడిగాడు. ఇక్కడ 'స్వర్గం' అంటే పుణ్యకర్మల ఫలం ఉన్నంత కాలం ఉండి, పుణ్యం క్షీణించగానే మర్త్య లోకానికి వచ్చే స్వర్గం అని కాదు. నచికేతుని అభిప్రాయంలో అని అనిపిస్తుంది.

**సత్వమగ్నిం స్వర్గమధ్యేపి మృత్యో ప్రబ్రూహి**
**త్వం శ్రద్ధధానాయ మహ్యం**
**స్వర్గలోకా అమృతత్వం భజంత**
**ఏతద్వై ద్వితీయేన వృణే వరేణ** **13**

అని అంటాడు. ఇక్కడ స్వర్గలోకంలో అమృతత్వాన్ని పొందారనే భావం ఉంది. మళ్ళీ పుడతారనే భావం లేదు. అదీ కాక యముడు నచికేతునికి చెప్పిన దాంట్లో ఆ అగ్ని యొక్క ఉపాసనతో జనన మరణ చక్రం నుండి జనులకు విముక్తి లభిస్తుందని అంటాడు.

**త్రిణాచికేత స్త్రిభిరేత్య సంధిం**
**త్రికర్మకృత్త రతి జన్మమృత్యూ**
**బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వా**
**నిచాయ్యేమాం శాంతి మత్యంతమేతి** **7**

జన్మ మృత్యువుల్ని దాటడమే కాకుండ ఆ అగ్ని గురించి తెలుసుకొని పరమశాంతిని పొందుతాడని అంటాడు. దీన్నే భగవద్గీతలో "అమృతత్వ పరమపదవి" అన్నాడు కృష్ణుడు. "చిరశాంతి మధిగచ్ఛతి" అని కూడా చెప్పబడింది. అలాంటపుడు, ఇక్కడ యముడు అగ్ని పూజతో "నిచాయ్యే మాం శాంతి మత్యంత మేతి" అని చెప్పడం వల్ల మోక్షాన్ని పొందుతానని పల్కడం చూస్తే నచికేతుని అభిప్రాయంలో 'స్వర్గం' అంటే మోక్షమనీ, అగ్ని ఉపాసన అనీ, జనన మరణాల్లో పడవేసే మామూలు స్వర్గం ఇది కాదనీ గ్రహించడం అవసరం. అదీ కాక యముడు –

**ప్రతే బ్రవీమి తదు మే ని బోధ**
**స్వర్గ్యమగ్నిం నచికేతః ప్రజానన్**
**అనంత లోకాప్తి మథో ప్రతిష్ఠాం**
**విద్ధిత్వమేతం నిహితం గుహాయామ్** **14**

అని చెప్పాడు. అనంత లోకం అన్నప్పుడు అంతమే లేని లోక మనేది భావం. అనేక లోకాలనే అర్థం కాదు. అదీ కాకుండ అగ్ని 'గుహలో గూఢంగా ఉంది' (హృదయంలో సుప్తస్థితిలో ఉండటం వల్ల జన సామాన్యులకు తెలియని రీతిలో ఉంది) అనడాన్ని చూస్తే నచికేతుడు వరంగా అడిగింది, యముడు అతనికి ఉపదేశించింది యజ్ఞ యాగాదుల్లో, వైదిక కర్మల్లో చేస్తే అగ్ని స్థూల పూజాక్రమం కాదు. ముక్తుడు అయ్యేందుకు తనలోనే (దేహంలోనే) చేయాల్సిన అగ్ని ఉపాసనా క్రమం. (ప్రాణాగ్ని ఉపాసనా క్రమం – అదే యోగవిద్య) అనడం స్పష్టం.

అందువల్లనే దాని ఫలితంగా అనంతలోక ప్రాప్తి జన్మ మత్యువుల నుండే తరించడం, చివరకు పరమశాంతిని (చిరశాంతి, మోక్షం) సాధ్యమని యముడు చెప్పాడు.

అయితే మనకు తెలిసినంత మేరకు ఈ అర్థాన్ని ఏ ఉపనిషత్ భాష్యకారుడూ ఇది వరకు రాసిన దాఖలాలు లేవు. కారణమేమంటే భాష్యకారులు విద్యను పొంది,సాగిపోయి, ఆధ్యాత్మికానుభవం, జ్ఞానాల్ని పొందకుండా కేవలం గ్రంథ (భాషా) పాండిత్యం, తర్కబలం కొద్దీ భాష్యాల్ని రచించి ఉంటారనిపిస్తుంది. అందుకేనేమో వాళ్ళల్లో ఏకాభి ప్రాయం కన్పించదు. అలాంటి భాష్యాల్ని చదివి, వాదించే వాళ్ళు గ్రుడ్డి వారి వీపెక్కిన గ్రుడ్డివారితో  సమానం కాక ఇంకేమౌతారు?

వేదాంతం విషయంలో ఈ కోలాహలం (భిన్నాభిప్రాయం) ఉండ కూడదంటే ఆ యోగ విద్య నాశ్రయించి, సాగిపోతూ, అనుభవ జ్ఞానాన్ని పొందితేనే సాధ్యం అవుతుంది. అదీ కాక –

**లోకాది మగ్నిం తము వాచ తస్మై**

**యా ఇష్టకా యావతీర్వా యథావా ।**

**సచాపి తత్ప్రత్య వదద్యథోక్త**

**మథాఽ స్యమృత్యుః పునరే వాహతుష్టః ॥ 15**

ఈ మంత్రానికి చాలామంది స్థూలార్థానే వివరించారు. "ఇష్టకా" అంటే ఇటుకలన్నారు. దీనికి కారణం వాళ్ళకు స్థూలాగ్ని గురించి మాత్రమే తెలిసి ఉండుట. సూక్ష్మ అగ్నిపూజ (గుహలో – హృదయంలో గూఢంగా ఉండే యముడు చెప్పిన అగ్ని ఉపాసన) గురించి వాళ్ళకు తెలియకపోవడమే కారణం.

ఈ 15వ మంత్రంలోని "లోకాదిమగ్నిం' అనే శబ్దం (లోకాలకు ఆది అయిన అగ్ని (మొదట ఉండే – కారణమైన) అనే వేళ, అది వాళ్ళకు తెలిసిన స్థూలాగ్ని కాదనే అంశాన్ని ఇక్కడ గ్రహించాలి. అందువల్ల ఇక్కడ 'ఇష్టకా' అనే శబ్దానికి ఇటుకలు అనే అర్థం చెప్ప కుండా దానికి ఉపకరించే ఆహార విహారాది నియమాలని గ్రహించాలి.

అంతే కాదు, 'వేదిక' అనే శబ్దమే ఉపనిషన్మంత్రంలో లేదు. 'ఇష్టకా' అనే శబ్దాన్ని 'ఇటుక' అని తప్పుగా భావించడం వల్ల ఈ 'వేదిక' అనే శబ్దం లేకున్నా వీళ్ళు చేర్చుకోవాల్సి వచ్చింది. తమ అర్థాన్ని, సమర్థించుకునేందుకు వీళ్ళు ఇలా చేశారు.

తెలియకున్నా, మనం తెలుసుకున్న వాళ్ళమని ప్రదర్శించుకునే ఈ ప్రయత్నం దేనికి? ఇలా తమను తాము మోసం చేసుకుని, తప్పుదారి పట్టించి, ఎందుకు పాపానికి గురౌతారో తెలియదు.

వైదిక వాఙ్మయమంతా ఇలాంటి అరకొర జ్ఞానం, భ్రాంతితో కూడిన కాల్పనికార్థాల (భాష్యాలతో) కూడి వుండటం కన్పిస్తోంది. ఇలాంటి జ్ఞానం, ఆచారాలు ద్వాపరాంతంలోనే అధికమై యజ్ఞ యాగాదులకు అధిక ప్రాధాన్యం కల్గడం వల్లనే గీతలో శ్రీకృష్ణుడు "త్రైగుణ్య విషయా వేదానిస్త్రైగుణ్యో భవార్జున" అని వేద వాఙ్మయాన్ని ఖండించాల్సి వచ్చిందేమోననిపిస్తుంది.

వేదోక్తమైన యజ్ఞ యాగాది కర్మల కన్నిటికీస్థూల ప్రయోజనం కోసం స్థూలార్థం, స్థూల క్రియాచరణం ఉంది. సూక్ష్మ ప్రయోజనం కోసం (జ్ఞాన మోక్షాలకు) సూక్ష్మార్థం సూక్ష్మక్రియ (ప్రాణ విద్యోపాసన, జపం, తపస్సు) ఉంటాయి. అయితే వీటిని గ్రహించి వివరించే జ్ఞానులు లేనప్పుడు లేదా అలాంటి వాళ్ళు అరుదైన వేళ–వాళ్ళ జ్ఞానానికి విలువ నివ్వని మూర్ఖుల పాలనలో– నిజమైన ఆచారాల్ని ఖండించి వేరే విధం గానే జ్ఞానాన్ని బోధించాల్సిన పరిస్థితి కల్గుతుందనిపిస్తుంది.

ఇక్కడ అచ్యుత ప్రభువుల మాట స్మరణకు వస్తుంది. "బుద్ధుని తర్వాత గ్రంథ రచనలు చేసిన రచయితలు, భాష్యకారులు, మత ప్రవక్తలు ఎవరూ 'విద్య'లో కొనసాగి తత్వాన్ని గ్రహించిన వాళ్ళు కాదు. బుద్ధుని బోధల్ని అనుసరించి ఉంటే – ఇపుడు మళ్ళీ నేను వచ్చి తత్వం గురించి చెప్పాల్సిన అవసరమే ఉండేది కాదు. యోగ విద్యతో అధికృతమైనవి పతంజలి యోగసూత్రాలు కావు. యోగానికి అధికృతమైన గ్రంథం భగవద్గీత ఒక్కటే" అని వారు తరచూ చెప్పేవాళ్ళు.

అదీకాక ఒక్కోసారి వారు "జగత్తే తలక్రిందులుగా కన్పిస్తుందో (సత్యదూరమైన జ్ఞానం, మరియు ఆచారాల్లో ఉన్నట్లుగా) లేక నన్నే భ్రాంతి ఆవరించిందో అని ఒక్కోసారి ఆలోచించి చూస్తాను. లోతుగా పరికిస్తే – "లేదు. నేను భ్రాంతికి గురి కాలేదు. జగత్తే తలక్రిందులై ఉండడమే నిజం" అనేవారు అచ్యుత ప్రభువులు.

"తప్పుడు విషయాలతో, ఊహలతో జనాల్ని తప్పుదారి పట్టించే గ్రంథాల్ని ఓసారి కాల్చివేయాలి. ఋషిప్రోక్తమైన మూలగ్రంథాలు మాత్రమే ఉండాలి. అపుడు వేదాల నిజమైన అర్థం జనులకు అర్థం అవుతుంది" అనేవారు ప్రభువులు. వాళ్ళ అర్థంలో వేదమంటే జ్ఞానం. జ్ఞానుల వాక్కులకు నిలయాలు వేదాలు. జ్ఞానం గురించిన అనేక సత్యాంశాల వివరాలు, జ్ఞాన సాధనమైన 'విద్య' దానికి కావలసిన నియమాలు ఇవన్నీ వేదాల్లో ఉండటంవల్ల 'విద్య'ను (యోగవిద్య), ప్రాణ విద్య, బ్రహ్మవిద్య, అమృత విద్య, వేదవిద్య అని రకరకాలుగా ప్రభువులు వర్ణించి ఉన్నారు.

ఈ 15వ మంత్రంలో 'యావతీర్వా యథావా' అనే మాటకు 'వేదికను ఎలా సిద్ధం చేయాలి' అనే అర్థాన్ని వదలి ' ఏ విధంగా విద్యను అనుష్ఠానంలో ఉంచాలనే విధానాన్ని యముడు నచికేతునికి బోధించాడని గ్రహించాలి. అలాగే –

**త్రిణాచికేత స్త్రిభిరేత్య సంధిం**
**త్రికర్మకృత్తరతి జన్మ మృత్యూ ।**
**బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వా**
**నిచాయ్యేమాం శాంతి మత్యంతమేతి॥ 17**

అనే శ్లోకంలో మూడు రకాల అగ్నుల్ని స్థాపించి, అగ్నిహోత్రి (అహవనీయ, అన్వాహార్య, గార్హపత్య) దానికి సంబంధించిన మూడు

కర్మల్ని (జ్ఞానం, అధ్యయనం, అనుష్ఠానం) గురించి తెలుసుకుని యజ్ఞ, దాన, కర్మల్లో నిమగ్నమై పోయేవాడే జన్మ మృత్యువులను గెలువ గల్గుతాడు – ఇలాంటి అర్థమే కన్పిస్తుంది.

అయితే స్థూలాగ్ని పూజతో కాని, యజ్ఞ, దాన, కర్మలతో, గ్రంథాలతో కాని, చదువు, జ్ఞానం లేకుండా అనుష్ఠానమని చేసే వ్రతం, పూజ, మంత్ర తంత్రాలు, ఉపనిషన్మంత్రంలో చెప్పబడిన అగ్ని ఉపాసన ద్వారా జన్మ మృత్యువుల్ని దాటే సామర్థ్యం పొందడం, పరమశాంతిని పొందటం సాధ్యమే కాదు.

అందువల్ల ఇక్కడ "త్రిణాచికేతస్త్రిభిరైక్య సంధిం" అనే మాటకు మన దేహంలో ఉపాసించాల్సిన విద్య యొక్క క్రమాన్ని ఇలా చెప్పడం జరిగింది. మూడు అగ్నులంటే – మొదట వాయు మధనం వల్ల పుట్టే అగ్ని (వేడి), రెండో స్థితిలో ఆ వేడే ఊర్ధ్వముఖమై, తీవ్రమై విద్యుత్తుగా వివిధ రూపాల్ని ధరించే విద్యుదగ్ని, మూడో స్థితిలో ఈ వాయువుకు, అగ్నికి (వేడి, విద్యుత్తులకు) మూలమైన ప్రాణాగ్ని యొక్క ఊర్ధ్వగమనం. ఇది శిరస్సులో చేరాక మృత్యువు నుండి దాటే ఇచ్ఛా మరణ స్థితి లభిస్తుంది. ఈ మూడింటిని సముచిత రీతిలో ఉపాసిస్తే ప్రాణం బ్రహ్మ రంధ్రంలో చేరాక జరిగే జీవాత్మల ఐక్యస్థితి నుండి మనలో కల్గే జ్ఞానాగ్ని ద్వారా పరమశాంతిని (మోక్షం) పొందడం సాధ్యం.

ఈ విద్యను అభ్యసించే విధానంలో ఉండే మూడు సంధులు ఇవి. ప్రదోషకాలం, అంటే సూర్యాస్తమయం తర్వాత, రాత్రి (నిద్రపోయే ముందు), తెల్లవారుజామున బ్రహ్మీ ముహూర్తంలో ఆ విద్య నభ్యసించే (త్రికర్మ) మూడు క్రమాల్ని తెలుసుకోవడం అవసరం. అదే రుద్ర, విష్ణు, బ్రహ్మగతులలోని విద్యోపాసన. (అధిక శబ్దం, మధ్య శబ్దం, నిశ్శబ్ద స్థితులలో) అలాగే అందులోని ఋక్, యజుస్సామాల విధానాన్ని గ్రహించి

అభ్యసించాలి. ఇలా క్రమాన్ని తెలుసుకుని తగిన ఆహార విహార నియమాల్ని గ్రహించి వాటిని అనుసరిస్తేనే సాధకుడు స్వచ్ఛంద మరణాన్ని పొందే జ్ఞానం పొందుతాడు. ఈ మంత్రంలో 'బ్రహ్మజజ్ఞ' అనే దాన్ని విశ్వానికి మూలకారణ శక్తి అయిన ప్రాణశక్తి అని, అలాగే విశ్వంలోని ప్రాణశక్తికి అధిదేవుడైన 'పురుషుడ'నీ గ్రహించాలి. అలాగే 18వ మంత్రంలో చెప్పిన "సమృత్యు పాశాన్పురతః ప్రణోద్య" అనే చోట "ఇచ్ఛా మరణుడై" అనేది సరైన అర్థం.

ఇలా ప్రాణోపాసనతో (నచికేతాగ్నితో) మృత్యువు నుండి బయట పడి, మహర్లోకంలో చేరి, 'విద్య'ను పొంది, తపోలోకంలో చేరి, తపించి, ఆత్మ అనుగ్రహంతో బ్రహ్మలోకాన్ని పొందుతారు. కల్పాంతం దాకా వాళ్ళకూ బ్రహ్మతో తాత్కాలిక మోక్షం. ఆ బ్రహ్మ లోకానికి ఆశపడకుండ తపించి, కృపాపాత్రులైన వాళ్ళు అమృతత్వాన్ని పొంది అజరామరు లౌతారు.

అమృతత్వాన్నందించే ఈ విద్యనెరుగని వాళ్ళుండే ఈ కాలంలో ఇంకా 'దేవుడి' గురించే అడిగితే ఏం లాభం? ప్రకృతి పురుష యోగమైన సాంఖ్య జ్ఞానం కల్గాలంటే తనలోని జీవాత్మలనే శక్తుల (ప్రాణ, మనస్సుల) కలయికే సాధన. అదే యోగం. అలాంటి స్థితి తనలో కల్గినపుడు ప్రకృతి రహస్యాలు తేటతెల్లమై, భక్తి జరిగి, తపస్సు జరిగి, ధ్యానస్థితిలో చైతన్య ప్రయాణం కొనసాగి, లోకలోకాంతరాల్ని దాటి, పురుషుని (అమానవ – అమనస్క – నిర్లిప్త) కృపతో అనంతాకాశంలో పైకి లేస్తూ, అహంకారానికి గురై, తమోగుణాంధకారం ఆవరించి, ముందు ఏమీ తోచక, వెనక్కి వచ్చిన వాళ్ళు మాయను నిందిస్తారు. తమ తమస్సుకు అదే కారణమనీ అంటారు.

ఈ అంధ తమస్సులో ఎచ్చరికతో ఉంటూ దాటేందుకు ఆదిశక్తి అయిన మూలమాయను ప్రార్థించి దేవుణ్ణి చూసిన వాళ్ళు, అలా దేవుణ్ణి దర్శించి ముక్తులయ్యేందుకు తమను కరుణించి మాయనే 'ముక్తికన్యక' అని అంటారు.

మూడో వరంగా నచికేతుడు 'మనిషి చనిపోయాక అతని ఆత్మ ఉంటుందని కొందరు, ఉండదని కొందరూ అంటారు. దీని సత్యత్వాన్ని నీ నుంచి తెలుసుకోదలచాను" అని విన్నవించాడు.

"ఇది అంత సులభంగా తెలుసుకొనే విషయం కాదు. ఇది చాలా సూక్ష్మధర్మం. ప్రాచీన కాలంలో దేవతలు కూడా దీన్ని గురించి చర్చించారు. దీనికి బదులుగా వేరే వరాన్ని కోరుకో. ఐశ్వర్యం, భార్యా పుత్రులు, రాజ్యాధికారం, చిరంజీవిత్వం, ఏదైనా అడుగు ! ఇస్తా!" అని యముడంటాడు.

అపుడు నచికేతుడు "సంపత్తుతో మనిషి సంతృప్తి చెందదు. నీ నుండి లభించే చిరంజీవిత్వంనీవు ఉన్నంత వరకే. కోరుకునేందుకు యోగ్యమైన ఆ వరాన్నే నేను కోరుతున్నాను".

ఇక్కడ నచికేతుడు వేసిన 'మరణం' తర్వాత ఆత్మ యొక్క ఉనికి ఉందో? లేదో? అనే ప్రశ్నలో 'మరణ' మంటే కేవలం దేహాన్ని విడవడం కాదు. ఎందుకంటే దేహత్యాగం తర్వాత (పునర్జన్మ) నరకం, స్వర్గం మొదలైనవి ఉన్నాయని అతనికి తెలుసు. అందువల్ల ఇక్కడ మరణం అంటే మోక్షం (అంటే సాయుజ్యం, విదేహ ముక్తి, దేవునిలో కలిసి పోవడం) అనే అర్థం. ఇలాంటి స్థితిని పొందిన వాళ్ళు అక్కడ ఆత్మ అస్తిత్వం ఉందో, లేదో అనే అంశాన్ని చెప్పడానికి ప్రయత్నించరు. అందుకనే ఈ నిగూఢ విషయం పై దేవతలు కూడా తర్క, వితర్కాలు

చేస్తున్నారు – అని యముడు చెప్పాడు. అపుడు యముడు ప్రేయస్సు, శ్రేయస్సు – వీటి గురించి వివరిస్తాడు.

**ధీరోఽ భిప్రేయ సో వృణీతే**

**ప్రేయోమందో యోగక్షేమాత్ వృణీతే**

– అని శ్రేయోమార్గపు శ్రేష్ఠత్వాన్ని వివరించాడు.

“విద్య, అవిద్య – రెండూ పరస్పర విరుద్ధమైనవి. నీవు విద్యను కోరుకునే వాడివి. సంపదల వ్యామోహంలో చిక్కుకున్న వాళ్ళు పరలోకపు అస్తిత్వాన్నే నమ్మక మళ్ళీ మళ్ళీ నాకు వశీభూతులౌతారు. (మృత్యువు) దీని జ్ఞానం తర్కంతో రాదు. “నైషా తర్కేణ మతిరాపనేయా, ప్రోక్తాన్యే న్యేవసుజ్ఞానాయ ప్రేష్ఠ”. జ్ఞాని చెబితేనే ఈ విషయం తేటతెల్ల మౌతుంది.

ముక్తిసాధనా మార్గం బాలబుద్ధికి స్ఫురించదు. ఉండేది ‘ఇహం’ ఒక్కటే. ‘పరం’ అనేది లేదని భ్రమించి ధనాదుల మోహానికి బలై మళ్ళీ మళ్ళీ జనన మరణాల పాశానికి బలైపోతారు.

**“తం దుర్దర్శం గూఢమను ప్రవిష్టం**

**గుహాహితం గహ్వరేష్ఠం పురాణాం ।**

**ఆధ్యాత్మ యోగాధిగమేన దేవం**

**మత్వాధీరో హర్షశోకౌజహాతి** **(1-12)**

చూడటానికి సాధ్యం కాని, రహస్యమయమైన, దుర్గమ మార్గంలో అత్యున్నత స్థానంలో, శాశ్వతుడైన దేవుణ్ణి ఆధ్యాత్మ యోగంతో చేరి, ధీరులైన వాళ్ళు హర్షశోకాలనే ద్వంద్వాల్ని దాటుతారు.

సకల వేదాలూ ఏ పరమపదాన్ని గురించి వర్ణిస్తాయో, దేన్ని పొందేందుకు తపస్సు, బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తారో దాన్ని సంక్షిప్తంగా వివరిస్తా.

"ఇదే అక్షరబ్రహ్మం (నాశ రహితమైన ఆత్మ – దేవుడు). పరతత్త్వం అంటే ఇదే ! ఈ అక్షర జ్ఞానాన్ని పొందిన వ్యక్తి ఏం కాదలచాడో అదే అవుతాడు. (అంటే – అతడు ఆ బ్రహ్మలో ఐక్యమై ముక్తుడు కావచ్చు. లేదా దేహంలో ఉంటూనే జీవన్ముక్తుడై జగత్తుకు సేవ చేస్తూనే ఉండి పోవచ్చు. అది అతని ఇష్టం). దాన్ని (బ్రహ్మ, దైవం) ఆశ్రయించడమే శ్రేష్ఠం. ఆ ఆశ్రయమే ఆత్యంతికమైనది. ఆ ఆశ్రయాన్ని తెలుసుకున్న వ్యక్తి బ్రహ్మలోకంలో విరాజిల్లుతాడు. ఆత్మ అనేది పుట్టింది కాదు. అది చనిపోదు కూడ; అది ఇంకో వస్తువు నుండి పుట్టింది కూడ కాదు. అది నిత్యం; శాశ్వతమైనది. దేహం చంపబడ్డా దేహంలోని ఆత్మ చంపబడదు. ప్రాణుల్లో గుప్తమైన ఈ ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మం, మహా మహిమాన్వితం కూడ. అజ్ఞానాంధకారాన్ని పోగొట్టుకున్న వాళ్ళు ధైర్యాన్ని పొంది హర్ష శోకాలకు అతీతులై ఆత్మజ్ఞానాన్ని పొందుతారు.

**"అశరీరం శరీరేష్వ నవస్థేష్వ వస్థితమ్ ।**
**మహాత్మం విభుమాత్మానాం మత్వా ధీరో నశోచతి ॥ 1–22**

శరీరాల్లో అశరీరుడు, అనిత్యాల్లో నిత్యుడు సర్వవ్యాపి, శ్రేష్ఠుడైన ఈ ఆత్మను గ్రహించిన ధీరులు శోకించరు.

ఇక్కడ ప్రతి దేహంలో ఉండే 'ఆత్మ' అంటే జీవాత్మే. పాంచభౌతిక వస్తువులన్నీ అనిత్యాలే. ఈ అనిత్యమైన దేహాల్లో ఉండే ఈ జీవాత్మ నిత్యుడు. నిత్యాత్మ నుండి వచ్చి మళ్ళీ, అక్కడికే చేరిపోవడం వల్ల ఇతడు నివసించే దేహాలకు రూపం ఉన్నా ఇతనికి రూపం లేదని అభిప్రాయం.

**"నాయమాత్మా ప్రవచనేన లభ్యో**
**నమేధయాన బహుధా శ్రుతేన**
**యమేవైష వృణుతే తేన లభ్య**
**స్తైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్ (ముం 23)**

ఆత్మ ప్రవచనం వల్ల లభించదు. బుద్ధిశక్తితో గానీ, వేరొకరి నుండి వినడం వల్ల గాని లభించదు. (అతణ్ణి అలా తెలుసుకోలేం) ఇక్కడ ఆత్మ అంటే దేహంలోని (పాంచభౌతిక) జీవాత్మ కాదు. ఈ జీవాత్మకు మూలమైన బ్రహ్మనే 'ఆత్మ' అని అంటారు. ఎవరి పై అతనికి ప్రసన్నత కల్గుతుందో వాళ్ళకు మాత్రం అతడు ప్రకటం అవుతాడు అని అర్థం. అంటే భక్తి చాలా అవసరమన్న మాట. "వివృణుతే తనూం స్వాం" అనడం వల్ల ఆ బ్రహ్మ (పురుషుడు) నిత్య శరీరుడే కాని అశరీరి కాడని బోధించబడింది.

**"నావిరతో దుశ్చరితాన్నాశాంతో నా సమాహితః**
**నాశాంత మానసో వాఽపి ప్రజ్ఞానేనైన మాప్ను యాత్ (1-2-24)**

చెడ్డ పనుల్ని వదలని వాడై, సమత్వ రహితుడై, అశాంత మనస్కుడైన వ్యక్తికి బౌద్ధికమైన తెలివి కల్గినా ఆత్మ లాభం జరగదు.

**"యస్య బ్రహ్మ చ క్షత్రం చోభే భవత ఓదనః**
**మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేదయత్రసః (1-2-25)**

తెలుసుకొనేందుకు ప్రయత్నించే క్షాత్రతేజస్సు, తెలిసికొని ఆనందించే బ్రహ్మత్వం – ఇవి రెండూ జీవాత్మకు రెండు ముఖాలు. ఆ జీవాత్మ ఆత్మలో ఐక్యం కావడమే మోక్షమన్నాక, బ్రహ్మత్వం, క్షాత్రత్వాలు – అతని ఆహారమనీ, మృత్యువు (దేహ త్యాగం వల్లనే మిలనం సాధ్యం

కాబట్టి) ఆత్మకు ఉపసేచనం అని ఇక్కడ చెప్పడం సమంజసమే! అలాంటి పరమాత్మ ఉండే ఆస్థానం ఎక్కడ? అనేది ఎవరికి తెలుసు?

**ఋతం పిబంతౌ సుకృతస్యలోకే**
**గుహాం ప్రవిష్టౌ పరమే పరార్థ్యే**
**ఛాయాతపౌ బ్రహ్మవిదో వదంతి**
**పంచాగ్నయో యేచ త్రిణాచికేతః (1-3-1)**

సత్య కర్మాచరణ కల్గిన వ్యక్తి దేహంలో ఋతాన్నే (ధర్మం) త్రాగుతూ (ఆహారంగావించుకుని), శ్రేష్ఠ స్థానంలో అత్యున్నత స్థానంలో (బ్రహ్మ రంధ్రంలో) వెలుగు నీడల్లా ఇద్దరు (జీవాత్మ, పరమాత్మలు) ప్రవేశించి ఉంటారని పంచాగ్నుల్ని ఉపాసించిన వాళ్ళు త్రికాలాల్లో నచికేతాగ్నిని ఉపాసించి, తెలుసుకున్న వాళ్ళు చెబుతారు.

ఇక్కడ జీవాత్మను ఎండతో పోల్చారు. మండిపోయే స్వభావం కలది ఎండ. తపించే వ్యక్తి జీవాత్మ. అతని ఆ తపస్సుకు నీడ చల్లదనాన్ని అందిస్తుంది. పరమాత్మ స్మరణ, దాని ద్వారా లభించే భగవత్కృపను నీడతో పోల్చడం జరిగింది. దీని వల్ల అతడు అక్కడ లేకుండా అతని కృప (అది ప్రకటితమయ్యేది జ్ఞాన మహిమల ద్వారా) అక్కడుంటుందని గ్రహించాలి.

యాజకులకు (యజ్ఞం చేసేవారికి) సేతువులా ఉండే నచికేతాగ్నిని (ప్రాణాగ్ని) లక్ష్యమైన నాశరహిత పరబ్రహ్మాన్ని మనం ఎరుగుదుము.

ఆత్మయే (జీవాత్మ) రథికుడు. శరీరమే రథం. బుద్ధి సారథి. మనస్సు ఇంద్రియాలు, గుర్రాలు, విషయాలు, అవి సాగే మార్గాలు.

ఈ ఇంద్రియ మనస్సులతో కూడిన జీవాత్మే కర్మఫలాన్ని అనుభవిస్తాడని తెలిసిన వాళ్ళ అభిమతం.

ఏది యుక్తం, ఏది అయుక్తం అనే జ్ఞానం లేని వాడి మనస్సు ఇంద్రియాలను నిగ్రహించ జాలక తానే వాటి వశం అవుతుంది. విజ్ఞానం వున్న వ్యక్తి తన మనస్సుతో ఇంద్రియాల్ని నిగ్రహించగల్గుతాడు. విజ్ఞానం లేకుండాచంచల మనస్కుడై అశుచిగా (చెడ్డ విచారాలు, ఆచారాలతో నిండిన వ్యక్తి) ఉండే వ్యక్తికి ఆ పదవి (ముక్తి) లభించదు. అతడు జనన మరణ చక్రంలోనే చిక్కుకుంటాడు.

ఇక్కడ 'అమనస్క' అన్నే శబ్దం గమనార్హం. మనస్సు లేని వాడంటే శ్రద్ధలేని వాడని అర్థం.

విజ్ఞానవంతుడై, మనస్సులో శ్రద్ధతో కూడిన వాడై, శుద్ధాచార విచారవంతుడైన వ్యక్తి (మోక్ష) పదవిని పొందుతాడు. అతనికి మళ్ళీ జన్మించటమనేది ఉండదు.

**విజ్ఞాన సారథిర్యస్తు మనః ప్రగ్రహ వాన్నరః ।**

**సో౽ ధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదం॥ (1-3-9)**

విజ్ఞానాన్ని సారథిగా, మనస్సును పగ్గంగా చేసుకున్న మనిషి ఈ సంసారాన్ని దాటుతాడు. అదే వ్యాప్తమైన ఈ చైతన్యానికి మూలం, ఆశ్రయమూ అయిన శ్రేష్ఠస్థానం.

ఇంద్రియాలకు అతీతంగా అర్థం - అంటే వృత్తికి మూల కారణమైన సూక్ష్మ సంపత్తు పంచభూతాల సూక్ష్మస్థితి (ద్రవ్యం), దాని కవతల మనస్సు, దానికవతల బుద్ధి, దానికవతల క్రమంగా ఒకదాని కంటే మరొకటి చాలా శ్రేష్టమైనవి.

**"మహతః పరమవ్యక్తమవ్యక్తా త్పురుషః పరః**

**పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సాపరాగతిః (1-3-11)**

ఆత్మకన్న అవ్యక్తం శ్రేష్ఠం. (నిరాకార చైతన్యం - విరాట్) ఆ అవ్యక్తం కన్న 'పురుషుడు' (నిత్య శరీరి) దేవుడు శ్రేష్ఠుడు. ఆ పురుషుని కన్న శ్రేష్ఠమైంది ఏదీ లేదు. అదే చివరిది. అదే ఆత్యంతికమైన గమ్యస్థానం.

# 2వ అధ్యాయం

తమస్సు మరియు జలం మొదలైన వాటికన్న ముందుగా ఏది పుట్టిందో అది గుహలోకి ప్రవేశించి (గుప్తస్థానం) భూతాలతో కలసి ఉండడాన్ని జ్ఞానులు గమనించారు. ఇక్కడ ప్రాణ చైతన్యం గురించి వర్ణించడం జరిగింది.

సర్వదేవతల మాతృక అయిన (విచారాల, వృత్తుల) 'అదితి' ప్రాణశక్తి సమేతంగా పుట్టింది. గుహ్యస్థానంలో ప్రవేశించి ఉండిపోయిన ఆమె సర్వభూతాల సమేతంగా జన్మించింది. ఇక్కడ జీవాత్మనే (సూక్ష్మ ప్రకృతి) అదితి అనడం జరిగింది.

**'యథోదకే శుద్ధే శుద్ధమాసిక్తం భవతి**

**ఏవం మనేర్వి జానత ఆత్మా భవతి గౌతమ (2-1-15)**

శుద్ధజలాన్ని శుద్ధ జలంలోకి చేర్చితే అది తద్రూప మౌతుంది. జ్ఞానులైన మునులు ఆత్మలో చేరి (దేవునిలో) తద్రూపులౌతారు.

(ఇక్కడ దేహ త్యాగం తర్వాత ఆత్మ (జీవాత్మ) ఉంటుందో? ఉండదో? అనే ప్రశ్నకు జవాబు ఇవ్వబడింది. దేవుని కలిసిపోయాక జీవాత్మకు ప్రత్యేమైన ఉనికే లేదని భావం)

పన్నెండు ద్వారాలున్న పురం (దేహం) ఉంది. ఈ పురం పుట్టుక లేని, శుద్ధ చైతన్యమైన ఆత్మది. అతడు ధ్యానంతో శోకాతీతుడౌతాడు. అన్నిటి నుండి విడివడి, ముక్తుడౌతాడు.

**"హంసః శుచిష ద్వస్తురంతరిక్ష సద్హోతా**

**వేదిషదతిథి ర్దరోణసత్ ।**

**నృషదౌరవ సత సద్వ్యోమసదబ్జాగోజా ఋతజా**

**అదిడ్రా ఋతం బృహత్ (2-5 2)**

'హంస' ఆకాశంలో సూర్యరూపంలో, అంతరిక్షంలో గాలి రూపంలో, వేదికలో అగ్ని రూపంలో ఇంటిలో అతిథి రూపంలో ఉంటుంది. నీట్లో పుట్టే, నేలలో పండే, కర్మ నుండి కల్గే వస్తువులన్నీ అదే!

ఇక్కడ 'హంస' అంటే ప్రాణచైతన్యం. సమస్త ప్రాణుల ఉత్పత్తి దీని నుండే ! అంతా అదే అయి ఉందని చెప్పబడింది.

**ఊర్ధ్వం ప్రాణమున్న యత్యపానం ప్రత్యగస్యతి**

**మధ్యే వామన మాసీనం విశ్వేదేవా ఉపాసతే (2-2-3)**

అది ప్రాణవాయువును పైకి లేపుతుంది. అపాన వాయువును క్రిందికి నెట్టుతుంది. వాయువు యొక్క ప్రాణాపానాగ్నుల్ని మార్చే స్థానంలో (మధ్య) ఉండే వామనుణ్ణి (అణురూపమైన ప్రాణ చైతన్యాన్ని) విశ్వంలోని దేవతలందరూ ఉపాసిస్తారు.

**న ప్రాణేన న పానేన మర్త్యో జీవతి కశ్చన ।**

**ఇతరేణతు జీవంతి యస్మిన్నేతావు పాశ్రితౌ ॥**

ప్రాణవాయువుతో గాని, అపాన వాయువుతో కాని జీవి బ్రదకడం

లేదు. ఈ రెండూ దేని ఆశ్రయంలో ఉన్నాయో ఆ (ప్రాణ) వస్తువు యొక్క బలంతోనే జీవి జీవించగల్గుతున్నాడు.

(ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అని పిలువబడే 'వాయువు' ప్రాణచైతన్యం నుండే ఉద్భవించిన భూతం కావడం వల్ల ఆ వాయువు దేహంలో ప్రాణముండే దాకా మాత్రమే శరీర యంత్రం నడిపేందుకు ఉపకరిస్తుందే తప్ప దేహం ఉన్న వాళ్ళను బ్రతికించే శక్తి దానికి లేదని సారాంశం).

**న తత్ర సూర్యభాతి న చంద్రతారకం**
**నైమా విద్యుతో భాంతి కుతోఽ యమగ్నిః**
**తమేవ భాంతమనుభాతి సర్వం**
**తస్యభాసా సర్వమిదం విభాతి 2-3-15**

ప్రధమ వల్లిలో ఆ బ్రహ్మ ఉండే స్థానాన్ని ఎవరు తెలుసుకో గల్గుతారు? అనే ప్రశ్నకు ఇక్కడ జవాబు ఉంది.

అక్కడ సూర్యుని వెలుతురు లేదు. చంద్రుడు, నక్షత్రాలు లేవు, విద్యుత్ ప్రకాశం లేదు. ఇక అగ్ని ఎక్కడిది? అది (బ్రహ్మ-దైవం) ప్రకాశించడం వల్లనే, దాని వెలుగుతో (శక్తి) ఇదంతా ప్రకాశిస్తోంది.

2వ అధ్యాయం 3వ వల్లి

**ఊర్ధ్వమూలోఽ వాక్ శాఖ ఏషోఽ శ్వత్థః సనాతనః**
**తదేవ శుక్రం, తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే**
**తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తదునాత్యేతి కశ్చన ఏతద్వైతత్ (2-3-1)**

పైన వేళ్ళుండి క్రింద కొమ్మలున్న సనాతనమైన అశ్వత్థ వృక్షమిది (ఈ జగత్తు). అది (వేరు) శుద్ధం. దాన్నే బ్రహ్మమనీ, అమృతమనీ

అంటారు. సర్వలోకాలూ దాని ఆశ్రయంలోనే ఉన్నాయి. దాన్ని దాటి ఎవరూ పోలేరు (ఎందుకంటే అది ఆత్యంతికమైనది).

**యదిదం కించ జగత్సర్వం ప్రాణ విజతి నిఃసృతం**
**మహద్భయం వజ్రముద్యతం య ఏతద్విదురమృతా స్తే భవంతి**
**(2-3-2)**

వ్యక్తమైన ఈ విశ్వమంతా ప్రాణంలోనే చలిస్తుంది (ఉత్పత్తి, స్థితి, లయల్ని పొందుతోంది). ఇది పెద్దది. భయాన్ని కల్గించే వజ్రాయుధంలా ఉంది. దీన్ని తెలుసుకున్న వాళ్ళు దేవునిలో చేరి ముక్తులౌతారు.

**ఇహ చేదశకద్బోద్ధుం ప్రాక్శరీరస్య విస్రసః**
**తతః సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే (2-3-4)**

ఈ శరీరం త్యజించే ముందు జ్ఞానాన్ని పొందాలి. లేకుంటే వేరే వేరే లోకాల్లో (కర్మానుసారంగా) శరీరాల్ని పొందాల్సి ఉంటుంది.

**యథాఽఽ దర్శే తథాత్మని యథా స్వప్నే తథా పితృలోకే**
**యథాప్సు పరీవ దదృశేతథా గంధర్వలోకే**
**ఛాయాతపయోరి బ్రహ్మలోకే (2-3-5)**

సత్యదర్శనం (దేవదర్శనం) తనలో అద్దంలో ప్రతిబింబంలా స్పష్టంగానూ, స్వప్నంలో చూసినట్లు పితృలోకంలోనూ, నీటిలో ప్రతిబింబంలా గంధర్వలోకంలోనూ, ఒకసారి వెలుగు, ఒకసారి నీడలా బ్రహ్మలోకంలోనూ జరుగుతుంది. (బ్రహ్మ పగటి పూట వెలుగులా, రాత్రిలో చీకటిలా, ఇక్కడ బ్రహ్మలోకం అంటే దేవుని చోటు అని కాదు. త్రిమూర్తుల్లో బ్రహ్మ ఉండే స్థానం – సత్యలోకం).

వేర్వేరు తన్మాత్రలతో ఉత్పత్తి అయిన ఇంద్రియాల వృత్తుల భిన్న వ్యాపారం. వాటి ఉత్పత్తి, నిశ్చేష్ట స్థితుల్ని తెలుసుకున్న వ్యక్తి శోక రహితు డౌతాడు. ఇంద్రియాల కన్న మనస్సు, దాని కన్న శక్తి, దానికంటె ప్రాణం, దానికన్న అవ్యక్తం (సూక్ష్మ ప్రకృతి - ప్రకృతిని నడిపించే మాయ) శ్రేష్ఠమైనవి. అవ్యక్తం కన్న పురుషుడు శ్రేష్ఠుడు. అతడు సర్వ వ్యాపకుడు. (అతని చైతన్యంతోనే సర్వమూ) అతణ్ణి ఇలా అని వర్ణించటం సాధ్యం కాదు (గుణాతీతుడు). అతన్ని తెలుసుకున్న వాడు ముక్తుడౌతాడు. అమృతుడౌతాడు.

**న సంధృశే తిష్ఠతి రూపమస్య**
**న చక్షుషాపశ్యతి కశ్చ నైనం**
**హృదామనీషా మనసాభిక్లుప్తొ**
**య ఏతద్విదురమృతాస్తే భవంతి** **(2-3-9)**

అతని (దేవుని) రూపం దృష్టి గోచరం కాదు. ఈ కన్నులతో ఎవరూ అతణ్ణి చూడలేరు. మనోనేత్రంతో నిగ్రహం వున్న యోగికి అతడు గోచరిస్తాడు. దీన్ని గ్రహించిన వాళ్ళు అమృతులౌతారు.

**యదా పంచావతిష్ఠంతే జ్ఞానాని మనసా సహ**
**బుద్ధిశ్చ నవిచేష్టతితా మాహుః పరమాం గతిం** **(2-3-10)**

పంచ జ్ఞానేంద్రియాలూ, మనస్సూ స్థిరమై, బుద్ధి నిశ్చలమయ్యాక పరమగతి ప్రాప్తించిందని అంటారు. (అప్పుడే ఆత్యంతిక సత్యదర్శనం, జ్ఞానం ఔతుంది).

**తాం యోగమితి మన్యంతే స్థిరామింద్రియ ధారణాం**
**అప్రమత్తస్తదా భవతి యోగో హి ప్రభవాప్యయౌ** **(2-3-11)**

ఇంద్రియాల యొక్క నిశ్చలమైన ఈ స్థితినే యోగమని అంటారు. యోగం వల్లనే జన్మ, ముక్తి. అతడు (యోగి) సర్వదా జాగృతుడై ఉంటాడు. ఇంకో రీతిలో యోగికి అంతర్ముఖ, బహిర్ముఖ స్థితులు రెండూ ఉండడం వల్ల అతడు భ్రమకు లోను కాకుండా సర్వదా జాగృతుడై ఉంటాడు.

**నైవ వాచాన మనసా ప్రాప్తుం శక్యో న చక్షుషా**

**అస్తీతి బ్రువతోஉన్యత్ర కథం తదుప లభ్యతే (2-3-12)**

వాక్‌శక్తితో కాని, కేవలం కోర్కెతో కాని, స్థూల దృష్టికి కాని ఆ దేవుడు లభించడు. అది ఉంది అనే ఆస్తిక బుద్ధి వున్న వ్యక్తికి తప్ప వేరే వాళ్ళకెలా లభిస్తుంది?

**అస్తీత్యే వోపలబ్ధ వ్యస్తత్వ భావేన చోభయోః**

**అస్తీత్యే వోపలబ్ధస్య తత్వభావః ప్రసీదతి**

అది (బ్రహ్మం) ఉందనే శ్రద్ధతోనే దాన్ని ప్రాప్తం చేసుకోవాలి. రెండింటి జ్ఞానంతో (దేవుడు మూలకారణం. అలాగే ప్రాణ దాని సాధనం) దాన్ని పొందాల్సి ఉంటుంది. ఆ ఉండేది (శాశ్వతసత్యం – దేవుడు) లభ్యమైతే, దాని దర్శనం కల్గితే – అదే దైవత్వమని గ్రహించాలి.

**ఓం సహనా వవతు, సహనౌభునక్తు**

**సహవీర్యం కరవావహై**

**తేజస్వినావధీ తమస్తు మా విద్విషావహై**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 4. మాండూక్యోపనిషత్తు

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామదేవాః**
**భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రాః**
**స్థిరైరంగై స్తుష్టు వాం సస్తనూభిః**
**వ్యశేమ దేవహితం యదాయుః**
**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః**
**స్వస్తినః పూషా విశ్వవేదాః**
**స్వస్తిన స్తార్క్ష్యో అరిష్టనేమిః**
**స్వస్తినో బృహస్పతి ర్ధ ధాతు**

చెవులు గతాగతిలో ఉండే వాయువు యొక్క శబ్దాన్ని వింటూ స్థిరంగా ఉండనీ. కన్నులు రథనాభినే చూస్తూ స్థిరంగా వుండనీ. అవయవాలన్నీ స్థిరంగా ఉండిపోయి, సంతుష్టిని పొంది, దేవతల కార్యాన్ని సాధించేందుకు వినియోగిద్దాం.

ఇంద్రస్థానం స్వస్తి కల్గించి, అమృత వృష్టి పెరిగేందుకు కారణం కానీ!

అరిష్టాలను నివారించే తార్క్ష్యుడు స్వస్తిని కల్గించనీ ! బృహస్పతి (బుద్ధి) స్వస్తిని అందించనీ!

**ఓమిత్యేతదక్షరమిదం సర్వం తస్యోపవ్యాఖ్యానం**
**భూతం భవద్భవిష్యదితి సర్వమోంకార ఏవ**
**య చ్చాన్యత్త్రికాలాతీతం తదప్యోంకార ఏవ** **1**

ఓం అనేది నాశం లేనిది. అంతా దాని వివరణే. (జ్ఞానులు చెప్పేదంతా) ఇంతకు ముందు జరిగింది. ఇపుడు జరుగుతుంది. ఇక ముందు జరిగేది అంతా ఓంకారమే. వీటన్నిటిని మించి త్రికాలాతీతంగా ఉండేది ఓంకారమే.

'ఓం' అన్నప్పుడు స్వరోత్పత్తికి కారణమైన వాయువు ఊర్ధ్వ ముఖంగా సాగి చివరికి లయమౌతుంది – దాని ఉత్పత్తిస్థానంలో. ప్రాణపు ఉపవర్గం వాయువు కావడం వల్ల, ఆ వాయువు యొక్క ఐదు అంగాల్లో ముఖ్యమైన దాన్ని 'ప్రాణ'మనే పిలవడం వల్ల, ప్రాణుని ఊర్ధ్వ గమనమనీ, ఆ వాయువు యొక్క ఊర్ధ్వ గమనాన్ని వర్ణించారు. ఆ గమనంలో పుట్టే శబ్దాన్నే "ఓంకారం" (ప్రణవం) అనడం జరిగింది.

ఈ ఓంకారాన్నే 'అక్షరం' అంటాం. ఈ శబ్దోత్పత్తికి మూలమైన గాలికి, మూల చైతన్యమైన ప్రాణం గురించి చెప్పబడింది. ఆ ప్రాణుని స్పందనమే ఈ స్వరయుక్తమైన గతిని కల్గి ఉండే వాయువు, దాని ద్వారా మిగిలిన భూతాల ఉత్పత్తికీ కారణం కావడం వల్ల, ఆ భూతాల కలయిక వల్ల కల్గిన, కల్గుతున్న, కల్గే ఈ జగత్తంతా ఓంకారమే అని చెప్పారు – ఋషులు.

**సర్వం హ్యేతద్బ్రహ్మాయమాత్మా**
**బ్రహ్మ సోఽ యమాత్మా చతుష్పాద్ 2**

అంతా బ్రహ్మమే (బ్రహ్మం నుండి వచ్చిందే. దాని వల్లనే ఉద్భవించింది) ఆత్మకు నాల్గు అవస్థలున్నాయి.

**జాగరిత స్థానో బహిః ప్రజ్ఞః సప్తాంగ**
**ఏకోన వింశతి ముఖఃస్థూల భుగ్వై శ్వానరః (ప్రథమః పాదః- 3)**

తన బయటి ప్రజ్ఞ ఉండే వేళ అతనికి 7 అంగాలు (పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి) పదునాలుగు ముఖాలు (పంచ కర్మేంద్రియాలు, పంచ బ్రహ్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తు, అహంకారం, (24 భూతాలు) స్థూల వస్తువులు అతని ఆహారం. దాన్ని జీర్ణించుకునే అతని శక్తినే వైశ్వానరుడు అంటారు. అతని ఈ స్థితినే జాగ్రదవస్థ అంటారు. ఇది అవస్థ.

**స్వప్న స్థానోఽ౽ంతః ప్రజ్ఞః సప్తాంగ ఏకోన వింశతి**
**ముఖః ప్రవివిక్త భుక్ తైజసో ద్వితీయః పాదః (4)**

స్థూలేంద్రియాల సహాయం లేకుండా లోపలే తెలుసుకొగల్గే స్థితిలో ఉండటమే స్వప్న స్థితి. అక్కడా అతనికి 7 అంగాలు, 19 ముఖాలు (సూక్ష్మత్వం) ఆ స్థితిలో అతనికి తాను స్థూలేంద్రియాల ద్వారా వ్యవహరిస్తున్నట్లనిపించినా, అపుడు అతని స్థూలేంద్రియాలు కదలకుండా ఉండడాన్ని పరిశీలించ వచ్చు. ఆ స్థితిలో అతని ఆహారం స్థూలమైనది కాకుండ వాటి ప్రతీకలే (సూక్ష్మస్థితి కేవలం భావనయే) ఆకారంగా కన్పిస్తాయి. ఈ స్థితిలో ఆత్మ 'తైజసు'దని పిలువబడతాడు. ఇది రెండో అవస్థ.

**యత్ర సుప్తో న కశ్చన కామం కామయతే**
**న కశ్చన స్వప్నం పశ్యతి తత్సుషుప్తమ్ ।**
**సుషుప్త స్థాన ఏకీభూతః ప్రజ్ఞాన ఘన**
**ఏవానందమయో హ్యానందభుక్ చేతోముఖః**
**ప్రాజ్ఞ స్తృతీయః పాదః 5**

నిద్రాస్థితిలో ఏ కోరికలు ఉండవు. స్వప్నమూ కనిపించదు. ఘనీభూతమైన ఉనికి స్థితి అది. ఆ స్థితిలో ఆనందమయుడౌతాడు. అతనికి ఆనందమే ఆహారం. అపుడు కూడా ఆచైతన్యపు ఉనికి దేహంలో ఉండి తనకే తెలియని రీతిలో శ్వాసక్రియను నడిపించడం వల్ల చైతన్యమే (ప్రాణం) అతని ముఖం. ఈ స్థితిలో అతణ్ణి 'ప్రాజ్ఞు'డంటారు. ఇది అతని మూడో అవస్థ.

**ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోఽ_ంత**

**ర్యామ్యేషయోనిః సర్వస్య ప్రభవావ్యయౌ హిభూతానాం**

ఇతడే సర్వేశ్వరుడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి. అన్ని వస్తువులకు ఉత్పత్తి స్థానం. సమస్త ప్రాణులకు ఉద్భవ స్థానం. నాశానికి కారణం.

ఇక్కడ కొంచెం ఆలోచించటం అవసరం. జాగ్రదవస్థలో ఇంద్రియ వృత్తులకంటుకుని, ఇంద్రియాల ద్వారా ఏమేమో చేసేవాడు కూడా ఆత్మే. స్వప్నస్థితిలో,స్థూలేంద్రియాలు కదలకుండా పడి వున్నా, మానసికంగా కల్పితమైన స్థూలేంద్రియ వ్యాపారాన్ని చేసినట్లే భావించి, అనుభవించే వ్యక్తి (కష్టసుఖాల్ని) ఆత్మే ! గాఢనిద్రలో (సుషుప్తి) స్థూలేంద్రియాల, ఇంద్రియ వృత్తుల ఆట సాగదు. ఇచ్ఛ ఉండదు. ఉన్నాను, లేను అనే మెలకువ కూడ లేని నిద్రాణ స్థితి. దాన్నే ఆనంద స్థితిగా అభివర్ణించారు. అయినా కష్ట సుఖాలు తనకపుడు లేవనే స్పృహ అపుడు లేదు. తనకు (ఆత్మకు) తెలియకుండా నడిచే ప్రాణ వ్యాపారం (శ్వాస, రక్త ప్రసరణ మొదలగునవి) అపుడు దేహంలో ఉన్నా ఆ క్రియ జరుగుతోందనే జ్ఞానం ఆత్మకు ఆ సమయంలో లేదు. "ఆనందానుభవం" ఉంది అని చెప్పడం భ్రాంతే. ఎందుకంటే – జరిగేదాన్ని తెలుసుకోవడమే అనుభవం. ఆ

ఎరుకే లేనపుడు అనుభవం అనే ప్రసక్తి ఎక్కడ వస్తుంది? ఆ స్థితిలో తానుండే దేహాన్ని కత్తిరించి పారవేసినా ఆ విషయం అతనికి తెలియదు కదా? ఇలా ఈ రీతిలో సుషుప్త స్థితిలో సుప్తంగా ఉండే ఆత్మే సర్వజ్ఞుడు కాగల్గుతాడు. (సర్వాన్ని తెలుసుకున్నవాడు)

ఈ శక్తి దేహంలోని ఇచ్ఛాశక్తిలో, బుద్ధిశక్తిలో, ప్రాణశక్తిలో దేంట్లోనూ లభించదు. ఆ ఆత్మే అన్ని ప్రాణుల శరీరాల్లో వుంది. అది ఆ దేహాన్ని, దేహంలోని ఒక్కో అంగాన్ని మిగిల్చుకుంటుంది. దాన్ని సంహరించగల్గుతుంది కూడా ! అలాగే ఈ దేహానికి ఈ "ఆత్మ" ఉన్నట్లే ఈ భూతాల కలయిక వల్ల ఈ జగత్తుకీ ఒక 'ఆత్మ' వుంది. అదే సమస్త ప్రాణులకూ ఉత్పత్తి స్థానం. అదీ కాకుండా వాటి ఉత్పత్తి వినాశనాలకూ ఇదే కారణం. జగత్తులో పుట్టి, చనిపోయే దేహంలో ఉండేది 'ఆత్మ' అంటాం. అయితే ఈ జగత్తును సృష్టించగల్గేది, లయం చేయగల్గేది ఆత్మ కాదు. ఆ ఆత్మలోని అంశ మాత్రమే ఇది ! సూర్యుని అనంత కిరణాల్లో ఒక కిరణమున్నట్లే ! సూర్యుని లక్షణాలు కిరణంలో వున్నా – దాని శక్తి పరిమితం. అందువల్లనే అనుభవజ్ఞులు, జ్ఞానులు దీన్ని 'ప్రత్యగాత్మ' అనీ, దాన్ని 'ఆత్మ' అనీ అన్నారు. దీన్ని 'జీవాత్మ' అనీ, దాన్ని 'పరమాత్మ' అనీ వర్ణించారు.

**నాంతః ప్రజ్ఞం న బహిప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం**
**న ప్రజ్ఞాన ఘనం న ప్రజ్ఞం అదృష్టమవ్యవహార్య**
**మగ్రాహ్యమ లక్షణ మచింత్య మవ్య ప్రదేశ్య మేకాత్మ**
**ప్రత్యయసారం ప్రపంచోశమం శాంతం శివ**
**మద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా సవిజ్ఞేయః 7**

తనలోని (శారీరక, మానసిక) బౌద్ధిక క్రియల స్పృహే లేదు. అలాగే ఇంద్రియాల ద్వారా పొందే బయటి ప్రజ్ఞ కూడ లేదు. ఎందుకంటే – ఇంద్రియ వృత్తులు ఉండవు. ఆ రెంటినీ (బయటి దాన్ని, లోపలి దాన్ని) ఒకే సమయంలో గమనించే స్థితి కూడా లేదు. ఘనీభూతమైన ప్రజ్ఞాస్థితిలో (సుప్త స్థితిలో) జ్ఞానమూ లేదు, అజ్ఞానమూ లేదు. కనిపించని, ఊహించనలవి కాని, బుద్ధితో గ్రహింపజాలని, వ్యవహారం లేని, ఇలాంటిదీ అని చెప్పజాలని, మూలకారణమైన ఆత్మ యొక్క ప్రతీక అయిన ప్రపంచ సహవాసంతో సర్వ దుఃఖాలకు ఉపశమనం కల్గించే శాంతితో కూడిన, శ్రేయస్కరమైన తన ఎరుక మాత్రమే ఉండే స్థితి నాల్గో స్థితి. ఇదే ఆత్మ యొక్క సహజ (శుద్ధ) స్థితి. ఇదే తెలుసుకోవాల్సిన అంశం. (అనుభవం ద్వారా).

ఇక్కడ ఈ దేహంలో ఉండే ఆత్మ తప్ప వేరే ఆత్మ కానీ, సర్వాత్మల మూలమైన విశ్వాత్మ (పరమాత్మ) కానీ లేదు; ఉండేది ఒకటే అని వాదించే వాళ్ళున్నారు. ఆత్మ యొక్క నాల్గో స్థితికీ, (తురీయ), మొదటి స్థితికీ (జాగ్రత్) ఉండే భేదం చాలా అధికం. ఈ స్థితి నుండి ఆ స్థితికి పోయాక తన గురించే స్పృహ ఉంటుంది తప్ప వేరే విషయాల ఎరుక ఉండదు. అందువల్ల ఉండేది తానొక్కడే, మిగిలినదంతా మిధ్య అనీ భ్రమిస్తాడు. అలా ఉండే ఆత్మ ఒక్కడే అయి ఉంటే – వేర్వేరు దేహాల్లో ఆ ఆత్మకు ఆ నాల్గు స్థితులు క్రమంగా ఏక కాలంలోనే లభించాలి. అలాగే అన్ని దేహాల త్యాగం, జన్మ మొదలైనవి. అది అలా లేదు. అసంఖ్యాకమైన దేహాల్లో ఉండే ఆత్మల లక్షణం ఒక్కటే అయినా వాళ్ళ అస్తిత్వం వేర్వేరుగా ఉందనే అనుభవాన్ని వివేకవంతులు పొందారు. దాన్నే వాళ్ళు వివరించారు. గాఢ నిద్రాస్థితిలో ఆనందానుభవం ఉంది అన్న మాట ఎలా అర్ధరహితమో, ఈ ఏకాత్మక వాదమైన (అద్వైతమూ) అంతే !

**సోఽయ మాత్మాఽధ్యక్షరమోంకా రోఽధిమాత్రం**

**పాదా మాత్రా మాత్రాశ్చ పాదా అకార ఉకార మకార ఇతి (8)**

ఈ ఆత్మ అక్షర దృష్టి కోణంతో ఓంకారం. ఆ ఓంకారోచ్చారణను విభజిస్తే మాత్రా రూపంలో ఉంటుంది. ఆ మాత్రలే 'అ'కారం, 'ఉ'కారం, 'మ'కారం. ఇక్కడ 'అ', 'ఈ' ఆత్మ అని అనడానికి కారణం సర్వమూలం, సర్వాతీతం అయిన ఆ ఆత్మ (విశ్వాత్మ).

అలాగే ఈ దేహంలో ఉండే ఆ ఆత్మ యొక్క అంశమే అయిన 'ఈ ఆత్మ – జీవాత్మ– అనే అంశాన్ని సూచించడం జరిగిందని గమనించాలి. అంతే కాక, ఆ ఆత్మలోనూ చైతన్యం ఉంది. ఈ 'ఆత్మ' ఉండే దేహంలోనూ అదే ఉంది. ప్రాణశక్తి యొక్క ఉపవర్గమైన వాయువు యొక్క ఊర్ధ్వ గమనాన్ని, అపుడు ఉత్పత్తి అయ్యే శబ్దాన్ని 'ఆత్మ'గా వర్ణించి, ఆ శబ్దోచ్చారణను పరిశీలించే వేళ, ఆ వాయువు దేహంలో ఏ స్థానంలో ఉండి, ఆత్మస్థితి ఎలా ఉందనే అంశాన్ని గమనించి, దాన్ని పాదమాత్రోచ్చారంలోని శబ్దాల అంతరాల్ని విభిన్నమాత్రలుగా చెప్పారు. అవే 'అ'కార, 'ఉ'కార, 'మ'కారాలు.

**జాగరిత స్థానో వైశ్వానరోఽ కారః**

**ప్రథమా మాత్రాఽఽ ప్తే రాది మత్త్వా ద్వాఽఽ ప్నోతిహవై**

**సర్వాన్ కామానాదిశ్చ భవతి య ఏవం వేద(9)**

జాగ్రదవస్థయే జీవాత్మ అనుభవానికి వచ్చే (ప్రపంచంలో) మొదటి స్థితి. అపుడు అతనికి ఇంద్రియాల ద్వారా విశ్వపు జ్ఞానం, సంబంధం ఉంటాయనీ, అతడు ఆ స్థితిలో 'వైశ్వానరు' డౌతాడన్నారు. అలాగే, అ,ఉ,మ కారాల్లో 'అ'కారం వ్యాపకం (ఉచ్చరించే వేళ శబ్దతన్మూలక

వాయువు) ప్రథమమూ కావడం వల్ల ప్రథమ మాత్ర; శబ్దోత్పత్తిని గ్రహించి (వాయువు యొక్క ఊర్ధ్వగమనం ప్రారంభమయ్యే ఈ స్థానాన్ని దేహంలో) అనుష్ఠానం చేసేవాడి కోరికలన్నీ తీరుతాయి. అతడు శ్రేష్ఠుడనిపించు కుంటాడు.

**స్వప్నస్థాన స్తైజస ఉకారో ద్వితీయ మాత్రో**
**త్కర్షాదుభయత్వాదోత్కర్ష తిహవై జ్ఞాన**
**సంతతిం సమానశ్చ భవతి**
**నాస్యా బ్రహ్మవిద్ యతోభవతి య ఏవం వేద (10)**

ప్రపంచంలో అనుభవానికి వచ్చే రెండో అవస్థ స్వప్నావస్థ. ఆ స్థితిలో అతడు తైజసుడని పించుకుంటాడు. (తేజస్సును పొందే స్థితి) ఇందులో మనస్సు క్రియాత్మకంగా ఉన్నా ఇంద్రియాలకు విశ్రాంతి. ఈ స్థితిలో జాగ్రదావస్థలో నెరవేరని కోరికలు పూర్తికావడం వల్ల మనస్సుకు తృప్తి. విశ్రాంతితో ఇంద్రియాలకు పుష్టి లభించడం వల్ల ఇది ఉభయోత్కర్ష స్థితి. ప్రణవోపాసనను (ప్రాణ విద్య, యోగవిద్య) తెలుసుకున్న వాళ్ళు అనుష్ఠానం చేసే వేళ 'ఉ'కారం ఉత్పత్తిని గ్రహించ వచ్చు. వాయువు యొక్క ఊర్ధ్వ గమనంలో కత్తిరించబడిన కఫాది దోషాలు ఈ ఉకారోచ్చారణాస్థానం నుండి గాలి క్రిందికి త్రోయబడ్డాక క్రిందికి వచ్చి, జఠరాశయంలో చేరి, జీర్ణమై, శుద్ధమై శుక్ల వృద్ధికి కారణమౌతుంది. అందువల్ల దేహానికి పుష్టి, దాని వల్ల మనస్సుకు ఉత్సాహమూ లభిస్తాయి. ఇది ఉభయోత్కర్ష. ఈ మర్మాన్ని గ్రహించి ప్రాణవిద్యానుష్ఠానం చేసే వ్యక్తి జ్ఞాన సంతతిని పెంపొందించుకుంటాడు. అందరి ఆదరానికి పాత్రుడౌతాడు. ఇతని వంశంలో అజ్ఞానులైన పిల్లలు అసలే పుట్టరు.

**సుషుప్త స్థానః ప్రాజ్ఞో మకార స్తృతీయా**
**మాత్రామితేర పీతేర్వా । మినోతి హవా**
**ఇదం సర్వమ పీతిశ్చ భవతి య ఏవం వేదా 11**

మూడో అవస్థ అయిన సుషుప్త స్థితిలో జీవాత్మ అస్తిత్వం మాత్రమే ఉంటుంది. అతడి వ్యాపారపు ఎరుక అతనికి ఉండదు. ప్రాణపు సహజ క్రియకు మాత్రమే అది పరిమితం. మనస్సు వ్యాపకత్వ రహితమై తన మూల చైతన్యమైన జీవాత్మలో ఐక్యమై విశ్రాంతి తీసుకుంటుంది. అలాగే ప్రాణోపాసనలో 'నిర్వికల్ప సమాధి' అనే స్థితిలో వాయువు ద్వారా ఉత్పత్తి అయ్యే శబ్దం ఉండదు. మనఃప్రాణాలు లీనమై ఆత్మలో కలిసి పోతాయి. 'మ్' అనే శబ్దాన్ని ఉచ్చరించే వేళ గాలి బయటికి రాకుండా దేహంలోనే కలిసి పోతుంది. అందుకే ఈ సుషుప్తి స్థితి మకారంతో పోల్చారు. నేను ఇక్కడ దీనిని సమాధి స్థితితో పోల్చినా ప్రతి దినం జీవాత్మకు సుషుప్త స్థితి అప్రయత్నంగా లభించడం లేదు. ప్రాణవిద్యానుష్ఠాన క్రమాల్ని తెలుసుకుని జాగ్రదవస్థలో అనుష్ఠానం చేస్తే ఆ స్థితి కల్గి, తదనంతరం ఆత్మ యొక్క సహజస్థితి అయిన 'తురీయం' అనే స్థితిని పొందగలం. ప్రయత్నం లేకుంటే సుషుప్తి తర్వాత తురీయం లభించదు. మళ్ళీ స్వప్నస్థితో, జాగ్రదవస్థో లభిస్తుంది.

జీవాత్మకు, తురీయావస్థలో జ్ఞానం, ఆనందాల ప్రాప్తి కల్గుతుంది. ఆ స్థితి లభించే ముందు భ్రాంతికి గురై చలించే ఇంద్రియాలు, వృత్తులు, మనస్సు, అంతర్ముఖ నిశ్చలం కావలసి ఉంటుంది. అపుడు 'నిర్వికల్ప సమాధి' స్థితికే (సుషుప్తి లాంటిది) ప్రాధాన్యం.

దీన్ని గ్రహించి అనుష్ఠానం చేసే వాడికి ప్రపంచంలో ఉండే వాళ్ళందరి 'పరిమితి' అర్థమౌతుంది. అంతే కాక అంతర్ముఖుడై ఐక్యత యొక్క ఆనందాన్ని అనుభవిస్తాడు.

**అమాత్రశ్చతుర్థో౽ వ్యవహార్యః**

**ప్రపంచోపశమః శివో౽ ద్వైత**

**ఏవమోంకార ఆత్మైవ సంవిశత్యాత్మనా౽౽ త్మానం**

**య ఏవం వేద (12)**

నాల్గోదైన తురీయ స్థితిలో మాత్ర లేదు. (శబ్దోచ్చారణ) ఈ స్థితి కూడ గురుకృపతో లభ్యమయ్యేది! ప్రాణవిద్యానుష్ఠాన క్రమాన్ని గ్రహించి, శ్రద్ధాసక్తులతో అనుష్ఠానం చేస్తే మాత్రం లభిస్తుంది. అంతే కాక, జీవాత్మ యొక్క నిత్య వ్యవహారంలో (అప్రయత్నంగానే) లభించే స్థితి కాదు. ఈ స్థితిలో ప్రాపంచిక వ్యవహారాల్లో కల్గే నిర్బలత్వం, చాంచల్యం, నైరాశ్యం, దుఃఖం మొదలైనవన్నీ శాంతిస్తాయి. ఇదే శ్రేయస్కరమైన స్థితి. (ముక్తికి సాధనం) ఈ స్థితిలో 'తన' 'అస్తిత్వం' 'తన' మూలం తెలుస్తుంది. ఆ రెండింటి సంబంధం వల్ల ఆనందం. తాను దానికన్న భిన్నుణ్ణి కాననే తృప్తి (అద్వైతానుభవం) లభిస్తుంది.

ఇలా ఆత్మ సాక్షాత్కారానికి స్థానమైన ప్రణవాన్నే 'ఓం'కారాన్నే "ఆత్మ" అన్నారు. దీని మర్మం తెలుసుకుని ప్రాణవిద్యానుష్ఠానం చేసే వ్యక్తి తన ఇచ్ఛానుగుణంగా ఆ ఆత్మను (దేవుణ్ణి) చేరుకుంటాడు.

ఓం శాంతిః శాంతిః శాంతిః

# 5. ప్రశ్నోపనిషత్తు

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః**
**భద్రం పశ్యేమాక్షభిర్య జత్రాః**
**స్థిరై రంగై స్తుష్టువాం సస్తనూభిః**
**వ్యశేమ దేవహితం యదాయుః**
**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః**
**స్వస్తినః పూషా విశ్వవేదాః**
**స్వస్తిన స్తార్క్ష్యో అరిష్టనేమిః**
**స్వస్తినో బృహస్పతిర్దధాతు**

ఉపనిషత్తుల్లో అత్యంత ప్రధానమైనది ఈ ప్రశ్నోపనిషత్తు. ఇందులో జిజ్ఞాసువులు ఆరుమంది పిప్పలాద మహర్షి వద్దకు వచ్చి, తత్వ రహస్యాన్ని ఉపదేశించమని అడుగుతారు. ఈ ఆరుమంది అడిగే ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. తత్వాన్ని ఆకాంక్షించే వాళ్ళల్లో చెలరేగే ప్రశ్నలన్నీ ఈ ఆరుమంది అడిగిన ప్రశ్నల్లో వస్తాయని చెప్పవచ్చు.

పిప్పలాద మహర్షి ఈ ప్రశ్నల కందించిన ఉత్తరాలు కూడా అత్యద్భుతాలు. ఉదాహరణలతో, కథలతో ఇక్కడ పాఠకులకు సులభంగా అర్థమౌతాయి. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విశేషాలేమిటంటే–

1. ఆత్మ నుండి 'ప్రాణ' చైతన్యం వచ్చింది. అది వాయువును సృష్టించింది. ఆ వాయువే ఐదుపేర్లతో మన శరీరాల్లో వేర్వేరు భాగాల్లో ఉందనే అంశం.
2. స్వప్న స్థితిలో 'మనస్సే' సర్వాన్ని చూసే దేవత.

3. మన దేహంలోని దేవతలందరిలో ప్రాణుడే శ్రేష్ఠుడనే అంశాన్ని సోదాహరణంగా నిరూపించుకోవాలి.

4. పదహారు కళలతో కూడిన పురుషుడు మన దేహంలో ఉండే పురుషుడే.

ఇక్కడ షోడశ కళాపూర్ణుడు 'చంద్రు'డనే మాట స్మరణకు వస్తుంది. ఆత్యంతిక పురుషుణ్ణి సూర్యునితో పోలిస్తే ఈ పురుషుణ్ణి (ప్రత్యగాత్మ – జీవాత్మ) చంద్రునితో పోల్చవచ్చు. అతడు (దైవం) నాదబిందు కళాతీతుడు. ఇతడు (జీవాత్మ) నాదం ద్వారా (ప్రణవ) బిందువులో (బ్రహ్మ రంధ్రం) చేరాక, తన సహజ స్థితిని పొంది, 16 కళలతో విరాజిల్లుతాడు. ఇతనికి వృద్ధి, క్షయాలు ఉన్నాయి. అతనికివేవీ లేవు.

5. ప్రజాపతి సృష్టికి మూలమైన జడ, చైతన్యాల్ని సృష్టించాడనటం ఒక ముఖ్యాంశం. తపస్సు చేశాక అతడు వీటిని సృష్టించాడని మహర్షులంటారు. తపస్సు చేసిన ప్రజాపతి యొక్క సృష్టి గురించి మహర్షులు చెప్పిందంతా నిజమే! అయితే ఆ ప్రజాపతి అంటే ఎవరు? సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మయా ? ప్రకృతికే ప్రభువైన పురుషుడా? ఆత్యంతిక పురుషుడేనా?

6. అదీకాక, అన్నిటికన్న విలువైన, ముఖ్యమైన ఆత్యంతిక సత్యం గురించి మహర్షి పిప్పలాదుడు శైబ్యసత్యకాముని "చనిపోయే దాకా ప్రణవోపాసన (ఓంకార ధ్యానం) చేయడం వల్ల మనిషి ఏ లోకాన్ని జయిస్తాడు?" అనే ప్రశ్నకు ఉత్తరాన్ని అందిస్తూ ఇలా అంటాడు –

**యఃపునరేతం త్రిమాత్రేణై వోమి త్యేనేనై**
**వాక్షరేణపరం పురుషమభి**
**ధ్యాయీత సతేజసి సూర్యే సంపన్నః**
**యథా పాదోదరస్త్వ చా వినిర్ముచ్యత**
**ఏవం హవై స పాప్మనా వినిర్ముక్తః**
**స సామాభిరున్నీయతే బ్రహ్మలోకం వ ఏతస్మా**
**జ్జీవఘనాత్పరాత్పరం పురిశయం పురుష మీక్షతే**
**తదేతౌ శ్లోకౌ భవతః (5-5)**

(అంటే త్రిమాత్రలుండే ఈ ఓం అనే అక్షరం ద్వారా 'పరమ పురుషుని' ధ్యానం చేసే వ్యక్తి సూర్యుని వద్దకు వెళ్లి అక్కడ స్థూల శరీర పాపాలతో విముక్తుడై దానికవతల ఉండే 'శరీరస్థ పరాత్పర పురుషుణ్ణి' చూస్తాడు) అని వివరణ ఇవ్వడం ద్వారా దేవుడంటే నిత్యదేహి అయిన ఆత్యంతిక పురుషుడే (నిరాకార చైతన్యం కాదు) అని స్పష్టంగా బోధించారు ఉపనిషత్కారులు. ఈ దృష్టితో చూస్తే ఈ ఉపనిషత్తు చాలా మహత్వపూర్ణమైనది.

ఇక్కడ కూడా ఆ దేవునికి దేహం ఉండే పక్షంలో ఆ జడం (దేహం) పాంచభౌతికం కాదా ? అదీ నశ్వరమేనా? "యద్దృష్టం తన్నష్టం" మొదలైన ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి కదా? అంటే అది కేవలం బాల బుద్ధి. ఆ దేవుని దేహంలోంచి బయటికి వెలువడిన ఒక శక్తి 'ప్రాణం' అనేది. దాంట్లోంచి నాల్గు భూతాలు పుట్టాయి. భూతాలకు మూల మాతృక అయిన ప్రాణశక్తి దేవుని దేహంలో పుట్టి బయటికి వెలువడింది కదా ! మరి ఆ దేహం పాంచభౌతికమంటే అదెలాంటి బుద్ధి?

ఇలా ఉపనిషత్తులో కేవల సత్యం (దైవం) గురించి, ప్రజాపతి ద్వారా సాగిన సృష్టి, మన దేహం మరియు బాహ్య జగత్తుకు మూలాధారమైన శక్తులు, వస్తువుల గురించి, దేవుణ్ణి దర్శించి అమృతత్వం (ముక్తి) పొందేందుకు సాధనమైన ప్రణవోపాసన (ఓంకారం) గురించి విపులంగా బోధించడం జరిగింది. అందువల్ల ఈ ఉపనిషత్తు చాలా ముఖ్యమైనది.

7. చివరిగా, ఈ ఉపనిషత్తులో గమనించాల్సిన అంశ మేమంటే – జిజ్ఞాసువులు తన వద్దకు వెళ్ళినపుడు పిప్ప లాదుడు వాళ్ళ ప్రశ్నలకు వెంటనే సమాధానం ఇవ్వక "ఒక సంవత్సరం శ్రద్ధావంతులై, బ్రహ్మచర్య వ్రతంతో తపస్సు చేయండి. తర్వాత మీకు కావలసిన ప్రశ్నలడ గండి. నాకు తెలిసినంత మేరకు జవాబులందిస్తాను" అని అన్నాడు. దీనికి కారణం 1) శ్రద్ధావంతులై బ్రహ్మ చర్యంతో తపస్సు చేస్తే ఒక సంవత్సర కాలంలో వారికి బుద్ధిలో అనేక సంశయాలకు పరిహారం లభిస్తుంది. జ్ఞాన వికాసానికి శ్రీకారం చుట్టినట్లువుతుంది. అపుడు తాను తపస్సు ద్వారా పొందిన జ్ఞానాన్ని వివరించి చెబితే వారు దాన్ని నమ్మడం సాధ్యమౌతుంది. అలా కాకుండా తమ స్థూల ప్రకృతి దోష పూరితమైన వేళ – జ్ఞాన వివరణల్ని శబ్దాల ద్వారా అందిస్తే – ఆ స్థూల ప్రకృతి దోషం వల్ల బుద్ధి మాంద్యం, వికారాలు ఆ వాక్కులో చేరిపోతాయి. ఆ మాటలు నమ్మశక్యంగా ఉండవు. స్థూల ప్రకృతి దోష నివారణకై ఒక ఏడాదిపాటు శ్రద్ధతో బ్రహ్మచర్యంలో ఉండి

తపించడం అవసరం. ఈ మాటనే మా గురువర్యులు ప్రభుయోగి శ్రీ అచ్యుతుల వారంటూండే వారు. ఏ కాలంలో నైనా తపస్సుకు సంబంధించిన అనుభవాలు, జ్ఞానాలు ఒకే రకంగా ఉంటాయనడానికి దీనికి మించిన నిదర్శనం ఇంకేం కావాలి?

ఇక్కడ పాఠకుల కుతూహలాన్ని శమింప జేసేందుకు ఆ ఆరుమంది జిజ్ఞాసువులు పిప్పలాదుణ్ణి అడిగిన ప్రశలేవేవి? వాటికి వారందించిన ఉత్తరాలు ఏవి? అనేదాన్ని సంక్షిప్తంగా వివరిస్తా.

1. కత్యాయనుని కొడుకైన కబంధుడు వేసిన ప్రశ్న : "భగవన్! ఈ ప్రజలంతా ఎక్కడ నుండి పుడతారు?

**పిప్పలాదుని జవాబు :** ప్రజల్ని కోరుకున్న ప్రజాపతి తపస్సు చేశాడు. అనేక ప్రజల ఉత్పత్తి కోసం "రయించ ప్రాణంచ" (జడ ద్రవ్యం మరియు ప్రాణవంతమైన) జడ, చైతన్యాల్ని సృష్టించాడు. 'ఉత్పాదయతే' అని చెప్పి ప్రాణాంశ ప్రాధాన్యం, జడాంశ ప్రాధాన్యం కల్గిన కొన్ని వస్తువులను ఉదాహరిస్తాడు. ఆదిత్యుడే ప్రాణం. చంద్రుడే రయి. 'రయి' అంటే ఆకారమున్న వస్తువు. ఆ ఆదిత్యుడే ఈ విశ్వరూపుడైన వైశ్వానరుడు. ప్రాణుడే అగ్ని. ప్రజల ప్రాణం సూర్యుడే. సూర్య మండలం నుండే అన్ని గ్రహాల్లోని చరాచర ప్రాణి కోటికి శక్తి ప్రసరింపబడు తుందనే అంశాన్ని విజ్ఞానులు తెలుసుకున్నారు. సూర్య కిరణాల స్పర్శతో కర్మప్రేరణ, చంద్రకిరణాల స్పర్శతో నిద్రకు ప్రేరణ లభిస్తాయనేది మన అనుభవపు మాట. సూర్యుని వెలుగు ఉండే వేళ (పగలు) కర్మ కోసం, రాత్రి అంతర్ముఖత్వం (తపస్సు) కోసమనేది సృష్టి నియమమని ప్రభుయోగి అచ్యుతుల వారి బోధన.

అలాగే సంవత్సరం ప్రజాపతి. ప్రజల్ని కోరుకొనే ఋషులు కర్మల్ని ఆచరించి,దీన్ని ఉపాసించి, చంద్రలోకానికి వెళ్ళి మళ్ళీ తిరిగి వస్తారు. ఇదే రయి. పితృయాగం : ముక్తులు కావాలనుకున్న వాళ్ళు ఉత్తర మార్గాన్ని (దేవయానం) అవలంబించి తపస్సు, బ్రహ్మచర్యం, శ్రద్ధ, విద్యలతో ఆత్మను గ్రహించి ఆదిత్య లోకాన్ని చేరతారు. వారికి పునర్జన్మ లేదు.

అలాగే మాసం ప్రజాపతి, కృష్ణపక్షం రయి. శుక్లపక్షం ప్రాణం, దినం ప్రజాపతి.

2. వైదర్భి భార్గవుని ప్రశ్న :– భగవన్ ! ఎంతమంది దేవతలు ప్రజలకు ఆధారంగా వున్నారు? వాళ్ళలో దీన్ని ప్రకాశింప జేసేదెవరు? వాళ్ళల్లో వరిష్ఠులు ఎవరు?

**పిప్పలాదుని జవాబు :** ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి, వాక్కు, మనస్సు, కళ్ళు, చెవులు – ఇవే ఆ దేవతలు.

ప్రాణుడంటే దేహంలో ఈ దేవతలంతా ఉంటారు. అతడు వదలి వెళ్ళితే, వీళ్ళూ బయటికి నిష్క్రమించాల్సిందే. ఉండడానికి వీలే లేదు! రథనాభికి (చక్ర మధ్యస్థానంలో) జోడించబడిన దంతాల్లా వీళ్ళు ప్రాణాన్నే ఆశ్రయించి ఉంటారు. ఆ దేవతలు ప్రాణునితో – "నీవు ప్రజాపతివి. గర్భంలో నీవే సంచరిస్తూంటావు. పంచ ప్రాణ సహితుడవైన ప్రాణమే నీవు. దేవతల్లో శ్రేష్ఠుడైన అగ్ని, పితృదేవతల ప్రథమ ఆహుతి నీవే ! నీవు తేజస్సులో ఇంద్రుడివి ! రక్షించే రుద్రుడివి ! ప్రకాశించే సూర్యుడివి. అంతా నీవే ! వర్షం కల్గించే వాడివి నీవే ! నీవు ఒక్కడే ఋషివి ! (ఋతంలో ఉండే వాడివి, ధారణాశక్తి కల్గిన వాడివి) 'విశ్వస్య సత్పతి !

జగత్తుకు ఈశ్వరుడు. 'పితాత్వం మాతరిశ్వనః' నీవు గాలికి తండ్రివి! వాక్కు, చెవులు, కళ్ళు, మనస్సులలో వ్యాప్తమైన నీ అంశను సదా మంగళకరంగా మార్చుకో ! బయటికి వెళ్ళేట్లు చేయవద్దు. స్వర్గంలో ప్రతిష్ఠితమైన ఈ ప్రాణం వశంలోనే అంతా ఉంది.

**"ప్రాణస్యేదం వశే సర్వం త్రిదివే యత్ప్రతిష్ఠితమ్**
**మాతేవ పుత్రాన్ రక్షస్వ శ్రీశ్చ ప్రజ్ఞాం విధేహిన ఇతి"**

తల్లి పిల్లల్ని కాపాడినట్లు మమ్మల్ని రక్షించు. మాకు సంపదను, జ్ఞానాన్ని ప్రసాదించు" అని స్తోత్రం చేస్తారు.

3. అశ్వలాయనుని కొడుకు కౌసల్యుని ప్రశ్న : ఈ ప్రాణం ఎక్కడ పుడుతుంది? ఈ దేహంలో ఎలా ప్రవేశిస్తుంది? తనను విభజించుకుని దేహంలో ఎలా ఉంటుంది? ఎందుకీ దేహాన్ని వదలి వెళ్ళుతుంది? బయటి వస్తువుల్ని ఎందుకు ధరిస్తుంది?

**పిప్పలాదుని జవాబు :** "ఆత్మన ఏషప్రాణో జాయతే". ఆత్మ నుండి ఈ ప్రాణం "మనోకృతే నాయాత్యస్మిన్ శరీరే" (3–3).

చక్రవర్తి వేరే వేరే అధికారుల్ని నియమించినట్లు పంచ ప్రాణాల్ని దేహంలోని వేర్వేరు భాగాల్లో వాయువు నియమిస్తుంది. ఉపస్థలాల్లో అపానం, చక్షువు (కళ్ళు), శ్రోత్రం (చెవులు), ముఖం, నాసిక (ముక్కు)లో వ్యానం సంచరిస్తుంది.

**"'అథైక యోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యం లోకం నయతి**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకం (3–7)**

ఆ నాడుల్లో ఒకటి పైకి వెళ్ళుతుంది. దాని ద్వారా పైకి వెళ్ళే ఆ

ఉదానం పుణ్యవంతుల్ని పుణ్యలోకానికీ, పాపిని పాపలోకానికీ తీసుకు వెళ్ళుతుంది. ఇవి రెండూ ఉన్న వాళ్ళను మానవ లోకానికి తీసుకు వెళ్ళుతుంది.

"ఆదిత్యోహవై బాహ్యఃప్రాణః" సూర్యుడే బయటి ప్రాణం. (బయట ఉండే ప్రాణశక్తి కేంద్రం) బయటి వస్తువుల నన్నిటినీ ధారణ చేస్తాడు సూర్యుడు. పృథ్విలో అధిష్ఠానమయినది 'అపానం'! మధ్యలో (బయట, అంతరిక్షం) ఉండేది సమానం. వ్యాప్తమై అన్నిచోట్ల సంచరించేది వ్యానం.

తేజస్సు 'ఉదానం' కావడం వల్ల ఇంద్రియ వృత్తులు మనస్సులో నుండి చనిపోయిన వాళ్ళు మళ్ళీ పుడతారు.

చిత్తంతో పాటు ఉదానం ప్రాణంలోకి వస్తుంది. ప్రాణం తేజస్సుతో, ఆత్మతో అతడు సంకల్పించిన లోకానికి వెళ్ళుతుంది. ప్రాణాన్ని తెలుసుకున్న విద్వాంసుని ప్రజ్ఞలు నశింపవు. అతడు అమృతుడౌతాడు.

4. గార్గ్య సౌర్యాయణి ప్రశ్న : ఈ పురుషుడిలో ఏవేవి నిద్రించేవి? (ఎచ్చరలేనివి) ఎవేవి ఎచ్చర కల్గి ఉంటాయి? ఏ దేవత స్వప్నాన్ని చూస్తాడు. ఎవరికి సుఖం కల్గుతుంది? దేంట్లో అంతా చేరతాయి? (కస్మిన్ను సర్వే సంప్రతిష్టితా భవంతి)

**పిప్పలాదుని జవాబు :** అస్తమించే సూర్య కిరణాలు ఆ మండలంలో చేరి (తేజోమండలం) అతడు సాక్షాత్కరించాక మళ్ళీ బయటికి వస్తాయి. అలాగే శ్రేష్ఠ దేవత అయిన మనస్సులో ఇవన్నీ లీనమౌతాయి. (ఇంద్రియ వృత్తులు) ప్రాణాగ్నులు మాత్రమే జాగృతంగా ఉంటాయి. గార్హపత్యమే అపానం. వ్యానం అన్వాహార్యం. ఆహవనీయం

ప్రాణం. ఉచ్ఛ్వాస, నిశ్వాసాల్ని నడిపించే క్రియ సమానం. "మనోహవావ యజమాన". మనస్సే యజమాని. ఇష్టఫలాన్ని లభింపజేసేది 'ఉదానం'. 'స ఏనం యజమాన మహరహ ర్బ్రహ్మగమయతి" ఇది మనస్సును ప్రతి దినమూ బ్రహ్మస్థానం వైపుకు తీసుకు వెళ్ళుతుంది.

మనస్సే స్వప్నంలో చూసేది, అడిగేది, అనుభవించేది.

**'సయదా తేజసాభిభూతో భవత్యత్రైషదేవః**

**స్వప్నాన్న పశ్యత్యథ తద్యేతస్మిన్ శరీరే ఏతత్సుఖం భవతి"**

(జ్ఞాన తేజస్సుతో నిండిన వేళలో మనస్సు స్వప్నాన్ని దర్శించదు. ఈ శరీరంలో అది సుఖంగా ఉండి పోతుంది.) పక్షులు తమ గూళ్ళుండే చెట్టునే ఆశ్రయించినట్లుగా ఇవన్నీ శ్రేష్టమైన ఆత్మలో చేరతాయి. భూతాలూ, తన్మాత్రలూ, ఇంద్రియాలూ, వృత్తులూ, మనస్సు, ప్రాణం – ఇవన్నీ ఆత్మలో చేరతాయి.

**"ఏషహిద్రష్టా, స్ప్రష్టా, శ్రోతాఘ్రాతా**

**రసయితా, మంతా, బోద్ధా, కర్తా**

**విజ్ఞానాత్మా పురుషః సపరేఽక్షరే**

**ఆత్మని సంప్రతిష్ఠతే (4-9)**

ఇతడే చూసేవాడు, ముట్టేవాడు, వినేవాడు, వాసన చూసేవాడు, రుచి చూసేవాడు, తలచేవాడు, తెలుసుకునే వాడు, చేసేవాడు. అతడు విజ్ఞాన పూర్ణుడైన ఆత్మ ! పురుషుడు. శ్రేష్ఠుడైన, నాశరహితుడైన ఆ దేవునితో చేరిపోతాడు. ఆ వాయురహితమైన, శరీర రహితమైన, వర్ణ రహితమై శుద్ధమైన అక్షరాన్ని తెలుసుకున్న వాడు, సర్వజ్ఞుడూ అయి ఉన్నాడు.

ఇక్కడ పరుణ్ణి తెలుసుకున్న వ్యక్తి సర్వజ్ఞుడూ కావడం నిజం. సర్వమూ అవుతాడంటే 'సర్వోభవతి' అనే దాన్ని "సర్వాత్మ భావముండే వాడౌతాడు" (అన్నిటినీ తనతో సమానంగా చూసే భావం, సమదర్శిత్వం) గా గ్రహించాలి. అలాగే – 'అశరీరుడు' అనేదాన్ని పాంచభౌతికమైన నశ్వరశరీరం లేని వాడని గ్రహించాలి. అలా కాకుండా 'రూపరహితు'డని భావించరాదు. అలాగే – ఎందుకంటే – ఇది వరకే – ఆ పరాత్పర పురుషుణ్ణి "ఏతస్మాజ్జీవఘనాత్పరాత్పరం పురిశయం పురుష మాచక్షతే" జీవభూతుడైన అవతల ఉండే పరాత్పరుడైన, పురంలో ఉండే పురుషుణ్ణి చూసేవాడుగా బోధించి ఉన్నారు.

5. శైబ్య సత్యకాముని ప్రశ్న : ప్రాణోత్క్రమణ వేళలో ఓంకారాన్ని ధ్యానించే వ్యక్తి ఏ లోకాన్ని జయిస్తాడు?

**పిప్పలాదుని జవాబు :** ఈ ఓంకారమనేది పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ. అందువల్ల విద్వాంసులు దీని ఆధారంతో ఈ రెండింటిలో ఒకదాన్ని పొందుతారు.

ఇక్కడ కూడా ఓంకారమే పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ. అందువల్ల విద్వాంసులు దీని ఆధారంతో ఈ రెండింటిలో ఒకదాన్ని పొందుతారు.

ఇక్కడ కూడ ఓంకారమే పరబ్రహ్మ మరియు అపరబ్రహ్మ అనే అంశాన్ని గురించి చర్చిద్దాం. "అపరబ్రహ్మ" అంటే – ఈ లోకంలో, ఈ దేహంలోనే ఉండి బ్రహ్మాత్మానుభవం (ఆనందం), బ్రహ్మ జ్ఞానాల్ని పొందడమనీ, 'పరబ్రహ్మ' అంటే ఈ దేహాన్ని త్యాగం చేసి, అక్షరుడైన పరాత్పరునిలో చేరడమనీ తెలుసుకోవాలి. ఈ రెండు స్థితుల్ని

పొందేందుకు ఆధారం (సాధనం) ఓంకారం కావడం వల్ల అదే పరబ్రహ్మ. అదే అపరబ్రహ్మ అని అన్నారు.

ఇందులో ఒక మాత్రను మాత్రమే అనుష్ఠానం చేస్తే తపస్సు బ్రహ్మచర్యాలతో కూడిన వాడై మహిమల్ని పొందుతాడు. మనః పూర్వకంగా రెండు మాత్రల (ఋక్, యజుర్, ఊర్ధ్వ, అధోగతులు) అనుష్ఠానం చేస్తే సోమ (చంద్ర) లోకానికి వెళ్ళి, సుఖాల్ని అనుభవించి మళ్ళీ పుడతాడు. మూడు మాత్రలతో కూడిన (ఋక్కు, యజుస్సు, సామం, ఊర్ధ్వ అధోరుద్ర గతుల్లో) ఓంకారాన్ని పరమపురుషుని ధ్యానంతో పాటు అనుష్ఠానం చేసే వ్యక్తి సూర్యలోకానికి పోయి, స్థూల శరీరం, పాపాలతో ముక్తుడై అక్కడ నుండి సామవేద బలంతో బ్రహ్మలోకం చేరతాడు. అతడు జీవభూతుని అవతల ఉండే దేహస్థుడైన పరాత్పర పురుషుని దర్శిస్తాడు.

**'ఋగ్భిరేతం యజుర్భిరంతరిక్షం ససామభి**
**ర్యత్తత్కవయోవేదయంతే**
**తమోంకారేణై వాయతనే నాన్వేతి**

6. భరద్వాజుని కొడుకు సుకేశుని ప్రశ్న : పదహారు కళలుండే పురుషుడెవరు? అతడు ఎక్కడుంటాడు?

**పిప్పలాదుని ఉత్తరం :** షోడశ కళలతో కూడిన పురుషుడు ఈ శరీరం లోపల ఉంటాడు. అతడు ఆలోచించి ఎవరు దేహంలో ఉన్నారు? ఆ దేహం తన నివాసానికి యోగ్యంగా ఉందో లేదో, ఎవడు అక్కణ్ణుంచి బయటికి వస్తే తాను కూడ బయటికి రావల్సి వస్తుందో, అలాంటి ప్రాణాన్ని సృష్టించాడు.

(ఇక్కడ తప్పుడు అభిప్రాయానికి అవకాశముంది. పై మాట ద్వారా 'ఆత్మే' మొదట దేహాన్ని రచించుకొని, దాంట్లో ప్రవేశించి, తర్వాత ప్రాణశక్తిని సృష్టించుకొన్నాడని అర్థమౌతుంది. అయితే అనుభవస్థుల మాట ప్రకారం ఆడ, మగ – వీళ్ళిద్దరి సంగమ సమయంలో మగవాడి దేహంలో ప్రాణస్పందన ప్రారంభమై, ఆ ప్రాణాంశం శుక్లంలో చేరి, ఆడదాని గర్భకోశంలో రక్తంతో పాటు చేరి పిండమై, తర్వాత ఆ ప్రాణాంశమే (శక్తి) ఆడదాని గర్భకోశంలో దొరికే భూతధాతువుల అంశంతో శరీర రచన గావించుకుని అందులో చేరి 'వాయువు'ను ఉత్పత్తి చేసుకొని అవన్నీ దేహంలో వివిధ భాగాల్లో చేరి క్రియ నడుస్తూ ఉంటుంది. ఐదవనెలలో (శిశువు శరీర రచన పూర్ణంగా ముగిసిన తర్వాత ప్రాణశక్తి వాయువును ఉత్పత్తి చేసి, వాటి క్రియ ప్రారంభ మయ్యాక, ఆత్మ ప్రవేశిస్తాడని చెప్పబడింది. ప్రభుయోగి శ్రీఅచ్యుతుల 'కాయకల్పం' గ్రంథం చదవండి)

అందువల్ల ఇక్కడ 'ఆత్మ' అంటే ఈ పాంచభౌతిక దేహంలో ఉండే జీవాత్మ కాదు. (ప్రత్యగాత్మ కాదు). పరమాత్మ (ఈశ్వరుడు – హిరణ్యగర్భుడు) అని గ్రహించాలి. తన అంశమైన జీవాత్మ నివాసానికి యోగ్యం అయ్యేందుకు దేహంలో 'ప్రాణశక్తి' ఉంటేనే సాధ్యమనీ, ప్రాణాన్ని సృజించాడనడం మహర్షుల అభిప్రాయమై ఉండాలి. వాళ్ళు సృష్టికర్త అయిన ప్రజాపతి లాగే విచారించి, తనలోని ప్రాణాంశాన్ని బయట వదలి ఉండాలి. అయితే ఆ ప్రజాపతి యొక్క శరీర నిర్మాణానికి కారణమైన ప్రాణశక్తి కూడ పరాత్పర పురుషుని నిత్య దేహంలో ఉండే చైతన్య స్పందనంలోంచి ఉత్పత్తి అయి బయటికి వచ్చిన ఒక శక్తి. ఆ శక్తి సహజంగా ఆ నిత్య దేహంలో ఉత్పత్తి అయి బయటికి వచ్చింది.

అతనిలో సంకల్పం లేదు. అందువల్ల అతడు లిప్తుడు కాదు. నిరంతరం ఆనందంగా ఉంటాడు.

అఖండానంద విగ్రహుడు. అయితే కర్త ననిపించుకున్న ప్రజాపతి అలా కాదు. అతనిలో విచారం, సంకల్పం, తపస్సు – ఇవన్నీ ఉన్నాయి. దేవతలందరి యజమాని పరమేశ్వరుడు, పరమేష్ఠి, ఆదిపురుషుడు, సర్వోత్తముడైనా సర్వాతీతుడు కాదు. అనాది పురుషుడు కాడు. ఇది చాలామంది తపస్వులకు గోచరం కాని సృష్టికే మూలమైన రహస్యం.

ప్రాణంలోంచి శ్రద్ధ, ఆకాశం, వాయువు, జ్యోతి, నీరు, భూమి, ఇంద్రియాలు, మనస్సు, అన్నం, అన్నంలోంచి వీర్యం, తపస్సు, మంత్రం, కర్మ, లోకం, పదార్థాలు ఇలా సృష్టించబడ్డాయి.

సముద్రాభిముఖంగా ప్రవహించే నదులు సాగరాన్ని చేరి ఎలా తమ అస్తిత్వాన్ని పోగొట్టుకుంటాయో 'సముద్రం'గానే తయారౌతాయో, అలాగే పురుషాభిముఖంగా సాగే ఈ పదహారు కళలు పురుషునిలో చేరి 'పురుషుడు'గానే పిలువబడతాయి.

'స ఏషో కలోఽ మృతో భవతి' ఇలా పదహారు కళలతో కూడిన పురుషుడు (జీవాత్మ) కళలే లేని పురుషునిలో చేరి అమృతుడౌతాడు. ఆ పురుషుణ్ణి తెలుసుకోండి. అతని జ్ఞానం కల్గాక మృత్యుబాధ ఉండదు. దీనికన్న పెద్దదింకేమీ లేదు.

**పాఠకులకో విన్నపం.**

ఈశ, కేన, కఠ, మాండూక్య, ప్రశ్నోపనిషత్తులు ఐదింటిని కూలంకషంగా పరిశీలిస్తే చాలా విషయాలు ఇందులో వస్తాయి.

ఇక దశోపనిషత్తుల్లో మిగిలిన ఐదు ఉపనిషత్తుల్లోనూ ఇవే విషయాలు వేరే శబ్దాల్లో వర్ణింపబడ్డాయి. వాతావరణ శుద్ధి కోసం, ఇళ్ళ కోసం చేసే యజ్ఞాలు సంతానోత్పత్తి కోసం సాధనమైన మైధున క్రమం ఇవన్నీ గౌణమైన (అంతగా ప్రధానం కాని) విషయాలు.

జిజ్ఞాసువులకు ఈ ఐదు ఉపనిషత్తులే చాలు అనిపిస్తుంది. అందువల్ల మిగిలిన 5 ఉపనిషత్తుల సారాంశాన్ని మాత్రం ఇచ్చి, అత్యంత ప్రధానమైనవని అనిపించిన మంత్రాల గురించి మాత్రమే వివరించ బడింది.

## 6. ముండకోపనిషత్తు

ఈ ఉపనిషత్తులో ప్రధమఖండంలో (ఒకటో ముండకం) బ్రహ్మ విద్య ఆదికాలం నుంచి వచ్చిన క్రమం, పరావిద్య, అపరా విద్యల లక్షణాలు, బ్రహ్మ తపస్సు వల్ల కల్గిన సృష్టి యొక్క వివరాలు వివరించ బడ్డాయి. యజ్ఞ యాగాలతో కూడిన కర్మ మార్గం, దాని ఫలాలు, జ్ఞాన మార్గం శ్రేష్ఠత మరియు జ్ఞాన మార్గం వివరాలు రెండవ ఖండంలో చెప్పబడ్డాయి. రెండో ముండకం, ఒకటో ఖండంలో, విశ్వసృష్టికి మూల కారణమైన అక్షరాన్ని అవగాహన చేసుకున్న వ్యక్తి యొక్క సంశయాలన్నీ పటాపంచలు అవుతాయనే బోధ ఉంది. రెండవ ఖండంలో బ్రహ్మ స్వరూపం, బ్రహ్మ ప్రాప్తి మార్గమైన ప్రణవం వివరాలు చెబుతూ ఏకాగ్రతతో, ఉపనిషత్ జ్ఞానంతో కూడి, ఉపాసిస్తూ బ్రహ్మతాదాత్మ్యాన్ని పొందాలని బోధించబడింది.

మూడో ముండకం; ఒకటో ఖండంలో సంసారపు సహజత్వం ఎలాంటిది? జీవుడు – శివుడు వీళ్ళ సంబంధం ఏమి? బ్రహ్మజ్ఞాని ఎవరు? బ్రహ్మ జ్ఞానుల్లో శ్రేష్ఠులెవరు? ఆ స్థితిని పొందే మార్గమేమిటి? ఆ స్థితిని పొందిన వాడి సామర్థ్యం ఎలాంటిది? మొదలగు విషయాల వివరణ ఉంది.

రెండో ఖండంలో ఆత్మజ్ఞానం ఎవరికి లభిస్తుంది? ఎలాంటి వారికి దొరకదు? బ్రహ్మ జ్ఞానాన్ని ఎలాంటి వారికి ఉపదేశించాలి? అనే విషయాలను వివరించి, భగవత్కృప లేకుంటే జ్ఞానప్రాప్తి అసాధ్య మని నిర్ణయించబడింది. బ్రహ్మజ్ఞానులు అమృతత్వాన్ని పొందుతారు. వాళ్ళకు పునర్జన్మ లేదనే ఉపదేశం ఇందులో ఉంది.

**శాంతి మంత్రం**

**ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః**
**భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।స్థిరై రంగై స్తుష్టువాంసస్త నూభిః**
**వ్యశేమదేవ హితం యదాయుః । స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః**
**స్వస్తినః పూషా విశ్వవేదాః । స్వస్తిన స్తార్క్ష్యో అరిష్టనేమిః**
**స్వస్తినో బృహస్పతిర్ధదాతు**

**ఓం బ్రహ్మదేవానాం ప్రథమః సంబభూవ**
**విశ్వస్యకర్తా భువనస్యగోప్తా**
**స బ్రహ్మ విద్యాం సర్వవిద్యా ప్రతిష్ఠా**
**మథర్వాయ జ్యేష్ఠ పుత్రాయప్రాహ.**

"దేవతలందరికన్న మొట్టమొదట బ్రహ్మ పుట్టాడ"నే మాటలతో ఈ ఉపనిషత్తు ప్రారంభమైంది. ఇక్కడ "బ్రహ్మ" శబ్దం త్రిమూర్తుల్లో

ఒకరైన బ్రహ్మకు వాచకం కాదు. ఆదిదేవుడైన హిరణ్యగర్భుడు, పురుష రూపుడైన పరమాత్మను సూచిస్తుంది ఆ శబ్దం ! ఎందుకంటే – ఈ బ్రహ్మను కేవలం 'విశ్వస్యకర్తా' (విశ్వాన్ని సృష్టించిన వాడు) అని మాత్రమే కాకుండా 'భువనస్య గోప్తా'– లోకాన్ని రక్షించేవాడని చెప్పడం వల్ల సృష్టికార్యాన్ని మాత్రమే చేసే త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మ కాదనే అర్థం స్ఫురిస్తుంది. అదీ కాక, పదునాల్గు లోకాలతో కూడిన బ్రహ్మాండాన్ని మాత్రమే సృష్టించే వాడు కాదు ఇతడు. ఇతడు 'విశ్వకర్త'. ఈ పదునాల్గు లోకాలతో కూడిన బ్రహ్మాండానికి సృష్టికర్త అయిన బ్రహ్మ సత్యలోకం లోనూ, రక్షకుడైన విష్ణువు వైకుంఠంలోనూ, లయకారుడైన రుద్రుడు కైలాసం లోనూ ఉండి తమ తమ కార్యకలాపాల్ని సాగిస్తున్నారు.

సౌర కుటుంబంలో ఉండే లోకాలకన్నిటికీ ప్రాణశక్తి ప్రసారం సూర్యమండలం నుండి జరుగుతుంది. అలాగే విశ్వంలోని కోటి సూర్య మండలాలకు శక్తిని ప్రసారం చేసే 12 ముఖ్య శక్తి కేంద్రాలున్నాయి. వాటినే ఆదిత్యమండలాలంటారు.

ఈ పంద్రెండు మండలాల అధిపతులే 'ద్వాదశాదిత్యులు'. ఈ మండలాలకు కూడ శక్తిని ప్రసారం చేసే కేంద్రం 'సూర్య మండల'మే! ఆ భానుమండల స్వామే భాస్కరుడు. అతడే భువనేశ్వరుడు. భానుమండలాన్నే హిరణ్మయలోకమనీ, దాని అధిపతి హిరణ్యగర్భుడు– పురుష రూపి పరమాత్మ, పరమేశ్వరుడు, పరబ్రహ్మ – అని వర్ణించడం కన్పిస్తుంది. దీనికే పురుష ఖండమనీ, కుమార సర్గమనీ పేరు. త్రిమూర్తుల లోకాల పై క్షీరసాగరం, దాని పై గోలోకం తర్వాత ఈ స్థానం. అతణ్ణే ఇక్కడ 'బ్రహ్మ', 'విశ్వకర్త', 'భువనస్య గోప్తా' లాంటి శబ్దాలతో ఉపనిషత్కారులు వర్ణించారు.

ఆ బ్రహ్మ సర్వ విద్యలకూ మూలధారమైన బ్రహ్మవిద్యను తన పెద్ద కొడుకైన 'అధర్వుని'కి బోధించాడు. ఆ అధర్వుడు దాన్ని అంగీరసునికి, అతడు సత్యవాహునికి బోధించడం జరిగింది. సత్యవాహుని నుండి అంగీరసునకు, అతని నుండి శౌనకునకు ఈ విద్య లభించింది. శౌనకుడు వచ్చి అంగీరసుణ్ని 'దేన్ని తెలుసుకోవడం ద్వారా అంతా తెలుసుకున్నట్లవుతుంది?" అని ప్రశ్నించగా (తస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి), అంగీరసుడు "ద్వేవిద్యే దిత్యవే" తెలుసుకోవాల్సిన విద్యలు రెండు. పరావిద్య, అపరా విద్యలని చెప్పి, నాల్గు వేదాలు, ఆరు శాస్త్రాలు ఇవన్నీ అపరా విద్య అని, నాశ రహితమైన దాన్ని చేరేందుకు ఉపయోగపడేది పరావిద్య అనీ, ఆ అక్షరం చాలా సూక్ష్మమనీ, (బుద్ధితో) గ్రాహ్యమైనది కాదనీ, కనిపించనిది, సర్వవ్యాపి, సర్వభూతాల ఉత్పత్తి స్థానం అనీ వర్ణించాడు.

**యథోర్ణ నాభిః సృజతే గృహ్ణతే చ**
**యథా పృథివ్యామోషధయః సంభవంతి**
**యథా సతః పురుషాత్కేశలోమాని**
**తథాక్షరాత్సంభవతీ తహ విశ్వమ్**

"సాలెపురుగు ఎలా తన గూటిని తానే అల్లుతుందో, మరలా దాన్ని తనలోకి ఉపసంహరించుకుంటుందో, భూమిలో ఓషధులు, దేహంలో వెంట్రుకలు ఎలా మొలకెత్తుతాయో, అలాగే ఆ అక్షరం నుండి ఈ విశ్వం పుట్టింది.

**"తపసా చీయతే బ్రహ్మ తతో౽ న్న మభిజాయతే ।**
**అన్నాత్ప్రాణో మనః సత్యం లోకాః కర్మసుచామృతమ్**

**యః సర్వజ్ఞః సర్వ విద్యస్య జ్ఞానమయం తపః**

**తస్మాదేతద్ బ్రహ్మానామరూప మన్నం చ జాయతే (2-6)**

తపస్సుతో బ్రహ్మశక్తి పెరుగుతుంది. దాని వల్ల అన్నం ఉత్పత్తి ఔతుంది. అన్నంలోంచి ప్రాణం, మనస్సు, సత్యం, లోకాలు, కర్మ, దాని ద్వారా అమృతత్వం పుడతాయి. ఇక్కడ సత్యమంటే 'సత్' యొక్క ప్రత్యక్షీ కరణం. (ప్రాణుల ఉత్పతి). సర్వ విద్యల్ని, సర్వస్వాన్ని తెలుసుకున్న అతని తపస్సు జ్ఞానపూర్ణమైనది. అతని నుండే ఈ బ్రహ్మ (జీవాత్మ), నామ రూపాలు, అన్నం-ఇవన్నీ పుట్టాయి. మున్ముందు యజ్ఞక్రమాన్ని వివరిస్తూ క్రమాన్ని వదిలి చేసే యాగం వల్ల కల్గే అనర్థాల్ని వర్ణించడం జరిగింది.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రహ్మణో**

**నిర్వేదమాయాన్నాస్త్య కృతః కృతేన**

**తద్విజ్ఞానార్థ సగురుమేవాభిగచ్ఛేత్**

**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్టం**

కర్మ మార్గం నుండి లభించే విభిన్న లోకాల అశాశ్వతత్వాన్ని అవగాహన చేసుకొని బ్రహ్మజ్ఞానాకాంక్షి అయిన వ్యక్తి, విరక్తుడై జ్ఞానప్రాప్తి కోసం సద్గురువును ఆశ్రయిస్తాడు.

**తదేతత్ సత్యం యథా సుదీప్తాత్పావకాద్వి**

**స్ఫులింగాః సహస్రశః ప్రభవంతే సరూపాః**

**తథాஉ క్షరాద్వివిధాః సౌమ్యభావాః**

**ప్రజాయంతే తత్ర చైవాపియంతి (2-1-1)**

ఇదే ఆ సత్యం. బాగా మండే అగ్నిలోంచి వేలాది నిప్పురవ్వలు వెలువడిన రీతిలో ఆ నాశరహితుడైన బ్రహ్మ నుండి వివిధ జీవులు పుడుతున్నారు. అక్కడే లీనమౌతున్నారు.

**దివ్యోహ్యమూర్తః పురుషః సబాహ్యాంభ్యంత రోహ్యజః**
**అప్రాణోహ్యమానాః శుభ్రోహ్యక్షరాత్పరతఃపరః (2-1-2)**

స్వయంప్రకాశుడూ, నిరాకారుడూ, బయటా, లోపలా ఉండే వాడూ (మనలో, మన బయట అంతా అతని శక్తి రూపమే కావడం వల్ల) అయిన పురుషుడు జన్మరహితుడు, మనఃప్రాణాలు లేని వాడు, శుద్ధుడూ, శ్రేష్ఠుడైన అక్షరం కన్న శ్రేష్ఠుడు.

అతని చైతన్య స్పందనలోంచి ఉత్పత్తి అయి, వ్యాపించిన శక్తియే ప్రాణం. అందువల్ల అతడు 'అప్రాణుడు'. అతనిలో ఇచ్ఛ ఉండదు కాబట్టి అతడు 'అమనాః' (మనోరహితుడు).

**పురుష ఏ వేదం విశ్వం కర్మ తపో బ్రహ్మ పరామృతం**
**ఏతద్యో వేద నిహితం గుహాయాం**
**సో౽ విద్యా గ్రంథిం వికిరతీహ సౌమ్య (2-2-10)**

పురుషుడే ఈ విశ్వం. అంటే ఈ విశ్వమంతా పురుషుని శక్తి లోంచే పుట్టింది. కర్మ, తపస్సు, బ్రహ్మత్వం, అమృతత్వం వీటిన్నిటిలోనూ అతడే. (అతని ద్వారానే) గూఢమైన ఈ జ్ఞానాన్ని పొందితే, అజ్ఞాన గ్రంధిని ఛేదించి ముక్తుడౌతాడు.

**అవిః సన్నిహితం గుహాచరన్నామ। మహత్పదమ త్రై తత్సమర్పితం।**
**ఏజత్ ప్రాణన్ని మిషచ్చ యదేవత జ్ఞానథ**
**సద సద్వరేణ్యం పరం విజ్ఞానా ద్యద్వరిష్టం ప్రజానామ్ (2-2-1)**

మన హృదయంలో సంచరించే మహాశక్తియే అన్ని ప్రాణులకూ ఆధారం. ప్రజలలో దీన్ని తెలుసుకున్న వాడు సత్తు, అసత్తుల కన్న శ్రేష్ఠుడైన పరమాత్మను తెలుసుకుంటాడు.

**యదర్చి మద్యదణుభ్యోఽ ణుచ**

**యస్మిన్ లోకాని హితా లోకి నశ్చ**

**తదే తదక్షరం బ్రహ్మస ప్రాణస్తదు వాఙ్మనః**

**తదేతత్సత్యం తదమృతం తద్వేద్ధవ్యం సోమ్యవిద్ధి (2-2-2)**

ఏది అన్నిటికీ వెలుగో, అణువు కన్న అణువో, అన్ని లోకాల ప్రజలు దేనితో జీవిస్తారో అదే అక్షర బ్రహ్మ. అదే ప్రాణం, దాని వల్లనే మనస్సు, వాణి. దీని సాక్షాత్కారమే సత్యం. అదే అమృతం (నాశరహితం).

**ధనుర్గృహీత్వౌపనిషదం మహాస్త్రం శరం**

**హ్యుపాసా నిశితం సంధయిత ఆయమ్య**

**తద్భావగతేన చేతసా లక్ష్యం తదేవా క్షరం సోమ్య విద్ధి (2-2-3)**

ఉపనిషత్తనే వింటిని పట్టుకుని ఉపాసన అనే చూపైన బాణం సంధించి, సంచరించే ఆ భగవంతుని చైతన్యం పై గురిపెట్టి ఆ అక్షరాన్ని తెలుసుకో.

**ప్రణవో ధనుఃశరో హ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే**

**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్**

ప్రణవమే విల్లు. మనస్సే బాణం. బ్రహ్మమే లక్ష్యం. (జీవాత్మ ఉండే బ్రహ్మ రంధ్రం) వింటి నుండి వదలబడిన బాణంలా ఒకే లక్ష్యాన్ని ఉంచుకొని ప్రణవంతో తన్మయం కావాలి.

**యస్మిన్ ద్యౌః పృథివీ చాంతరిక్ష మోతం మనః**

**సహప్రాణైశ్చ సర్వైః తమేదైకం జానథ**

**ఆత్మా నమన్యావాచో విముంచ ధామృతస్యైషసేతుః (2-2-5)**

దేవలోకం, అంతరిక్షం, పృథివి - ఇవన్నీ ఎవరి నుంచి పుడతాయో, మనః ప్రాణాల సంగమం ఎవరిలో ఉంటుందో ఆ విశ్వాత్మను తెలుసుకోవాలి. ఇదే అమృతత్వానికి సేతువు. మిగతా విషయాల్ని వదలి వేయాలి.

**అరా ఇవ రథనా భౌ । సంహతా యత్ర నాడ్యః ।**

**సఏషో అంతశ్చరతే బహుధా జాయమానః। ఓమిత్యేవం ధ్యాయథ।**

**ఆత్మానం స్వస్తివః పారాయ తమసః పరాస్తాత్ (2-2-6)**

రథచక్రం మధ్యలో అన్ని ఆకులూ చేరునట్లు, ఈ దేహంలోని నాడులన్నీ చేరే స్థానాన్ని ప్రాణుడు సంచరించే స్థానంగా చెబుతారు. ప్రణవంతో ఏకాగ్ర చిత్తుడవుకమ్ము ! అనంత జ్ఞాన ప్రాప్తి జరిగి అంధకారం నుండి బయట పడతావు.

**యః సర్వజ్ఞః । సర్వవిద్య స్యేష మహిమా భువి దివ్యే బ్రహ్మపురే।**

**హ్యేష వ్యోమ్నాత్మా ప్రతిష్ఠతిః । మనోమయః ।ప్రాణశరీర నేతా**

**ప్రతిష్ఠితోఒ న్నే హృదయం సన్నిధాయ తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరా**

**ఆనంద రూప మమృతం యద్విభాతి (2-2-7)**

అపుడతడు సర్వజ్ఞుడౌతాడు. సర్వ విద్యల్ని గ్రహించి ఈ భూమిలో మహిమాన్వితుడనిపించు కుంటాడు. ఆ ఆత్మ దివ్యమైన బ్రహ్మపురిలో (బ్రహ్మ రంధ్రంలో) ప్రతిష్ఠించబడి ఉంటాడు. మనోమయుడై (ఇచ్ఛా

వంతుడై, జ్ఞానవంతుడై) ప్రణవమే శరీరంగా ఉండే శక్తి ఇతడు. ప్రాణమే ఇతని క్రియాశక్తి. శరీరాన్ని నియమించే ఈ ముఖ్యశక్తి హృదయంలో ఆత్మ చేత ప్రతిష్ఠింపబడింది. (ప్రాణమే అక్కడుండక, ప్రాణం చేత ఉత్పత్తి అయిన 'ఈశ్వరుడు' (వాయువు యొక్క ఒక అంశం) ఉన్నాడు. దీని విజ్ఞానాన్ని ఆ ఈశ్వర శక్తి ద్వారా అంటే వాయువు ద్వారా ప్రాణాన్ని, ఆ ప్రాణం ద్వారా 'ఆత్మ'ను తెలుసుకుని ఆనందమే తమ సహజతగా పొందిన వారై, అమృతులై సర్వత్ర విరాజిల్లుతుంటారు.

**భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయా**
**క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే (2-2-8)**

పరాత్పరుడైన దేవుని దర్శనమైతే - అతని హృదయ గ్రంథులు (బుద్ధి ద్వారా నిర్ణయింపబడి, అసాధ్యంగా ఉండిన చిక్కుముడులు, పొడుపు కథలాంటి సమస్యలు, సృష్టి రహస్యాలు) తొలగి, సర్వ సంశయాలు నాశమై కర్మ నాశనమౌతుంది.

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది (1) దృష్టే పరావరే' ఆత్మకు పరమైన వాడు మూలదేవుడు. అతడు రూపరహితుడనుకుంటే- 'దృష్టే' అనే శబ్దాన్ని వాడాల్సిన అవసరం లేదు. స్థూల దృష్టికి కన్పించే పాంచభౌతిక రూపం (శరీరం) కాకున్నా జ్ఞాన దృష్టికి కన్పించే, పంచ భూతాత్మకం కానిది, నాశరహితమైన నిత్య శరీరియే బ్రహ్మ (దైవం), అందుకే 'పురిశయం' (దేహంలో ఉండేవాడు) అనీ, 'పురుష'ని (దేవుని) గురించి వర్ణించడమైనది. 'యదృష్టం తన్నష్టం' అనే మాట! ఇది స్థూల దృష్టికి కన్పించే పాంచ భౌతిక రూపాలకు మాత్రమే అన్వయిస్తుందే కాని 'యోగిభిర్ధ్యాన గమ్యం' (యోగులు ధ్యానంలో దర్శించే) దేవుని నిత్య దేహానికి అన్వయించదు. 'సనత్సు జాతీయంలో చెప్పినట్లు -

"యోగినస్తం ప్రపద్యంతి భగవంతం సనాతనం" శాశ్వతుడైన భగవంతుణ్ణి యోగులు మాత్రమే ఉన్నదున్నట్లుగా చూడగల్గుతారు. యోగులు కాని వాళ్ళు తాము కల్పించుకున్న రూపాల కలల్ని కంటారు. స్వప్నమనేది మనస్సు యొక్క భ్రాంతి వల్ల కల్గింది కాబట్టి బుద్ధిమంతులు ఆ కల్పిత రూపం చూసినట్లయితే ఆ విషయానికి అంతగా ప్రాధాన్య మివ్వరు. బుద్ధికి అందని దేవుని విషయంలో, అలాగే సృష్టి రహస్యాల విషయంలో కూడ బుద్ధిమంతులనిపించుకున్న వాళ్ళు అంతగా ప్రాధాన్యం ఇవ్వరు. అయితే తమ తపస్సు ద్వారా అంతర్ దృష్టిని పొందిన యోగులు మాత్రం సృష్టి రహస్యాన్ని గ్రహించగల్గుతారు. సృష్టికి మూలకారణమైన దేవుణ్ణి చూడగల్గుతారు. వాళ్ళ మాటలకూ గౌరవం చూపని అహంకారులు (బుద్ధిమంతులమనే భ్రాంతిలో వున్న వాళ్ళు) నిజంగా బుద్ధిమంతులేనా? ఆలోచించి చూడండి.

ఇక్కడ విధిలేని స్థితిలో చెప్పాల్సి వచ్చిన మాట ఒకటుంది. వేదాంతమనేది షడ్దర్శనాల్లో ఒకటి. ఇందులో మూడు శాఖలున్నాయి. ఈ మూడు శాఖలదీ పరస్పర భిన్నమైన తత్వ ప్రణాళిక. అయితే మూడింటికీ ఆధార గ్రంథాలు మాత్రం 'ప్రస్థానత్రయం' (ఉపనిషత్తు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు) ఈ గ్రంథాల్లో చెప్పబడిన ప్రతి శ్లోకానికి ఈ మూడు శాఖల ప్రవక్తలు (శంకర, మధ్వ, రామానుజులు) విభిన్నమైన అర్థాన్నే కల్పించి ఉన్నారు. కారణం గురించి ఆలోచించే వేళ వీళ్ళెవరూ 'పరబ్రహ్మ'ను (దేవుణ్ణి) దర్శించిన యోగులేమీ కాదు. అంతే కాదు, తమకన్న పూర్వీకులైన తపస్వులు, జ్ఞానులు చెప్పిందాన్నే వినాలనే వినమ్రులూ కాదు. అలా వినమ్రులై ఉండి ఉంటే – వీళ్ళు కపిల మహర్షి చెప్పిన "సాంఖ్య' మరియు 'హిరణ్యగర్భుడు' పల్కిన 'యోగ' దర్శనాల్ని

ఖండించే వాళ్ళు కాదు. వేదాలు మానవుని ముఖం నుండి వెలువడినవి కాకపోవడంతో (అపౌరుషేయాలని విశ్వాసం) అవి శ్రేష్ఠమైనవనే మోహం. వ్యాసుడు (బ్రహ్మసూత్రాల కర్త) అవతార పురుషుడనే భ్రమ. అందువల్ల బ్రహ్మసూత్రాల్ని, వేదాల్ని ఖండించిన శ్రీ కృష్ణుని ముఖం నుండి వెలువడిందే భగవద్గీత. (త్రైగుణ్య విషయావేదా నిస్త్రైగుణ్యో భవార్జున) సాంఖ్య, యోగాల్లాగే, గీతను కూడా వీళ్ళు నిషేధించి ఉండ వచ్చు. అయితే అందుకు ధైర్యం చాలదు. వసుదేవుడు, దేవకి – ఇద్దరూ కంసుని కారాగారంలో మ్రగ్గే వేళ – "భగవంతుడు అవతరించి మీ కష్టాల్ని తొలగిస్తాడు" అనే భవిష్యాన్ని చెప్పారే గాని, వ్యాసుల వారు వాళ్ళ కష్టాల నివారణకు తాము ఎన్నడూ ప్రయత్నించ లేదు. ఎందుకు? ఆయన యోగి కాదు; జ్ఞాని అయి ఉండవచ్చు అంతే! అందుకనే "జ్ఞానిభ్యోపిమతోధికః తస్మాద్యోగీ భవార్జున" (ఆర్తుని కష్ట నివారణకై శ్రమించే యోగి మనస్సు (స్వభావ సహజత్వం) జ్ఞాని మనస్సు కంటె శ్రేష్ఠం.

అందువల్ల నీవు యోగివి కమ్మని అర్జునునికి గీతావాణి బోధించింది. జ్ఞానికన్న యోగియే శ్రేష్ఠుడన్నాక యోగీశ్వరుడనిపించు కున్న అవతార పురుషుడు యోగికన్న శ్రేష్ఠుడు కాడా? అతడు వేదాల్ని ఖండించాడు. సాంఖ్య యోగాల్ని గౌరవించాడు. (సాంఖ్య యోగౌ పృథగ్బాలా ప్రవదంతి న పండితాః).

వ్యాసుడు వేదాలను గౌరవించాడు. సాంఖ్య యోగాలు ఆయనకు అంత ముఖ్యమైనవని అనిపించలేదు. వేదాల్ని ఖండించిన గీతను వాళ్ళు ఖండించి ఉండాల్సింది. తమకన్న అతడు శ్రేష్ఠుడనే జ్ఞానం కల్గడం వల్ల దాన్ని వారే రాసిపెట్టారు. అయితే వీళ్ళకు (వేదాంతులకు) వ్యాసుల

వారు రచించిన గీతను ఖండించే దమ్ము లేదు. వేదోపనిషత్తుల కన్న గీత శ్రేష్ఠమనే జ్ఞానం లేదు. వేదోపనిషత్తుల కన్న భిన్నమైన బోధను గీతలో చూశాక వేదోపనిషత్తులకు అది అనుగుణంగా ఉందని నిరూపించేందుకు ప్రయత్నిస్తారు. దానికోసం తమకు తెలిసిన రీతిలో ఒక్కో రకమైన అర్థాన్ని కల్పించారు – “సర్వోప నిషదో గావో దోగ్ధా గోపాలనందనః” అనే మాటలతో గీత వేదోపనిషత్తుల సారమని చెబుతారు. దాని కోసమే గీతకు అంతటి ప్రాధాన్యమా? వేదోపనిషత్తుల్ని చదివిన ఎవరైనా గీతాకర్తలు కావచ్చు.

అలాగైతే మన దేశంలో కావలసినన్ని గీతలున్నాయి. శివగీత, గురుగీత, సత్యగీత – ఇత్యాదులు. అయితే వీటన్నిటిలా ఆ గీత లేదు. ఇది కృష్ణుని ముఖంలోంచి వెలువడినా “కృష్ణగీత” అనిపించుకోలేదు. భగవద్గీత అనిపించుకుంది. అలాగే వ్యాసులే దానికి నామకరణం చేశారు. వ్యాసుని దృష్టిలో కృష్ణుడు తమకన్న శ్రేష్ఠ యోగీశ్వరుడైనా గీతలో “విభూతుల గురించి చెప్పే వేళ (వృక్షాల్లో అశ్వత్థం (రావి), నదుల్లో జాహ్నవి (గంగ); మునుల్లో వ్యాసుడు; సిద్ధుల్లో కపిలుడు; వృష్ణుల్లో కృష్ణుడు, పాండవుల్లో అర్జునుడు” ఇలా కృష్ణుడు కూడా ఒక విభూతి మాత్రమే అని చెప్పబడింది. అలా కాకుండ కృష్ణుడు పూర్ణుడే అయి ఉంటే– విభూతులలో చేర్చబడే వాడు కాడు. అలాగైతే – గీత కృష్ణుని మాట కాదా? అనే ప్రశ్నకు ‘కాదు’ అనేదే జవాబు. వేదాలు అపౌరు షేయాలు కదా? ఆ శబ్దాలు తొలుత ఎవరో ఒకరి ముఖంలోంచి బయటికి వచ్చి ఉండాలి కదా ? అలాగే భగవంతుని బోధ ‘గీత’ వచ్చింది కృష్ణుని ముఖంలోంచి. అలాగే కృష్ణుడు భగవంతునికి ప్రతినిధిగా వ్యవహరించాడు. అందుకే అతడు అవతారపురుషుడు.

అందుకే గీత ద్వారా ప్రమాణీకరించబడిన – అంటే భగవంతుని ద్వారా ప్రమాణీకరించబడిన సాంఖ్య యోగాల్ని ఖండించే వారికి గీత అర్థం కాలేదనే చెప్పాలి. సాంఖ్య యోగాలు అర్థం కాలేదు. వేదోప నిషత్తులు అర్థం కాలేదు. అర్థమై ఉన్నట్లయితే, పరస్పర విరుద్ధమైన అర్థాల్ని కల్పించి, తమదే అయిన 'అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత – మొదలగు సిద్ధాంతాల్ని ప్రతిపాదించే వారు కాదు. తపస్సు కన్న తత్వానికి ప్రాధాన్యం ఇచ్చే వారు కాదు. అనుభవానికన్న గ్రంథాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. 'యోగ'మంటే ప్రాణ మనస్సుల సంగమం (తొలి దశలో), జీవాత్మల కలయిక (మలిదశలో) అనే విషయాన్ని తెలుసు కోకుండా యోగదర్శనాన్ని ఖండించే వాళ్ళు కాదు.

బ్రహ్మవిద్య, అమృత విద్య, ప్రాణవిద్య, ఆత్మవిద్య – ఇత్యాదిగా వర్ణింపబడినది 'యోగ' స్థితిని పొందేందుకు కావలసిన ఏకైక సాధనం. అదే విద్య అనే జ్ఞానం వీరికి ఉండి ఉంటే వీళ్ళు తపస్వులై అంతర్ము ఖత్వంలో తత్వరహస్యాన్ని గ్రహించి జ్ఞానులై జగత్కల్యాణం కోసం శ్రమించే యోగలయ్యే వాళ్ళు. 'విద్య' అంటే ఏమిటో తెలుసుకోకుండా, అవిద్యలోనే పడిపోయి, గ్రంథాలు చదివి, తామే బుద్ధిమంతులమనే అహంభావంతో తమకు తోచిందే సరైన అర్థమనీ, ఇక మిగతా వాళ్ళు చెప్పిందంతా తప్పనీ వాదించడంలోనే తమ జన్మ నంతా గడిపిన వీళ్ళెలాంటి జ్ఞానులు? వీళ్ళెలాంటి బుద్ధిమంతులు? యుక్తాయుక్తాల్ని నిర్ణయించే బుద్ధిప్రకాశం యోగి ఒక్కనికే ఉంటుంది.

"బుద్ధియోగో విశిష్యతే" అలాంటి అహంకారులైన పండితుల గ్రంథాల్ని చదివి తత్వాన్ని గ్రహించామనుకునే వాల్ళు "గ్రుడ్డివాళ్ళ వెంట బడిన గుడ్డివాళ్ళు కాక మరింకేమి?".

3. "భిద్యతే హృదయగ్రంథిః" అనే మాట గురించి కూడా బాగా చింతన చేయాలి. హృదయంలోని గ్రంథుల్ని భేదించు అన్నారు. హృదయం అనేది దేహంలోని ఒక భాగమనీ, అందులో 101 నాడులున్నాయనీ, ఆ నాడుల శాఖోపశాఖలు (ఒక్కో నాడికి 72000 శాఖలు) దేహమంతటా వ్యాపించాయనీ, వాటిలో 'వ్యానం' వ్యాపించిందనీ, ఆ వ్యానాన్నంతటినీ హృదయంలో కేంద్రీకరించి అలాగే జఠరంలో ఉండే అపానాన్ని వ్యానంతో చేర్చి, చెవి, కన్ను, నోరు, ముక్కు – వీటిలో సంచరించే 'ప్రాణం'తో కంఠంలోని 'సమానాన్ని' కూడ దానితో చేర్చి, అక్కణ్ణుంచి పైకి వెళ్ళే 'ఉదానం'లో చేర్చి, బ్రహ్మరంధ్రంలోకి చేర్చడమే యోగమనీ, అలా ఉండగా హృదయంలో నుంచి వ్యాపించిన 101 నాడుల (శాఖోపశాఖల సమేతంగా) గంటు – అదే హృదయగ్రంధి – దాన్ని బ్రద్దలు కొట్టాలి. (ముక్తుడు కావాలి). అందువల్ల హృదయంలోంచి ఒక నాడి మాత్రమే (సుషుమ్న) బ్రహ్మరంధ్రానికి వెళుతుంది. దాని మూలంగా వ్యాపించిన వాయువును అక్కడికి చేర్పించాలని రాశారు. మరి కొన్ని ఉపనిషత్తుల్లోనూ ఈ విషయం ఉల్లేఖించబడింది.

**శతం చైకా చ హృదయస్యహ నాఢ్య**
**స్తా సా మూర్ధానమభినిః సృత్యేకా**
**తయోర్ధ్వ మాయన్నమృతత్వమేతి**
**విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి**

(కఠోపనిషత్తు 2వ అధ్యాయం, 6వ వల్లి, యంత్రం 16)

ఈ మంత్రం ప్రకారం ప్రకాశ హృదయంలో ప్రాణముంటుందని అనిపిస్తుంది. అయితే –

**"పాయూపస్థేఽ పానం చక్షుః శ్రోత్రే**
**ముఖ నాసికాభ్యాం ప్రాణః స్వయం**
**ప్రతిష్ఠతే మధ్యే తు సమానః "**

**(ప్రశ్న – రెండో ప్రశ్న – శ్లోకం 5)**

ఈ శ్లోకం ప్రకారం గుదం, జననేంద్రియాలలో ప్రాణం, మధ్యలో సమానం ఉంటాయని తెలుస్తుంది.

**హృదిహ్యేష ఆత్మా అత్రై తదేకశతం నాడీనాం**
**తాసాం శతం శతమేకైక స్యాం**
**ద్వాసప్తతిర్ద్వా సప్తతిః ప్రతిశాఖా నాడీ**
**సహస్రాణి భవన్త్యాషు వ్యానశ్చరతి**

**(ప్రశ్న – 3వ ప్రశ్న – శ్లోకం 6)**

ఆత్మ హృదయంలో ఉంది. ఇక్కడ 101 నాడులు ఉన్నాయి. ఆ ఒక్కోదాంట్లో నూరు నూరు శాఖలు, ఆ ఒక్కో శాఖకు 72000 ఉపశాఖా నాడులు. వాటిలో 'వ్యానం' సంచరిస్తుంది. ఈ శ్లోకం ప్రకారం హృదయంలో ఉండేదే 'వ్యానం' ప్రాణం కాదు.

**అథ్యైక యోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యం లోకం నయతి**
**పాపేన పాపముభాభ్యామేవ మనుష్యలోకం (ప్రశ్న–3, శ్లో–7)**

ఆ నాడుల్లో ఒకదాని ద్వారా ఉదానం పుణ్యాత్ముల్ని పుణ్య లోకాలకూ, పాపాత్ముల్ని పాపలోకాలకూ, సమాన పాప పుణ్యాలున్న వాళ్ళను మళ్ళీ మనుష్య లోకానికి తీసుకు వెళ్ళడం జరుగుతుంది.

**యచ్చిత్తస్తేనై ష ప్రాణమాయాతి ప్రాణస్తే జసాయుక్తః**
**సహాత్మనా యథా సంకల్పితం లోకం నయతి (ప్రశ్న–3,శ్లో–10)**

చిత్తంతో పాటు ఉదానం ప్రాణం వైపుకు వస్తుంది. ప్రాణం తేజస్సుతో కలిసి ఆత్మను అతడు కోరిన లోకానికి తీసుకు వెళ్లుతుంది. ఇక్కడ కోరిన లోకానికి (పుణ్యలోకం/పాపలోకం) తీసుకు వెళ్ళేది 'ఉదానం' కాదు 'ప్రాణమే' అని తేలింది. ప్రాణం కన్ను, చెవి, ముక్కు, నోరు – వీటిలో ఉందని చెప్పాక ఈ వ్యానం ఆ ప్రాణంతో ఎప్పుడు కలుస్తుంది? ఎలా? అనే వివరాలు లేవు.

గీతలో "ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి" అనే వాక్యంలో హృదయంలో ఈశ్వరుడున్నాడని చెప్పబడిందే కాని, 'ప్రాణం' ఉంటుందని చెప్పబడలేదు.

**సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ**
**మూర్ధ్నాధా యాత్మనః ప్రాణమాస్థితో యోగధారణాం"**

అనే శ్లోకంలో సర్వద్వారాల్ని నిగ్రహించుకుని మనస్సును హృదయంతో నిరోధించి, అంటే ప్రతిష్ఠించకుండా ప్రాణాన్ని ఆత్మతో బ్రహ్మ రంధ్రంలో చేర్పించడమే యోగధారణ అనే తేటతెల్లమౌతుంది.

అయితే ఈ శ్లోకానికి భాష్యకారులంతా మనస్సును హృదయంలో చేర్చి అనే అర్థాన్ని రాశారు. హృదయంతో నిరోధించాలని రాయలేదు. మనస్సును హృదయంలో స్థాపిస్తే ఏమౌతుంది? 'భ్రామయన్ సర్వభూతాని యంత్రా రూఢాని మాయయా" అన్నట్లు మాయాజాలంలో చిక్కుకుని భ్రమకు గురికాకుండా ఉండేదే వైశ్వానరస్థితి. అంటే బాహ్యజగత్తు యొక్క మోహం ఉండే స్థితి. (మాండూక్యోపనిషత్) ఆ స్థితితో ప్రాజ్ఞ స్థితిని పొందాలంటే – ప్రాణం బ్రహ్మరంధ్రంలోని ఆత్మతో కలిసిపోవాలి.

అయితే ప్రాణం వాయువు కాదు. ముక్కు, నోరు, చెవుల్లో సంచరించేది వాయువు. ప్రాణం కాదు.

**యథా సమ్రాడేవాధికృతాన్వి నియుంక్తే**
**ఏతాన్ గ్రామానధితిష్టస్వేత్యేవ**
**మే వైష ప్రాణ ఇతరాన్ ప్రాణాన్ పృథ**
**గేవ సంనిధత్తే (ప్రశ్న - 3, శ్లో - 4)**

చక్రవర్తి గ్రామాల్ని పరిపాలించేందుకు అధికారుల్ని నియమించి నట్లుగా ఈ ప్రాణం ఇతర ప్రాణాల్ని వేర్వేరు స్థానంలో నియోగిస్తుంది. సామాన్యంగా పంచప్రాణాలని చెప్పడంలో ఉద్దేశం ఏదీ ప్రాణం కాదు. ఇవన్నీ దేహంలో వేర్వేరు చోట్ల ఉన్న భాగాలే. వ్యాప్తమైన భాగాలే.

"మాతరిశ్వని (వాయువు) తండ్రి" అని మరో చోట (ఉపనిషత్తు) ప్రాణుని వర్ణన ఉంది. అంటే – నోరు, కన్ను, చెవి, ముక్కు, హృదయాల్లో సంచరించేది ఈ వాయువు యొక్క ఒక ఉపభాగమే కాని ప్రాణం కాదు. ఈ వాయువు యొక్క ఉపభాగాల్నే పంచప్రాణాలని చెప్పడం వల్ల దాన్ని 'ముఖ్య ప్రాణ'మని మరో ఉపనిషత్కారుడు (బృహదారణ్యక, ఛాందోగ్యం) వర్ణించాడు. గీతలో హృదయంలో ఉండే వాణ్ని 'ఈశ్వరుడు' అని చెప్పడం వల్ల ప్రాణాన్ని 'ప్రాణ'మనే వర్ణించారు.

**"న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన**
**ఇతరేణతు జీవంతి యస్మిన్నే తావు పాశ్రితౌ" (కఠ 2–5–5)**

ఇక్కడ ఈ ప్రాణ, అపానాలతో మర్త్యులు (మనుషులు) జీవించ జాలరు. ఇవి రెండూ దేన్ని ఆశ్రయించుకొని ఉన్నాయో అతని ద్వారా బ్రతికి ఉన్నారని చెప్పడం జరిగింది. 'ప్రాణ'మనే శబ్దాన్ని 'వాయువు'

యొక్క ఉపభాగాల్లో ఒకదాని కోసం, ఆ రెంటికి (ప్రాణాపానాలకు) ఆధారమైనవి ఏవి అనే ప్రశ్నకు అక్కడే 3వ శ్లోకంలో జవాబు ఉంది.

**ఊర్ధ్వ ప్రాణమున్న యత్యపానం ప్రత్యగస్యతి**
**మధ్యే వామన మాసీనం విశ్వేదేవా ఉపాసతే (కఠ 2-5-3)**

అది ప్రాణవాయువును పైకి లేపుతుంది. అపాన వాయువును వ్యతిరేక దిశలో (క్రిందకి) త్రోస్తుంది. మధ్యలో ప్రతిష్ఠితమైన ఈ 'వామను'ణ్ణి విశ్వంలోని దేవతలంతా ఉపాసిస్తారు. ఇక్కడ 'వామన' అనే శబ్దం చెప్పడం ఈ పంచవాయువుల ఉత్పత్తికి కారణమైన ప్రాణ చేతనను సూచించేందుకే. ఆ ప్రాణం మధ్యలో కూర్చుందని అంటే – ప్రాణాపానాల మధ్యలో లేదు. దేహం మధ్యలో కాదు (నాభి, హృదయం). అలాగైతే మరి ఎక్కడ? తనలోంచి ఉత్పత్తి అయిన పంచ వాయువుల వ్యాప్తి కల్గిన పృథ్వికి, ఆత్మ ప్రతిష్ఠితమైన బ్రహ్మరంధ్రానికీ మధ్య.

ఈ ప్రాణం తాను కూర్చున్న ఆ స్థలంలోంచి బ్రహ్మరంధ్రంలోకి (ఆత్మ ఉండే చోటికి) చేరాలి. అపుడు ప్రాజ్ఞ స్థితి లభిస్తుంది. అదే యోగస్థితి. అయితే ఇది ఎలా సాధ్యం? మనస్సు ద్వారానే ! కేవలం సంకల్పం ద్వారా సాధ్యం కాదు. ఈ ప్రాణం యొక్క ఊర్ధ్వ గమనానికి అతనికి శక్తి అవసరం. అతడు అశనాధారి. ఇక్కడ అశనం అంటే స్థూలమైన ఆహారం కాదు. సూక్ష్మాహారం. దాన్ని పంచాగ్ని పూజతో (పంచాగ్ని హోత్ర, పంచయజ్ఞ) అంటే పంచ వాయువుల్ని చేర్చి ప్రాణా పాన గతులలో (దేహంలో మూడు గతుల్లో ఋుక్, యజుర్, సామలలో) మథించాలి. ఆ మథనంలో ఆ వాయువు యొక్క శుద్ధసారం. 'అశన'మనే సూక్ష్మాంశంగా పైకి వెళ్ళి ప్రాణం ద్వారా గ్రహించబడుతుంది. ఆ అశనాన్నే 'పృథివ్యాం పుణ్యగంధోస్మి' పృథ్విలో ఉత్పత్తి అయ్యే పుణ్య గంధం అని చెప్పడం జరిగింది.

**గంధద్వారాం దురాధర్షాం నిత్య పుష్పాం కరీషిణీం**
**ఈశ్వరీం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియం**

**(శ్రీసూక్తం - ఋగ్వేదం)**

అంటే–సర్వత్ర వ్యాప్తమై గూఢంగా ఉండేవిభూతి (గంధ) ద్వారాన్ని గ్రహిస్తే శాశ్వత చైతన్యాన్ని తెలుసుకున్నట్లవుతుందని చెప్ప బడింది.

ఆ గంధం ప్రాణం నుంచి స్వీకరించబడ్డాక, ఆ ప్రాణునికి శక్తి కల్గి, ఊర్ధ్వగమనం లభించి, బ్రహ్మరంధ్రంలో ఆత్మతో కలిశాక యోగస్థితి కల్గుతుంది. కేవలం వాయు మథనమే యోగం కాదు. కేవల మానసిక చింత, విచారం - ఇవే యోగక్రియలు కావు.

"భిద్యతే హృదయగ్రంథిః" అనే ఉపనిషద్వాక్యాన్ని వివరించడానికి ఇంత వివరము చెప్పాల్సి వచ్చింది. కొందరు రక్తకోశమని భావిస్తారు. మరికొందరు మనస్సని భావిస్తారు. యోగరహస్యాన్ని (తత్వ రహస్యం – ఆధ్యాత్మిక జ్ఞానం) కేవలం శబ్దార్థాలను ఊహించుకుని తెలుసుకోవడం సాధ్యం కాదు. తెలిసిన వాళ్ళను ఆశ్రయించి, ఆ 'విద్య' యొక్క ఉపాసనా క్రమాన్ని వారి నుండి గ్రహించి, ఉపాసిస్తే మాత్రం అనుభవాల ద్వారా జ్ఞానం, ఆనందం - లభిస్తాయి. ఆ 'విద్య' లభించక కేవలం గ్రంథ పాండిత్యంతో జ్ఞానుల గ్రంథాలకు వ్యాఖ్యానం చేసే వాళ్ళు ఆ తత్వ రహస్యాన్ని ఎలా వివరించడం సాధ్యం?

3) క్షీయంతే చాస్య కర్మాణి" అనే వాక్యం గురించి చర్చించాల్సి వుంది. దేవుని దర్శనం వల్ల కర్మ నశిస్తుందా? అనే ప్రశ్నకు "క్షీయంతే" అనే శబ్దంలో జవాబు ఉంది. ఆ కర్మఫలాన్ని అనుభవిస్తూ క్రమంగా అది తగ్గుతూ చివరికి నాశనమౌతుంది. దేవుని దర్శనానంతరం తపస్సుగా

మారి, జ్ఞానం సంప్రాప్తించి – దాని ఫలితంగా అతడు బంధాన్ని కల్గించే కర్మ చేయజాలడు. క్రితం జన్మలో చేసిన కర్మ ఫలాన్ని అనుభవించి, దాన్ని ముగించాల్సిందే ! "తప్పు చేయవద్దు, క్షమాపణ వద్దే వద్దు" అనేది ప్రభు అచ్యుతుల బోధ. దానికి కారణం కర్మఫలం. దాన్ని అనుభవించక తప్పదు.

**"హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలం ।**

**తచ్ఛుభ్రం జ్యోతిషాంజ్యోతి స్తద్యదాత్మ విదో విదుః॥**

**(ముం 2-2-6)**

కళాతీతుడైన, శ్రేష్ఠుడైన బ్రహ్మ (దైవం) స్వర్ణవర్ణ ప్రకాశ కోశంలో నిగూఢంగా ఉన్నాడు. అతడే ప్రకాశ మండలాలకు ప్రకాశాన్ని అందించే పరమజ్యోతి. ఆత్మజ్ఞానులు అతణ్ణి తెలుసుకుంటారు.

**"ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే।**

**తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య నశ్న న్నన్యో వృభి చాకశీతి"**

**(ముం 2-1-1)**

విశ్వవృక్షంలో పరస్పర స్నేహం కల్గిన రెండు పక్షులు జీవాత్మ, పరమాత్మలున్నాయి. జీవాత్మ ఆ చెట్టు ఫలాన్ని (కర్మఫలాన్ని) తింటోంది. రెండోది (పరమాత్మ) తాను తినకుండా ఊరకే చూస్తోంది.

**"యదా పశ్యః పశ్యతేరుక్మ వర్ణం**

**కర్తారమీశం పురుషం బ్రహ్మ యోనిం ।**

**తదా విద్వాన్పుణ్య పాపే విధూయ**

**నిరంజనః పరమం సామ్యము పైతి"** **(3-1-3)**

బంగారు రంగు కల్గిన, సర్వకర్త అయిన పరమాత్మను, నాశరహిత మైన ప్రాణశక్తికి మూలకారణమైన పురుషుణ్ణి చూసిన విద్యావంతుడు పాప పుణ్యాల నుండి విముక్తుడై, నిర్లిప్తుడై (అజ్ఞానాన్ని తొలగించుకుని) పరమ సామ్య స్థితిని పొందుతాడు.

**"ఆత్మ రతః ఆత్మక్రీడః క్రియావానేష బ్రహ్మవిదాం వరిష్ఠః"**

ఆత్మ యొక్క సహజస్థితి అయిన ఆనందానుభవాన్ని పొందుతూ, తనలో తాను క్రీడిస్తూ, (జ్ఞాన వికాసాన్ని పొందుతూ) లోక కల్యాణం కోసం కర్మల్ని చేసే వ్యక్తి బ్రహ్మజ్ఞానుల్లో శ్రేష్ఠుడు. అతడే 'యోగి' అనిపించుకుంటాడు.

నన్ను ఏవు తెలుసుకో
శ్రీ బ్రహ్మానందాశ్రమము

**బృహచ్ఛ తద్దివ్య మచింత్య రూపం**
**సూక్ష్మాచ్ఛ తత్సూక్ష్మతరం విభాతి**
**దూరాత్సుదూరే తదిహాంతికేచ**
**పశ్యత్స్విహైవ నిహితం గుహాయాం** **(3-1-3)**

పరమపురుషుని (దేవుని) రూపం చాలా పెద్దది (శ్రేష్ఠం). అది ఊహకు అందనిది. చాలా దూరంలో ఉండేది. (సర్వలోకాలకు అవతల). అయినా చాలా దగ్గరలో ఉంది. ఎందుకంటే అది మాలోనే (అంతర్ముఖ స్థితిలో) ఉన్నట్లు కన్పిస్తుంది.

**న చక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవై స్త పసాకర్మణా వా**
**జ్ఞాన ప్రసాదేన విశుద్ధ సత్త్వ స్తతస్తుతం పశ్యతే నిష్కలం ధ్యాయమానః**

ఆత్మ (దేవుడు) కనులకు కన్పించే వాడు కాదు. మాటల ద్వారా అతణ్ణి గ్రహించలేం. కర్మలతో గాని, కేవల ఇచ్ఛా శక్తితో గాని (తపస్సు),

ఇతర దేవతల సహాయంతో కాని లభించదు. జ్ఞానాన్ని పొంది శుద్ధుడైన వ్యక్తికి ధ్యానస్థితిలో కళాతీతుడైన ఆత్మ కన్పిస్తుంది.

**నాయమాత్మా ప్రవచనేన లభ్యో**
**నమేధయా న బహునా శ్రుతేన**
**యమేవైష వృణుతే తేన లభ్య**
**స్త స్యైష ఆత్మా వివృణుతే తనుం స్వామ్ (3-1-3)**

ఈ ఆత్మను ప్రవచనం ద్వారా, మేధస్సు ద్వారా, పాండిత్యం ద్వారా పొందలేము. ఆత్మ ఎవరినైతే వరిస్తుందో అతనికి మాత్రమే లభ్యమౌతుంది. అలాంటి వ్యక్తికి మాత్రమే ఆత్మ తన వివరాలనన్నిటినీ అందిస్తుంది. ఇక్కడ దేవుడు దర్శనమిస్తాడని చెప్పడం వల్ల భక్తి యొక్క గొప్పతనం వివరించబడింది.

**సంప్రాప్యైన మృషయో జ్ఞానతృప్తాః**
**కృతాత్మనో వీతరాగాః ప్రశాంతాః ।**
**తే సర్వగం సర్వతః ప్రాప్యధీరా**
**యుక్తాత్మానః సర్వమేవాఽఽ విశంతి॥**

జ్ఞానప్రాప్తి అయిన ఋషులు తృప్తులు, శుద్ధులు, మోహరహితులు, ప్రశాంతులై సర్వాత్ముని సామీప్యాన్ని (భగవంతుని దర్శనానందం) అన్నిచోట్ల అనుభవిస్తూ, యోగ్యులై, అందరి కళ్యాణం కోసం శ్రమిస్తారు.

# 7. ఐతరేయోపనిషత్తు

**శాంతి మంత్రం**

**వాఙ్మే మనసి ప్రతిష్ఠితా । మనోమేవాచి ప్రతిష్ఠిత।**
**మావీరా వీర్మ ఏధి వేదస్యమ ఆణీస్థః శ్రుతం మే మా**
**ప్రహాసీర నేనాధీతే నాహోరాత్రాన్ సందధామి ।**
**ఋతం వదిష్యామి । సత్యం వదిష్యామి ।**
**తన్మామవతు । తద్వక్తా రమవతు ।**
**అవతుమామ్ । అవతు వక్తార మవతు వక్తారమ్ ।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

వాక్కులో మనస్సు, మనస్సులో వాక్కు ప్రతిష్ఠితమైనది. స్వయం భూ స్వరూపుడైన ఓ దేవా ! నాలో ప్రత్యక్షుడవు కమ్ము. సదా నేను జ్ఞానంలో ఉండే విధంగా చేయి ! నేను ఋతాన్ని (స్థూల సత్యాన్ని) చెబుతాను. సత్యాన్ని చెబుతాను. ఈ రెండూ నన్ను రక్షించనీ. నా గురువుల్ని రక్షించనీ.

ప్రారంభంలో సత్యాన్ని పలికే తమలో ప్రత్యక్షంకమ్మని ఉపనిషత్కారులు పరమాత్మను ప్రార్థించారు.

మొదట ఆత్మ ఒక్కడే ఉంది. తన సంకల్పంతో నాల్గు లోకాల్ని సృష్టించి, లోక పాలకులను సృష్టించేందుకు విరాట్ పురుషుణ్ణి సృష్టించాడు. ఆ విరాట్ పురుషుని దేహంలో ఇంద్రియాలు, తద్వారా తదభిమాన దేవతలూ ఉత్పన్నులౌతారు.

అన్నం ఉత్పత్తి కోసం ఆత్మ తపించి జడ వస్తువులనన్నిటినీ సృష్టించాడు. ఆత్మ బ్రహ్మ రంధ్రం ద్వారా దేహంలోకి ప్రవేశించాడు. అదే విదృతి. అదే ఆనంద స్థానం. ఆత్మను 'ఇదంద్ర' (ఇంద్రుడు) అని పిలుస్తారు.

ఆత్మ అంటే శుద్ధ చైతన్యం. అదే ప్రజ్ఞానం. విశ్వానికి మూలం ఈ శుద్ధ చైతన్యమే ! దీని స్వయంస్ఫూర్తితో విశ్వం వ్యక్తమై వ్యాప్తమైంది.

**ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్।**

**నాన్యత్ కించన మిషత్। సఈక్షతలోకాన్ను సృజాఇతి ॥ (1-1)**

మొదట ఆత్మ ఒక్కడే ఉన్నాడు. అతనితో స్పందించే శక్తి వేరేదీ లేకుండినది. లోకాల్ని సృష్టించాలని ఆత్మ కోరుకున్నాడు.

**స ఇమాన్‌లోకా నసృజతాంభో । మరీచీ**

**మరమాపోఽ దోఽంభః పరేణ దివం**

**ద్యౌః ప్రతిష్ఠాంతరిక్షం మరీచయః । పృథివీ**

**మరో యా అధస్తాత్తా ఆపః (1-2)**

అంభలోకం (ప్రాణం), మరీచిలోకం (విద్యుత్తు), మృత్యులోకం (పృథివి), ఆపలోకం (ఆప్) – నీటిని సృష్టించాడు. ఇక్కడ ఆత్మ యొక్క (దేవుని) ఐక్య స్థానంతో బయటికి వచ్చిన ప్రాణశక్తినే (ఆ శక్తి మాత్రముండే ఆకాశం) అంభలోకమనీ, దాని స్పందనలోంచి ఉత్పత్తి అయిన వాయు ఘర్షణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తునే ద్యులోకమనీ, అక్కణ్ణుంచి ఉత్పత్తి అయిన జలాన్నే ఆపలోకం మరియు పృథ్వినే మృత్యు లోకమనీ చెప్పడం జరిగింది. విద్యుత్తు, జలం – ఇవి ప్రధానమైనవి. ఇవి వేరే భూతాలతో చేరి ఏర్పడిన మండలాల్ని మరీచాది లోకాలుగా

గ్రహించాలి. వీన్నిటికన్న పైన ఉంటూ అన్నిటికీ ఆధారమైన ప్రాణశక్తి సమేతమైన ఆకాశమే 'దివం' అనిపించుకున్నది. ఈ లోకాల మధ్య ఉండే బయలే అంతరిక్షం.

**స ఈక్ష తేమేను లోకా లోకపాలాన్ను సృజా ఇతి ।**

**సోఽ ద్భ్య ఏవ పురుషం సముద్ధృత్యా మూర్ఛయత్॥**

ఈ లోకాలకు పాలకుల్ని సృష్టించేందుకు ఇచ్ఛగించి, నీటి నుండి పురుషుణ్ణి సృష్టించాడు. ఇక్కడ నీటినుండి పురుషాకారం ఏర్పడిందని చెప్పడంలో కేవలం జలతత్వంనుండే జరిగిందని అర్థం కాదు. జలతత్వ ప్రధానమై, మిగిలిన తత్వాలతో కలిసి పోయిన అంశంలో ఏర్పడిందని తెలుసుకోవాలి. అదీకాక, ఆత్మ తన ఇచ్ఛతో ఈ ప్రాణాన్ని, దాని ద్వారా నాల్గు భూతాల్ని, లోకాల్ని, ఈ పురుషుణ్ణి – వీటినంతా సృష్టించాడనేది కేవలం కపోలకల్పనే ! అతనిలో సంకల్పమనేదే లేదు. అదంతా అతనిలో ఉండే చైతన్యపు స్పందన ద్వారా కల్గిన సహజ పరిణామమే (సృష్టి) అనే సత్యం తెలిశాక, ఆత్మ (దేవుడు) కర్తృత్వ, భోక్తృత్వాలు లేకుండా సాక్షిమాత్రుడై, సర్వాతీతంగా (నిర్లిప్తంగా) ఉన్నాడనే అంశం బోధపడుతుంది. సంకల్పంతో సృష్టించి ఉంటే అతడు నిర్లిప్తుడై ఉండడం సాధ్యమయ్యేది కాదు. "నాహంకర్తా, కర్తా, కామః" అనే శృతి వాక్య రహస్యం కూడా ఇదే.

ముందరి శ్లోకంలో ఆత్మ యొక్క తపస్సుతో పురుషునికి నోరు, నోటి నుండి వాగింద్రియం, దాని ద్వారా అగ్ని, తదనంతరం ముక్కు పుటాలు, వాటి ద్వారా ఘ్రాణేంద్రియం, తదభిమాన దేవత అయిన వాయువు, తదుపరి కన్నులు, కన్నులతో చక్షురింద్రియం, దాని వల్ల

ప్రూఫ్స్ ఇ×క్కడ వరకు ఇచ్చాము.



తదభిమాన దేవత అయిన ఆదిత్యుడు, చెవులు, శ్రోత్రేంద్రియం, దిక్పాలకులు, చర్మం, వెంట్రుకలు, ఓషధులు, వనస్పతులు, హృదయం, మనస్సు, చంద్రుడు, నాభి, అపానం, మృత్యువు, జననేంద్రియం, రేతస్సు, నీరు – ఇవన్నీ పుట్టాయని చెప్పడం జరిగింది.

ఇక్కడ ఆత్మ నుండి సృష్టించబడిన పురుషుని దేహం యొక్క ఉత్పత్తిక్రమం, తదనంతరం అతని దేహంలోంచి పుట్టిన ఇంద్రియ వృత్తులు, తదభిమాన దేవతలు, భూతాల నుండి పుట్టిన ధాన్యాదుల వివరాలున్నాయి. ఈ రీతిగా విశ్వ నిర్మాణానికి కారణమైన ఈ పురుషుణ్ణే 'విరాట్ పురుషుడ'నీ, 'ఈశ్వరు'డనీ అంటారు. అతనిలో కోరిక కల్గి, ఆ కోర్కెతో (కామం) శక్తి వ్యాప్తమై, విశ్వంగా రూపొందడం వల్ల అతణ్ణి (పురుషుణ్ణి) 'కాము'డనీ జ్ఞానులు పిలుస్తారు.

దేవతలు విరాట్ పురుషుని శరీరంలో చేరి పోయారనీ, వాళ్ళకు ఆకలిదప్పికలు కల్గాయనీ, తమకు ఆశ్రయ స్థానాన్ని రచించేందుకు వాళ్ళు తమను సృష్టించిన కర్తకు విన్నవించుకున్నారని చెప్పబడింది.

పురుషుడు తొలుత సృష్టించిన గోవులు, గుర్రాలు – వీటి దేహం లోంచి ఆ దేవతలకు తృప్తి కలుగలేదనీ, అందువల్ల కర్త వాళ్ళకు పురుషా కారాన్ని సృష్టించాక, వాళ్ళు సంతుష్టులై, అందులో ప్రవేశించారనీ చెప్పబడింది. దేవతలకు లభించే హవిస్సు ద్వారా ఆకలిదప్పులు తీరతాయని పురుషుడు చెప్పాడట ! తమ దేహంలో ఇంద్రియవృత్తులకు లభించే తృప్తి (ఇంద్రియ భోగాల వల్ల) ఆకలిదప్పులు ఉపశమిస్తాయనీ, అలాగే, లోకపాలకులైన దేవతలకు మానవులు భక్తితో అందించే (అర్పించే) హవిర్భాగాన్ని వాళ్ళు తృప్తితో గ్రహించాలి తర్వాత –

**సోఽ పోఽ భ్యత పత్తా భ్యోఽ భితప్తాభ్యో**

**మూర్తి రజాయత యావైసా మూర్తి రజాయత అన్నం వైతత్**

పురుషుడు తపించగా నీటి నుంచి అన్నం ఉత్పన్నమైనదని ఉపనిషత్కారులు చెప్పారు. ఘనీభవించిన 'అప్' (జలం) పృథ్వి కావడం వల్ల జలం పృథ్వీసారం. ఆ జలం యొక్క సూక్ష్మసారమే అన్నం (అశనం). ఇది ప్రాణునికి ఆహారం. యోగ విద్యాభ్యాసం చేసే వారికి మొదట తమ దేహంలో లాలాజలం అధికంగా పుట్టి, తర్వాత 'అశనం' ఉత్పత్తి కావడం అనుభవవేద్యమే ! అలాగే స్థూల వస్తువుల్లో అన్నం (ఆహారం) ఉత్పత్తి కావడానికి జలమే ముఖ్యమైన ఆధారం.

దేహానికి అవసరమైన ఈ స్థూలాహారాన్ని గ్రహించేందుకు, జఠరాశయానికి పంపించేందుకు అపానవాయు క్రియ చాలా అవసరం. ఇది లేకుండా, కేవలం ప్రాణం, మనస్సు, మిగతా ఇంద్రియాల ద్వారా సాధ్యం కాదని నిరూపించి వాయువు ద్వారానే అన్నగ్రహణం సాధ్యం కావడం వలన 'వాయువే అన్నం లేదా ఆయువు' అని అన్నారు ఉపనిషత్కారులు.

ఇక ముందు పురుషుడు తాను లేకుండా శరీరం (తన నుంచి సృష్టించబడి) తత్వాభిమాని దేవతలందరితో కలిసి వున్నా నిష్ప్రయోజక మని (జ్ఞానం లేక పోవడం వల్ల) భావించి, తానే (భాగశః జ్ఞానశక్తిని) అందులో బ్రహ్మరంధ్రం ద్వారా ప్రవేశించాడు. అందువల్ల ఆ స్థానం ఆనంద స్థానం. దాన్నే 'విదృతి' అని చెప్పడం జరిగింది. ఈ రీతిగా శరీరాన్ని ప్రవేశించిన (పుట్టిన) పురుషుడు (అంశం – జీవాత్మ) ఆ దేహంలో వేరే ఎవరున్నారని పరిశీలించాడు. అందువల్ల అతణ్ణి (జీవాత్మ) ఇదంద్ర (సాక్షి) అంటారు. పరోక్షంగా ఇదంద్రనే ఇంద్రుడంటారు.

తత్వాభిమాన దేవతలందరి వ్యాపారాన్ని పరిశీలించే, నియంత్రించే ఇతణ్ణి ఇంద్రుడన్నట్లుగా బయట దేవతలందరి అధిపతిని 'ఇంద్రు'డని గ్రహించాలి. దేహంలో ఇతని స్థానాలు (కార్యక్షేత్రాలు) మూడు, స్థితులు మూడని చెప్పారు. (జాగ్రత్, స్వప్న, సుషుప్తులు స్థితులు. హృదయం, కంఠం, బ్రహ్మరంధ్రాలే స్థానాలు) తన్ను బ్రహ్మ ఆవరించి ఉండడాన్ని చూశాడు. ఇక్కడ బ్రహ్మ అంటే ప్రాణశక్తి అని గ్రహించాలి.

అనంతరం పురుషుని శక్తి యొక్క సారమైన శుక్లం స్త్రీ గర్భంలోకి చేరి పిండోత్పత్తి అవుతుంది. ఇదే ప్రథమ జన్మ అనీ, స్త్రీ దేహంలో ఆ పిండం ధరింపబడి పోషింపబడటం (పెరగడం) రెండో జన్మ అనీ, పుట్టి, పెరిగి వార్ధక్యంతో దేహత్యాగం జరిగి పునర్జన్మ పొందడం మూడో జన్మ అనీ చెప్పబడింది. గర్భంలో ఉండగానే వామదేవ ఋషి తాను దేవతల జన్మలన్నిటిని గురించి తెలుసుకున్నానని, ఆ రీతి జ్ఞానాన్ని పొందిన వ్యక్తి స్వర్గలోకంలో తన ఇచ్ఛల్ని సంతృప్తి గావించుకుని అమృతుడౌతాడని చెప్పబడింది. ఇక్కడ ఎవరి నుండి 'తాను' (పురుషుడు – జీవాత్మ) పుట్టాడో, ఎవరి సహాయంతో (ఎవరి ద్వారా సృష్టించబడ్డ ఇంద్రియాలు, తన్మాత్రలు, వృత్తులు, తదభిమాని దేవతలు, భూతాలు వీటన్నిటి ద్వారా) తాను ఉండి దేహంలో అన్ని క్రియల్ని చేస్తున్నాడో ఆ మూలకారణుడైన 'ఆత్మ' (దేవుడు)ను ఎలా ఉపాసించాలి? ఆత్మ ఎవరు? (ఎక్కడున్నాడు) అనే ప్రశ్న వుంది.

ఈ హృదయం, మనస్సు, ప్రాణశక్తి, అజ్ఞానం, విజ్ఞానం, ప్రజ్ఞానం, బుద్ధి, దృష్టి, మతి, ఇచ్ఛ, మనీష, సంకల్పం, క్రతువు – మొదలైనవన్నీ ప్రజ్ఞానమే అనీ, అలాగే బ్రహ్మ (ప్రాణం), ఇంద్రుడు,

ప్రజాపతి, దేవతలు, భూతాలు, జ్యోతులు, వస్తువులు, ధాన్యాలు, ప్రాణి, పక్షులు, స్థావరాలు– వీటన్నిటి వ్యాప్తి ప్రజ్ఞానం ద్వారా ప్రజ్ఞకు సంబంధించిన ఈ విషయాలన్నిటినీ తెలుసుకునే కన్ను, ఇవన్నీ ప్రజ్ఞానం ద్వారానే (జ్ఞానపూర్ణుడైన విరాట్ పురుషుని నుండే) ప్రతిష్ఠితమైనవి. విశ్వం పుట్టేది అక్కడ నుండే. ప్రజ్ఞానమే బ్రహ్మ (అన్నిటికీ ప్రాణం) అని చెప్పి, ఇలా తెలుసుకున్న వ్యక్తి ఈ లోకం నుండి విముక్తుడై స్వర్గంలో కోరికల్ని తృప్తి పరచుకుని అమృతత్వాన్ని అనుభవిస్తాడని చెప్పబడింది.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 8. తైత్తిరీయోపనిషత్తు

**శాంతి మంత్రం :**

**ఓం శంనో మిత్రః శం వరుణః । శం నో భవత్వర్యమా ।**
**శం న ఇంద్రో బృహస్పతిః । శంనో విష్ణు రురుక్రమః ।**
**నమో బ్రహ్మణే । నమస్తే వాయో । త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి ।**
**త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మవదిష్యామి । ఋతం వదిష్యామి ।**
**సత్యం వదిష్యామి । తన్మామవతు ।**
**తద్వక్తారమవతు । అవతుమాం । అవతువక్తారం ।**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**శిక్షావల్లి**

వర్ణం, స్వరం, మాత్ర, బలం, నామం, సంతానం (సంహిత) – ఇలా శిక్ష గురించి ఋషులు పలు విధాలుగా చెప్పారు.

తమకు యశస్సు, బ్రహ్మ వర్చస్సు ప్రాప్తం కావాలని ప్రార్థించి మహా సంహితల గురించి చెబుతారు.

1. **లోకం :** పృథ్వి పూర్వ రూపం ; ద్యులోకం ఉత్తర రూపం. ఆకాశంసంధి (అంతరిక్షం) వాయుసంధానం.
2. **జ్యోతి :** అగ్ని పూర్వ రూపం; ఆదిత్యుడు ఉత్తర రూపం. జలం సంధి; విద్యుత్తు సంధానం.
3. **విద్య :** ఆచార్యుడు పూర్వ రూపం ; శిష్యుడు ఉత్తర రూపం. 'విద్య' సంధి, ప్రవచనం సంధానం.
4. **ప్రజ :** తల్లి పూర్వ రూపం; తండ్రి ఉత్తరరూపం, ప్రజ సంధి, జననమే సంధానం.
5. **దేహం :** క్రింది పెదవి పూర్వ రూపం; పై పెదవి ఉత్తర రూపం; వాణి సంధి; నాలుక సంధానం.

ఇవి మహా సంహితలు. వీటిని తెలుసుకున్న వ్యక్తి ప్రజలు, పశువులు, బ్రహ్మ వర్చస్సులతో కూడిన వాడై ఈ దేహాన్ని త్యజించిన తర్వాత ఉత్తమ లోకాల్ని పొందుతాడు.

ఈ ఐదు మహాసంహితల గురించి వివరించటానికి ముందు శిక్షా వ్యాఖ్యానంలోనూ, తనలోనే ప్రకటమయ్యే వర్ణాన్ని పూర్వ రూపమనీ, మాత్రల ఉత్పత్తికి సాధనమైన బలాన్ని ఉత్తర రూపమనీ, ఈ రెండింటి

కలయికనే సంధియనీ చెప్పారని గ్రహించవచ్చు. తనలో ఉండే శక్తితో (ప్రాణం) ఉత్పత్తి అయ్యే 'స్వరం' రహస్యాన్ని తెలుసుకుంటే (ప్రణవం) దాని ద్వారా సృష్టి రహస్యాన్నంతా తెలుసుకుని ముక్తుడు కావచ్చనేదే మహర్షుల ఉద్దేశ్యం.

**యశ్ఛంద సామృషభో విశ్వరూపః**

**ఛందో భ్యో౽ ధ్యమృతాత్సంబభూవ (4)**

అమృతంలోంచి, నాశరహిత శక్తి (ప్రాణ) స్పందన లోంచి పుట్టిన భూతాదులే ఛందస్సులు. ఆ ఛందస్సులతో భూత ధాతువుల సమ్మేళనంతో ఉద్భవించిన వాళ్లు తొలుత తత్వాభిమాని దేవతలు. వాళ్ళల్లో 'ఋషభు'డు చాలా శ్రేష్ఠుడు. వాళ్ళందరికన్న మొదటే పుట్టి, వాళ్ళ సృష్టికే కారణుడూ, వాళ్ళ యజమానియు (ఇంద్రుడు) అయిన పురుషుడు (విరాట్ పురుషుడు) అని పల్కారు. ఉపనిషత్కారులు ఆ ఇంద్రుడు (విశ్వకర్మ) మమ్మల్ని మేధా సంపన్నులుగా, అమృతత్వాన్ని పొందిన వారుగా తీర్చిదిద్దాలనీ, దేహశక్తి, బ్రహ్మజ్ఞానం గురించి వినే అవకాశం, మధురవాక్యాలు– వీటిని కరుణించాలనీ, అదృశ్యుడైన బ్రహ్మ చేత రచింపబడిన కోశానివి నీవు ! అని ఇలా వర్ణించి, తమ వద్దకు బ్రహ్మచారులు రావాలనీ, వాళ్ళు పుష్టిని, శాంతిని పొందాలని కోరుకున్నారు.

**భూర్భువః సువంతి వా ఏతాస్తి స్రోవ్యాహృతయః**

**తాసాము హ స్మైతాం చతుర్థీం మహాచమస్యః ప్రవేదయతే**

**మహ ఇతి! తద్బ్రహ్మ ! స ఆత్మా**

**అంగన్యన్యా దేవతాః భూరితివా అయంలోకః**

**భువ ఇత్యంతరిక్షం । సువరిత్యసౌలోకః (1–5)**

1. భూః, భువః, సువః – ఇవి మూడు వ్యాహృతులు. అంటే – ఇవి ఉద్భవించాయి. నాల్గోది మహః (మహత్). ఈ మూడింటి ఉద్భవానికి కారణమైనది. అదే బ్రహ్మం (సర్వాతీతం) అదే ఆత్మ (సర్వాన్ని అంతర్భవించుకుంటుంది). మిగిలిన దేవతలంతా ఆ బ్రహ్మకు, మన దేహంలో జీవాత్మకు వేర్వేరు అవయవాలున్నట్లే, ఈ లోకమే (కన్పించే దంతా) భూః – వీటి మధ్య ఉండే బయలు (అంతరిక్షం) భువః, 'అసత్' అంటే అగోచరమై ఉండేదే. 'సువః' ఆదిత్యుడే మహః. అతని ద్వారా అన్ని లోకాల అస్తిత్వం మరియు భూః, అగ్ని, భువః వాయు, సువః, ఆదిత్యుడు, మహః, చంద్రుడు – చంద్రుని నుండి అన్ని జ్యోతుల ఉనికి.

2. భూ : ఋక్కులు, 'భువః' సామలు, 'సువః' యజుర్వేద మంత్రాలు; 'మహః' బ్రహ్మ.

3. 'భూః' ప్రాణం; 'భువః' అపానం, 'మహః' అన్నం, 'సువః వ్యానః' అనే పోలికను చెప్పారు. దీన్ని తెలుసుకున్న వాళ్ళు బ్రహ్మను తెలుసుకుంటారు. దేవతలంతా అతనికి 'బలిమావహంతి' (ఆహుతి ఇస్తారు)అని చెప్పారు. అంతర్ హృదయమే ఆకాశం. అక్కడుండే పురుషుడు మనోమయుడై ఉన్నాడు. (ఇచ్ఛా, జ్ఞాన శక్తులతో కూడిన వాడు) చావు లేని వాడు. హిరణ్యమే (విశ్వోత్పత్తి కారణమైన హిరణ్మయ శక్తి) శరీరంగా కలవాడు (తేజోశరీరి).

**అంతరేణ తాలుకే య ఏషస్తన ఇవావలంబతే**
**సేంద్రయోనిః యత్రాసౌకేశాంతో వివర్తతే**
**వ్యవపోహ్యా శీర్షకపాలే భూరిత్యగ్నౌ ప్రతి**
**తిష్ఠతి భువ ఇతి వాయౌ (1–8)**

మధ్యలో స్తనంలా వ్రేలాడేదే (చిరు నాలుక) ఇంద్రుని ద్వారం. అక్కణ్ణుంచి శిరస్సులో కేశ మూలాల వరకు ఆ మార్గ వ్యాప్తి. అగ్నిలోనూ, వాయువులోనూ ఉండేది ఆ శక్తియే. ఇక్కడ ఇంద్రుడని చెప్పడం ప్రాణశక్తికే అని గ్రహించాలి.

ఆదిత్యులోని 'సువః' అనే పేరుతో, బ్రహ్మలో 'మహః' అనే నామంతో పిలువబడేది ఇంద్రుడే (ప్రాణుడు).

**ఆప్నోతి స్వారాజ్యం ఆప్నోతి మనస స్పతిం**
**వాక్పతి శ్చక్షుష్పతిః శ్రోత్ర పతిర్విజ్ఞానపతిః**
**ఏతత్తతో భవతి ఆకాశ శరీరం బ్రహ్మ**
**సత్యాత్మ ప్రాణారామం మన ఆనందం**
**శాంతి సమృద్ధమమృతం ఇతి ప్రాచీన యోగ్యోపాసస్వ (1-6)**

స్వారాజ్యాన్ని పొందుతాడు అంటే - ఇంద్రియ దాస్యం నుండి మనస్సుకు ముక్తిని ఇచ్చేవాడు. మనస్సుకు అధిపతి. (చాంచల్యం తొలగించే వాడు) వాక్పతి (శబ్దోత్పత్తికి కారణమైన శక్తి) ఇంద్రియాల కంతటికీ బలమందించే వాడు కావున అధిపతి. జ్ఞానప్రాప్తికి సాధనం శక్తి కావడం వల్ల విజ్ఞానపతి. విశ్వంలోని సర్వభూత ధాతువుల ఉత్పత్తి అతని నుండి కావడం వల్ల అన్నిటికీ అతీతమైన శక్తి 'బ్రహ్మ' అతడే! ఆకాశమే అతని ఆవరణం (అలాగే దేహంలోనూ శూన్యస్థానం(వాయువు, జలం, అగ్ని - ఇవన్నీ లేని బయలులో రమించేవాడు) శాంతి సమృద్ధమూ (చిరశాంతి ఉండే) ఆనందమే సహజత్వంగా కల్గిన బ్రహ్మను ఉపాసించు. ముందు పృథ్వి, అంతరిక్షం, ద్యులోకం, దిక్కులు, ఉపదిశలు, అగ్ని, వాయువు, ఆదిత్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నీళ్ళు, ఓషధులు, వృక్షాలు,

ఆకాశం, ఆత్మ – ఇవి అధిభూతాలనీ, చర్మం, మాంసం, స్నాయువు, అస్థి, కొవ్వు, ఆధ్యాత్మమనిచెప్పాలి. ఐదింటితో కూడగావచ్చిన వీటిని ఐదింటితోనే పరిపూర్ణం చేస్తాడు (ఒకదాని కొకటి ఆధారం, సాధనం అయ్యేట్లు చేశాడు) అని చెప్పినారు.

**అహం వృక్షస్య రేరివ కీర్తిః పృష్ఠం గిరేరివ**
**ఊర్ధ్వం పవిత్రోవాజనీవస్వ్వ మృతమస్మి**
**ద్రవిణం సవర్చసం సుమేధా అమృతోక్షితః**
**ఇతి త్రిశంకోర్వేదానువచనం**

ఈ అనువాకం చాలా మహిమాన్వితమైనది. ఈ విశ్వ వృక్షచాలకుణ్ణి నేను. గిరి శిఖరంలా నా కీర్తి (ఉంది). పరబ్రహ్మ నుండి పుట్టిన వాణ్ణి ! శక్తికేంద్రమైన సూర్యునిలా సర్వాత్మను ! అమృతుణ్ణి! వర్చస్సుతో కూడిన శక్తిని నేను. జ్ఞాని, అమృతుడను కూడ అయి వున్నాను. ఇక్కడ త్రిశంకువని చెప్పడం విశ్వకర్త అయిన విరాట్ పురుషునికే అని గ్రహించాలి.

ముందు విద్యాభ్యాసం ముగిశాక శిష్యులకు గురువు బోధించిన హిత వచనాలున్నాయి. సత్యాన్ని పలకడం, ధర్మాచరణం, పూజ్యులకు ఇష్టమైన దాన్ని ఇవ్వడం, సంతానోత్పత్తి, ఆత్మోద్ధారం, తల్లిదండ్రుల్ని దైవ సమానంగా గౌరవించడం, పూజ్యుల్ని, అతిథుల్ని దేవుడిగా భావించి సేవించడం, గురువులలో ఉండే మంచి ఆచారాల్ని మాత్రమే గ్రహించడం. దానానికి వినయం ముఖ్యం. భయం కాదనీ, శ్రేష్ఠులైన వారి నుండి సంశయాల నివారణ గావించుకుని వాళ్ళ ఆచారాన్ని అనుసరించడం మొదలైనవి.

**బ్రహ్మానందవల్లి**

"బ్రహ్మవిదాప్నోతిపరం" (బ్రహ్మను తెలుసుకున్న వాడు పరబ్రహ్మను పొందుతాడు) అనేది ఇక్కడి సత్యవాక్కు. బ్రహ్మ ఆకాశం మొదలుకొని మనుష్యుల దాకా సర్వుల్ని సృష్టించాడు. అన్నమయ కోశం, ప్రాణమయకోశం, మనోమయ కోశం, విజ్ఞానమయ కోశం, ఆనంద మయ కోశం అనే దశలలో ఆత్మవర్ణన ఉండేది. ఈ ఐదింటిని వేర్వేరు పురుషులుగా వర్ణించినా ఈ ఐదు జీవాత్ముని స్థితిభేదాలని గ్రహించాలి.

తొలుత అసత్తు ఉండింది (అగోచరంగా) అక్కణ్ణుంచి అది 'సత్' (గోచరం) అయింది. ఈ సృష్టి అంతా రసమయం, ఆనందమయం, అగోచరం. ఇంకోదాని ఆశ్రయం లేనిదై ఉంది. అందులో (అసత్తు – దేవుడు) ఆశ్రయం పొందే వ్యక్తి నిర్భయుడౌతాడు. ఇవన్నీ చెప్పి, చివరకు ఆనందానుభవంలో తారతమ్యాల గురించి వర్ణించి (దేవ, గంధర్వ, వేదజ్ఞానం – అంటే జ్ఞానుల ఆనందం) నిష్కాముడైన జ్ఞాని శ్రేష్ఠత్వాన్ని నిరూపించి, తన దేహంలో అలాగే సూర్యునిలో ఉండే ఆత్మస్వరూప మొక్కటే అనే అంశాన్ని గ్రహించిన వాడు – అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ స్థితులను దాటి వెళ్ళతాడని చెప్పబడింది.

**భృగువల్లి**

ఇందులో వరుణపుత్రుడైన భృగువు తన తండ్రిని తనకు బ్రహ్మ జ్ఞానాన్ని ఉపదేశించాలని కోరాడు. అపుడు వరుణుడు –

**అన్నం ప్రాణం చక్షుః శ్రోత్రం మనోవాచమితి**

**తం హోవాచ యతోవా ఇమాని భూతాని**

**జాయంతే యేన జాతాని జీవంతి**

**యత్ప్రయంత్యభిసం విశంతి తద్విజి**

**జ్ఞాస్వ తద్ బ్రహ్మేతి సతపోఽ తప్యత సతపస్తప్త్వా**

అన్నం, ప్రాణం, చక్షువు, శ్రోత్రం, మనస్సు, వాక్కు – ఇవి ముఖ్యం. ఎందుకంటే – తత్వాన్ని తెలుసుకునేందుకు మనస్సు బ్రహ్మ నిష్ఠం కావాలి. మనస్సు యొక్క ఏకాగ్రతకు ప్రాణమే ఆధారం. ప్రాణం యొక్క ఊర్ధ్వ గమనానికి అశనమే ఆధారం (అన్నం). బ్రహ్మనిష్ఠలో జ్ఞానప్రాప్తి, దర్శనం – వాక్కు ద్వారా జరుగుతుంది. అందువల్ల చక్షు శ్శోత్రాలు (కళ్ళు, చెవులు) ఆ ఇంద్రియ వృత్తికి మనస్సుతో బ్రహ్మ నిష్ఠం కావాలనే రహస్యాన్ని బోధించి, తర్వాత "దేని వల్ల భూతాల ఉత్పత్తి జరిగిందో, దేని ఆధారంతో ఇవి జీవిస్తున్నాయో, చివరికి దేంట్లో ఇవన్నీ చేరతాయో దాన్ని తెలుసుకోవాలి. అదే బ్రహ్మ, తపస్సును ఆచరించు" అని చెప్పాడు. భృగువు తపస్సు చేసి అన్నంతోనే భూతాల ఉత్పత్తి, అన్నం ఆధారంతోనే అవి జీవిస్తున్నాయి. అన్నంలోనే లయ మౌతున్నాయి (చేరతాయి). అందువల్ల అన్నమే బ్రహ్మమని నిశ్చయించి, తండ్రి వద్దకు వెళ్ళి, బ్రహ్మోపదేశం కోసం విన్నవించాడు. అపుడు ఆ తండ్రియు –

**తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ**

**తపో బ్రహ్మేతి సతపోతప్యత సతపస్తప్త్వా**

తపస్సు ద్వారా బ్రహ్మను తెలుసుకో. తపస్సే బ్రహ్మ. అంటే తపస్సుతోనే బ్రహ్మజ్ఞానం లభ్యం – అని ఆదేశింపగా భృగువు తపస్సు చేసి, ఆ అన్నదుడైన ప్రాణుడే బ్రహ్మ అనీ, ప్రాణశక్తి వల్లనే సర్వభూతాల ఉత్పత్తి, అతణ్ణి ఆశ్రయించే వాటి అస్తిత్వమనీ, అతనిలోనే అవి లీన

మౌతాయని నిశ్చయించి, తండ్రి అయిన వరుణుని వద్దకు వెళ్ళి, మళ్ళీ బ్రహ్మజ్ఞానాన్ని బోధించాలని వేడగా, మళ్ళీ వరుణుడు "తపస్సుతో బ్రహ్మను తెలుసుకో. తపస్సే బ్రహ్మ" అని ఆదేశించాడు. భృగువు మళ్ళీ తపస్సు చేసి మనస్సే బ్రహ్మ; ప్రాణము, మనస్సు యొక్క ఆదేశాను సారంగా దేహంలో చలిస్తుంది. మనస్సు ననుసరించే మానవుడు దేహంలో ఉండవచ్చు. దేహత్యాగం చేయవచ్చు. ముందరి జన్మ కూడ దేహత్యాగ సమయంలో చేసే సంకల్పానికి అనుగుణంగా లభిస్తుంది. సంసారం నుండి ముక్తుడయ్యేందుకు సంకల్పించి బ్రహ్మలో ఐక్యం కావాలంటే దానికి మనస్సే కారణం. అందుకే మనస్సు యొక్క ఆధారం తోనే జీవుల అస్తిత్వం, పుట్టుక, లయం – ఇవన్నీ అని నిశ్చయించాడు.

అతడు మళ్ళీ తండ్రి వద్దకు వెళ్ళి జ్ఞానబోధ కోసం వేడుకోగా అతడు మళ్ళీ "తపస్సు చేసి తెలుసుకో", "తపస్సే బ్రహ్మ" అన్నాడు. అపుడు భృగువు మళ్ళీ తపస్సు చేశాడు. విజ్ఞానమే బ్రహ్మ అనిపించింది. ఇలా అనిపించడానికి కారణమేమంటే ముక్తుడు కావాలనే కోరిక ఉన్నంత మాత్రాన ఎవడూ దేహ త్యాగానంతరం వెంటనే బ్రహ్మలో ఐక్యం కాలేదు. అలా కావడానికి బ్రహ్మ ఉండే స్థానమే అతనికి గోచరం కాదు. అది గోచరం కావాలంటే ఈ విశ్వపు మేరల్ని దాటి పోవాలి. అలా దాటాక పైకి వెళ్ళినట్లల్లా తనతోపాటు చేరిన వివిధ భూత ధాతువుల అంశాల్ని ఎలా ఎలా విడుదల చేసుకోవాలనే విషయాన్ని గ్రహించి, అలా చేసుకుంటూ పోతేనే సాధ్యం. అలా చేసుకుంటూ పోవడానికి ఈ భూత ధాతువుల సమ్మేళనం, ఉత్పత్తి ఎలా జరిగాయనే విషయం తెలియాలి. అదే విజ్ఞానం. కేవలం బుద్ధిశక్తికి అందేది కాదీ విజ్ఞానం ! గ్రహించేది బుద్ధే అయినా, గ్రహించాలనే కోరిక ఉన్నా, కేవలం ఈ మనస్సు, బుద్ధుల ప్రయత్నంతోనే ఈ విజ్ఞానం ప్రాప్తించదు. దానికి తపస్సు చాలా

అవసరం. తపస్సంటే ఈ ఇచ్ఛాశక్తి, గ్రహణ శక్తుల సర్వభూతోత్పత్తికి కారణమైన ప్రాణశక్తి నాశ్రయించి ఏకాత్మ స్థితిలో పరితపించినపుడు – ఆ ప్రయత్నమే ! అదే తపస్సు ఔతుంది. అపుడు ఆ అంతర్ముఖ స్థితిలో విశ్వ విజ్ఞానం తెలుస్తుంది. ఆ విజ్ఞానంతో ఇచ్ఛామరణుడు అయ్యేందుకు, దేహ త్యాగం చేసి ఆ బ్రహ్మలో లీనం కావడానికి సాధ్యమౌతుంది. అందువల్ల విజ్ఞానమే బ్రహ్మమనీ, భృగువు నిశ్చయించి, తండ్రి వద్దకు వెళ్ళి, జ్ఞానబోధ కోసం విన్నవించగా అతడు మళ్ళీ "తపస్సు చేయి, తపస్సే బ్రహ్మ" అన్నాడు. అపుడు భృగువు మళ్ళీ తపస్సు చేశాడు.

ఇక్కడ ఆలోచించడం అవసరం. తాను విశ్వసృష్టి రహస్యాన్నే తెలుసుకున్నానని భావించినపుడు కూడా మళ్ళీ "తపించు ! తపస్సే బ్రహ్మ" అని తండ్రి ఆదేశించాక, భృగువుకు తాను తెలుసుకున్నాననే అహంకారం తొలగి బ్రహ్మ అంటే ఏమటి? అనే జ్ఞానం తనకు కల్గనే లేదు. అది బుద్ధికి గోచరింపదు. అతని దయతోనే కావాలనే వినమ్ర భావం పుట్టి, అతడు ఆ బ్రహ్మజ్ఞాన ప్రాప్తి కోసం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ తపించాడు. అతనికి తనలో ఆనందానుభవం కల్గి సదానంద, అఖండానంద విగ్రహుడూ అయిన బ్రహ్మ (దేవుని) దర్శనం అయింది. అతని ఆ ఆనందం వల్లనే అతనిలోని చైతన్యం స్పందించి, దాంట్లోంచి పుట్టిన శక్తే బయటికి వెలువడి, ఆకాశంలో స్పందించాక దాని వల్ల సర్వభూత ధాతువుల ఉత్పత్తి అయింది. వాటి కలయిక వల్ల లోకాలూ, వస్తువులు రూపొందాయనే జ్ఞానం కల్గింది. "పరమే వ్యోమ్ని ప్రతిష్ఠితా" ఆ ఆనందమయుడైన బ్రహ్మ పరమవ్యోమంలో (ఆకాశంలో అత్యున్న తమైన స్థానం) ఉంటాడనే విషయాన్ని గ్రహించాడు. దీన్ని తెలుసుకున్న వాడికి అన్నం కొరత ఉండదు. ప్రాణుని ఆహారమైన అశనం అతనిలో తనంతట తానే ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. అతడు "అన్నాదు"డౌతాడు.

అంటే స్థూలాహార పానీయాదుల అవసరం అతనికి ఉండదు. అతడు జ్ఞాన సంతానం, బ్రహ్మవర్చస్సు, కీర్తి – వీటన్నిటిని పొందుతాడు. ఇదే భార్గవీ వారుణీ విద్య (వరుణుని దయతో భృగువు తపించి పొందిన జ్ఞానం) అని చెప్పి ఉపనిషన్మహర్షులు అన్నాన్ని నిర్లక్ష్యం చేయరాదు. శరీరానికి త్రాణం, ప్రాణం. దాన్ని అన్నమనవచ్చు. ప్రాణంలోంచే శరీరానికి అస్తిత్వం. శరీరంలోనే ప్రాణుని నివాసం ! శరీరంలోనే అన్నపు ఉత్పత్తి (వాయుమధనం ద్వారా) అయినా అన్నమే శరీరం ఉనికికి సాధక మైనది. ఇలా అన్నం, శరీరం, ప్రాణాల పరస్పర సంబంధాల్ని తెలుసు కున్నవాడు అన్న సమృద్ధిగావించుకుని, దాన్ని సేవించడం వల్ల జగత్తులో ప్రజలు, పశువులు, కీర్తి – మొదలయిన సంపత్తును పొంది శ్రేష్ఠుడౌతాడు.

సృష్ట్యాదిలో అన్నం, నీటి నుండి పుట్టింది. ఇప్పటికైనా విద్యలో కొనసాగే వాళ్ళు మొదట దేహంలో జలోత్పత్తి అధికమై, తర్వాత అశనోత్పత్తి కావడాన్ని అనుభవంతో తెలుసుకోవచ్చు. ఆ అన్నాన్ని తేజస్సు (విద్యుత్తు) గ్రహించి ప్రాణంలో చేరుతుంది. అందువల్ల జ్యోతిలో అన్నం ప్రతిష్ఠించబడిందన్నారు ఉపనిషత్కారులు. అగ్ని నుండి జలతత్వం పుట్టడం వల్ల జ్యోతిలో జలం ప్రతిష్ఠితమైందని అన్నారు. ఇలా పరస్పరాశ్రితాలైన ఇవన్నీ అన్నాదునికి (ప్రాణునికి అన్నాలే! దాన్నే అన్నంలో ప్రతిష్ఠితం అన్నారు. దీన్ని తెలుసుకున్న వ్యక్తి సర్వ సంపద్భ రితుడు, శ్రేష్ఠుడూ అవుతాడని చెప్పారు.

అలాగే పృథ్వినే అన్నమనీ అంటారు. ఆకాశంలో పృథ్వి ప్రతిష్ఠిత మైనది. ఆకాశంలో పుట్టిన సూక్ష్మాంశాలు వ్యాపించి, పృథ్వి కావడంతో ఆకాశం ఇందులో ప్రతిష్ఠితమైనట్లే. ఇది దానికి అన్నం. (దాంట్లో లభ్య మయ్యేది) అది దీనికి అన్నం (పోషకం) రెండూ అన్నమే (అన్నదుడైన

ప్రాణునికి) అన్నం అన్నంలో ప్రతిష్ఠితమైనట్లు కాదా? ఈ పరస్పర సంబంధాన్ని గ్రహించిన వ్యక్తి సర్వసంపద్భరితుడూ, శ్రేష్ఠుడూ అవుతాడు. అన్నాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేయాలి. సూక్ష్మంగా అశనం తన కోసం. స్థూలాహారం అతిథుల కోసం. కేవలం తన కోసం కాదు.

అలాగే తెలుసుకుని ముక్తుడయ్యేందుకు, కల్యాణం కోసం జగత్తును సేవించేందుకు తన వాక్కు, ప్రాణం, కాళ్ళు, చేతులు – మొదలైన అవయవాలనన్నిటినీ ఉపాసించాలి (చక్కగా పెట్టుకోవాలి). జగత్కల్యాణం కోసం వర్షం, త్రాణం కోసం విద్యుత్తు, యశస్సు కోసం యజ్ఞం, వెలుగు కోసం నక్షత్రాలు, ప్రజాపతి అయ్యేందుకు (సంతానం పొందేందుకు) స్త్రీ సంగమం. మరొక అర్థంలో ప్రజల్లో శ్రేష్ఠుడు అయ్యేందుకు "ప్రజాపతి రమృతమానంద ఇత్యుపస్థే" అనే చోట ప్రజాశ్రేష్ఠుడూ, అమృతుడు, ఆనందుడు కావడానికి 'ఉపస్థ'ను, జీవాత్మని తాత్కాలిక వాసస్థానమైన బ్రహ్మరంధ్రాన్ని ఉపాసించాలని గ్రహించాలి. ఇలా ఉపాసించే వాడు గౌరవానికి పాత్రుడౌతాడు.

ఇలా జ్ఞాని అయిన వాడు ఈ లోకాన్ని వదలి, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ స్థితుల్ని దాటి, కోరికలు తీర్చుకుని, కామరూపుడై సంచరిస్తాడు.

**అహమన్న మహమన్న మహమన్నం।**
**అహమన్నాదోఽ హమన్నాదోఽ హమన్నాదః**
**అహం శ్లోక కృదహం శ్లోకకృదహం శ్లోకకృత్ ।**
**అహమస్మి ప్రథమజా ఋతస్య । పూర్వ**
**దేవే భ్యోఽ మృతస్యనా భాయి । యోమా**

**దదాతి ఇదేవ మావాః । అహమన్నమన్న**

**యదంత మాద్మి అహం భువన మభ్య**

**భవాం । సువర్ణ జ్యోతిః । స ఏవం వేద। ఇత్యుపదనిషత్।**

నేను అన్నం అంటే – నేను బ్రహ్మలో చేరతాను. నేను అన్నాదుణ్ణి అంటే – నేను అన్నాన్ని గ్రహించే వాణ్ణి. (అశనం – విశ్వజ్ఞానమే అక్కడ అన్నం) నేను స్తోత్రం చేస్తాను. ఎందుకంటే ఆత్యంతికమైన బ్రహ్మజ్ఞానాన్ని పొందాను. నేను జగత్తుకన్న మొదట ఉన్న వాణ్ణి (దేవునిలో ఉండే చైతన్యాంతర్గత శక్తి) దేవతలకన్న పూర్వంలో అమృత మధ్యంలో ఉద్భవించిన వాణ్ణి నేను. (జీవాత్మ అనే చైతన్యం – విరాట్ పురుషుని అంశమే. అందరిలో దేవుడు, మానవుడు ఇత్యాదిగా వ్యాప్తమై ఉండడం వల్ల). తనను తాను బ్రహ్మార్పణం చేసుకున్న వ్యక్తి నాలాగే అయిపోతాడు. ఈ విశ్వమంతా నేనే వ్యాపించి ఉన్నాను. (అంతటినీ తెలుసుకొనేవాడనయ్యాను. అంతటిని నాలాగే భావించగల్గే వాడనయ్యాను). దీన్ని తెలుసుకున్నవాడలాంటి వాడే అవుతాడు – అని ఉపనిషత్కారులు చెప్పారు.

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే – "నేను స్తోత్రం చేస్తాను" (శ్లోకకృదహం) అనే మాట. "స్తోత్రం చేయబడేవాడూ నేనే" అని చెప్పలేదు. "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అనే మాటకు బ్రహ్మలాగ సామ్యంతో కూడిన అర్థమే ! బ్రహ్మే అవుతాడని అర్థం లేదని ఉపనిషత్కారుల మాటల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది.

# 9. ఛాందోగ్యోపనిషత్తు

**శాంతి మంత్రం :**

**ఓం అప్యాయంతు మమాంగాని । వాక్ర్పాణశ్చక్షుః ।**
**శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి ।**
**సర్వం బ్రహ్మోపనిషదం । మాహం బ్రహ్మ నిరాకుర్యాం ।**
**మామా బ్రహ్మ నిరాకరో ద నిరాకరణ మస్త్వనిరాకరణం మేఽస్తు ।**
**తదాత్మని నిరతేయ । ఉపనిషత్సు ధర్మాస్తే**
**మయి సంతుతే మయిసంతు"**

నా అవయవాలన్నీ కన్ను, చెవి, వాక్కు మొదలైన ఇంద్రియాలన్నీ తృప్తి చెందనీ ! అంతా బ్రహ్మలో ప్రతిష్ఠితమైనది. నా నుండి బ్రహ్మత్వ నిరాకరణం జరగకుండనీ! బ్రహ్మ నన్ను నిరాకరించకుండా ఉండనీ ! పరస్పర నిరాకరణం జరగకుండా ఉండనీ ! జ్ఞానంతో కూడిన కల్యాణ కారకమైన కర్మ (ధర్మం) నాలో స్థిరపడనీ.

ఇక్కడ బ్రహ్మ నన్ను నిరాకరించకుండనీ అని కోరుకోవటం సహజమే. అయితే "బ్రహ్మత్వం నా నుండి నిరాకరింపబడకుండనీ" అనే వాక్యం విచిత్రమని అనిపిస్తుంది కదా ? అయితే బ్రహ్మత్వాను భవాన్ని అపేక్షించి (ఆత్మ సహజత్వమైన ఆనందానుభవం) బ్రహ్మనిష్ఠుడై దయ కోసం బ్రహ్మను ప్రార్థించి, ప్రసాదియై, ఆ బ్రహ్మోత్మానుభవం అయిన తర్వాత కూడ లోక మోహంతో ఆ బ్రహ్మోత్మానుభవం వద్దు. ప్రస్తుతానికి నా నుండి అది దూరంగా ఉండాలనే కోరిక కల్గడం సహజమే. ఇది అనుభవవేద్యం.

**"ఓం మిత్యేతదక్షర ముద్గీథ ముపాసీతోమితి**

**హ్యుద్గాయతి తస్యోప వ్యాఖ్యానమ్**

నాశరహితమైన శక్తి నుండి పుట్టిన శబ్దం 'ఓం' అనే అక్షరమే ఉద్గీథం (పాడబడేది). దీన్ని ఆశ్రయించండి. ఆ శబ్దంలో మనస్సును లీనం చేయండి.

**ఏషాం భూతానాం పృథివీరసః పృథివ్యా**

**ఆపోరసః అపామోష ధయోరస ఓషధీనాం**

**పురుషోరసః పురుషస్య వాగ్రసో వాచ**

**ఋగ్రసః ఋచః సామరసః సామ్న ఉద్గీథోరసః।**

భూతాలసారమే పృథ్వి అయింది. ఈ పృథ్వీసారమే జలమైంది. ఆ జలసారమే సస్యాలు. వాటిని సేవించే మానవుడు సస్యసార మౌతున్నాడు. అతని సారం (జ్ఞానం) అతని వాక్కు. దాని ద్వారా ప్రకటింప బడటం వల్ల ఆ వాక్కుకు జ్ఞానాన్ని అందించేది ఋక్కు (ప్రాణుని ఊర్ధ్వగమనం) కావడం వల్ల అదే సారం. ప్రాణుని ఋక్, యజుర్గతాగతులు సమస్థితికి చేరి, మనోనిష్ఠ కల్గి నాకే జ్ఞానవికాసం ప్రారంభమౌతుంది. అందుచేత ఋక్కుకు సామమే సారం. ఈ సమస్థితికి ఓంకారమే (వాయు మధనంలో ఉత్పత్తి అయ్యే శబ్దమే కారణమై) సారం. ముందు ఏర్పడే అన్ని స్థితులకూ ఇదే ప్రథమాధారం కావడం వల్ల ఇది ఓం శబ్దం ! బ్రహ్మ! సారాలకు సారం ! వాక్కే ఋక్కు (వాయువు యొక్క ఊర్ధ్వ గమనమే ఋక్కు). అపుడు శబ్దోత్పత్తి అవుతుంది. ఆ శబ్దాన్నే ఋక్ అంటారు. సమస్థితిలో ఉండే (ఋక్, యజస్సుల అవల ఉండే) ప్రాణమే సామమని చెప్పబడింది. 'ఓం'కారాన్ని, ప్రాణుని

అశనోత్పత్తికి కారణమైన శబ్దాన్ని (ప్రణవం) ఉద్గీథం అంటారు. ఈ శబ్ద, ప్రాణాల్ని మిధునమనడం జరిగింది. శబ్దం లయమయ్యే స్థానంలో ప్రాణ, వాక్కుల సంయోగం (ప్రాణునితో వాక్కు శబ్దోత్పత్తికి మూల కారణమైన మనస్సు ప్రాణంతో చేరుతుంది). మిథునాల సమాగమమై పరస్పరకామనా పూర్తి ఔతుంది. (మనస్సుకు తృప్తి,, ప్రాణునికి అశనంతో పుష్టి) ఈ రహస్యాన్ని గ్రహించి 'ఓం'కారాన్ని ఉపాసిస్తే అన్ని కోరికలు ఫలిస్తాయి.

**కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ**
**వీర్యవత్తరం భవతీతి**

తెలిసిన వాళ్ళు కర్మలనాచరిస్తారు. తెలియని వాళ్ళూ ఆచరిస్తారు. అయితే జ్ఞానశ్రద్ధలతో కూడిన కర్మ కల్యాణకరమైన ఫలాన్ని అందిస్తుంది (లోకానికి). తెలియని కర్మ అతణ్ణి బంధనంలోకి తోస్తుంది.

దేవదానవులు (ప్రజాపతిపుత్రులు) పరస్పర యుద్ధంలో మునిగాక దేవతలు దానవుల్ని జయించేందుకు ఉద్గీథాన్ని ఉపాసించారు. వాళ్ళు ముక్కులోని వాయువు ద్వారా ఉద్గీథోపాసన చేయగా దానవులు పాపంతో దాన్ని భేదించారు. తర్వాత దేవతలు వాక్కుతో, కన్నులతో, చెవులతో, మనస్సుతో ఆ ఓంకారాన్ని, ఉద్గీథాన్ని ఉపాసించేందుకు ప్రయత్నించాక దానవుల పాపంతో అంతరాయం కల్గింది.

**అథహ య ఏవాయం ముఖ్యః ప్రాణ స్త ముద్గీథ**
**ముపాసాం చక్రిరే తం హాసురా ఋత్వా విదధ్వం**
**సూర్యథా శ్మాన మాఖణమృత్వా విధ్వంసేత**

చివరికి దేవతలు ముఖ్య ప్రాణాన్ని ఆశ్రయించారు. పంచ

వాయువుల ఉత్పత్తికి కారణమైన ప్రాణశక్తి అదే! వాయువుకు ఇంద్రియాల సహాయం లేకుండా దేహం లోపల ప్రాణాపాన గతుల్ని ఇవ్వగల్గుతుంది. అపుడు ఆ వాయువు యొక్క గతాగతిలో ఏర్పడే శబ్దమే 'ఓం' (ప్రణవం) ఉద్గీథం. ఉద్గీథం చేశారు. అపుడు దానవులు ఎదుర్కోవటానికి వచ్చి రాళ్ళ పై పడిన మట్టి గడ్డలా నాశనమయ్యారు.

ఈ కథలో ప్రణవోపాసన ఇంద్రియాల ద్వారా జరగలేదు. మన దేహంలోని ముఖ్యశక్తి అయిన ప్రాణం నుండి – అనేది స్పష్టంగా గోచరిస్తుంది.

ప్రాణుని గురించి తెలుసుకున్న వాణ్ణి నాశనం చేసే వాళ్ళూ, వాళ్ళే నాశనమౌతారని చెప్పబడింది.

**"ఏవాంగరసం మన్యతేంగానాం యద్రసః"**

ప్రాణం అంగీరసం. (దేహావయవాల కన్నిటికి త్రాణన్నందించే ముఖ్యశక్తి) అందువల్ల దాన్ని 'అంగీరసం' అంటారని చెప్పబడింది.

**"ఏవబృహస్పతిం మన్యంతే వాగ్భిబృహతీ తస్య ఏషపతిః"**

(దీన్నే బృహస్పతి అంటారు. వాక్కు బృహతీ అంటే పెద్దది. ఎందుకంటే జ్ఞానం ప్రకాశం వాక్కు ద్వారా అవుతుంది. ఆ వాక్కు ఉత్పత్తికి ప్రాణమే మూలశక్తి కావడం వల్ల అది వాక్పతి – బృహస్పతి)

**"ఆగాతాహవై కామానం భవతి య ఏతదేవం**

**విద్వానక్షరముద్గీథ ముపాస్త ఇత్యాధ్యాత్మం"**

ఈ రహస్యాన్ని గ్రహించి ఉద్గీథోపాసన చేసేవాడి కోరికలన్నీ ఫలిస్తాయి. ఇదే ఆధ్యాత్మం. అంటే – ఆత్మను తెలుసుకునే మార్గం (సాధన – విద్య).

బయట (సమిష్టి జగత్తులో) ప్రాణానికి ప్రతీక సూర్యుడు. దేహానికి త్రాణమైన ప్రాణం ! జగత్తుకు శక్తి ప్రసార కేంద్రమైన సూర్యుడు! రెండూ ఉపాసించదగినవే. ఈ రెండింటి ఉపాసన ద్వారా కూడా శక్తి పెరుగు తుంది.

అందులో సూర్యోపాసన అంటే కేవలం ఆదిత్య హృదయమనే స్తోత్రాన్ని చదవడం కాదు. సూర్య మండలాన్ని తదేక దృష్టితో చూడడం. దీనికి పూర్తిగా సాత్వికాహారం కావాలి. విహారం నియమానుసారంగా ఉండాలి. ఉపాసన తర్వాత నీళ్ళు లేదా సస్య సంపద పై కొంచెం సేపు దృష్టిని ఉంచడం అవసరం. అలా కాకుండ క్రమం లేకుండా ఎలాగెలాగో చేస్తే దృష్టి నశించడం లాంటి ప్రమాదాలు కల్గుతాయి.

**అథ ఖలు వ్యానమేవోద్గీథముపాసీత**
**యద్వై ప్రాణితిస ప్రాణోయ దపానితి**
**సోఽ పానోఽ థయః ప్రాణాపానయోః**
**సంధిఃస వ్యానో యో వ్యానః సావాక్**
**తస్మాద ప్రాణన్నపాన న్వాచమభివ్యాహరతి**

(ఇక్కడ ఉద్గీథంలో వ్యానవాయువు గొప్పతనం చెప్పబడింది. ప్రాణం నుండి క్రిందికి వచ్చే గతిని ఆపానమనీ, ప్రాణం వైపు వెళ్ళే వాయు గతిని ప్రాణమనీ వర్ణించి, ఈ రెండుగతుల్లో చలించే వాయువు దేహం అంతటా వ్యాపించి ఉంది. అదే వ్యానం. అదే సంధి సంధానానికి (ప్రాణ మనస్సుల మిలనానికి కారణం) సాధనం. ఈ వ్యానం వల్లనే (వాయువు యొక్క వ్యాప్తి – దేహం యొక్క వేర్వేరు స్థానాల్లో) వాక్కు ఉద్భవిస్తుంది. అందుకే "వ్యానమే వాణి" అన్నారు. అందువల్ల వాణి

ప్రకటమయ్యే వాయువు యొక్క ప్రాణపానగతులు లేకుండా పోతాయి.

తర్వాత వాణి మహత్వాన్ని గురించి అదే ఋక్, అదే యజుస్సు, అదే సామ ! కర్మాచరణకూ వ్యానమే సాధనం (వాయువు యొక్క వ్యాప్తి లేకుండా ఏ అవయవమూ పని చేయజాలదు).

**ఖలూద్గీధాక్ష రాణ్యుపాసీతోద్గీథ ఇతి ప్రాణ**
**ఏవో(త్ప్రాణేన హ్యుత్తిష్ఠతి వాగ్గీ ర్వాచోహ**
**గిర ఇత్యా చక్షతేఽ న్నంథమన్నే హీదం సర్వంస్థితం**

ఉద్గీథమనే దాన్ని శబ్దోత్పత్తి ద్వారా ఇక్కడ వివరించడం జరిగింది. 'ఉత్' అనే వేళ మనలో వాయువు పైకి వెళ్తుతుంది. అందువల్ల ప్రాణం నుండి మానవుని శ్రేయస్సు. 'గీ' అనేదాన్ని ఉచ్చరించే వేళ వాయువు స్వరయుక్తంగా క్రిందికి వస్తుంది. దాన్నే 'వాణి' (అపానగతి) అంటారు. వీటి వల్ల ఈ ప్రాణాపానగతుల్లో జరిగే వాయు మథనం నుండి ఉద్భవిస్తుంది. అన్నాన్ని (అశనం) 'థమ్' (అక్కడే శబ్దంలో గతాగతితో పుట్టి ఐక్యం కావడం – ప్రాణ చైతన్యం నుండి గ్రహింపబడుతుంది) అన్నారు. అన్నీ ఈ అన్నం పైనే ఆధారపడి ఉన్నాయి.

ఋక్, యజు, సామవేద మంత్రాలతో దేవతల ప్రీతి కోసం చేసే ఉద్గీథక్రమాన్ని వివరించి, తర్వాత దేవతలు మృత్యుభయం నుండి విముక్తులు అయ్యేందుకు త్రయీవిద్యను ఆశ్రయించారు.

**దేవా వై మృత్యోఃబిభ్యత్రయాం**
**విద్యాం ప్రావిశంస్తే ఛందోభిరాచ్ఛాద**
**యన్యదేభిరచ్ఛాదయం స్తచ్ఛంద సాంస్త్వ**

అనేచోట 'విద్య' గురించి తెలియని వారు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అనే పేర్లున్న గ్రంథాల్లోని మంత్రాన్ని చదివారని అర్థం చెప్పారు. అయితే దేవతలాశ్రయించేది మూడు వేదాల్ని కాదు. ఈ వేద మంత్రాల ద్వారా చెప్పబడ్డ విషయం ఏ విద్యను ఉపాసించడం వల్ల లభిస్తుందో ఆ విద్యనే ఆశ్రయించారు. ప్రాణోపాసనకు ప్రథమ సోపానమైన వాయుమథనమే త్రయీ విద్య. దేహంలోని అన్ని చోట్లా వ్యాప్తమైన వాయువును ఏకముఖమయ్యేట్లు కేంద్రస్థానంలో ఋక్ (ఊర్ధ్వగతి – ప్రాణం), యజుర్ (అధోగతి – అపానం), 'రుధ్వ – శబ్దోత్పత్తి అయ్యే స్థానంలో సమంగా నడిపించే క్షిప్రప్రాణాపాన గతుల్లో (సామ) నడిపించే వాయుమథనమే త్రయీ విద్య. అపుడు వారికి సత్వాంశం యొక్క ఎరుక కొంచెం కొంచెం ఛాయామాత్రంగా గోచరించటం ప్రారంభమైంది. ఆ నీడ నుండి వాళ్ళు కొంచెం అదృశ్య మయ్యారు. (మృత్యు భయాన్ని విస్మరించారు) అయినా మృత్యుభయం పూర్తిగా వాళ్ళను విడువ లేదు. అందువల్ల వాళ్ళు ఈ త్రయీ వేదాల నుండి ముందుకు సాగి స్వరాన్ని ఆశ్రయించారు.

**యదావాఋచ మాప్నోత్యోమి**
**త్యేవాతిస్వరత్యేవం సామైవం**
**యజు రేష ఉ స్వరోయదేత దక్షర**
**మేత దృమత మభయం తత్ప్ర విశ్య**
**దేవా అమృతా అభయా అభవన్**

(శబ్దయుక్తంగా సాగే వాయు మథనంతో అశనం లభించే ప్రాణుని ద్వారా గ్రహింపబడే అంశాన్ని గ్రహించి ఆ అక్షరాన్ని ఆశ్రయించారు.

ప్రాణంలో ఇంద్రియవృత్తుల్ని లీనం చేశారు. ఆ అక్షరమే (ప్రాణమే) స్వరం (స్వయం ప్రకటనా సామర్థ్యం కలది, స్వయం ప్రకాశమానం) అది నాశరహితం. దీన్నాశ్రయించాక (మనస్సులో ఇందులో లీనమైనపుడు) భయ నివారణం కావడంతో దీన్ని అభయం అన్నారు. దీన్ని ఆశ్రయించి దేవతలు అమృతులు, అభయులూ అయినారని చెప్పవచ్చు. ఆ విద్యనాశ్రయించడం వల్ల మానవులు కూడ అమృతులూ, అభయులూ కావచ్చునేదే ఉపనిషత్ మహర్షుల ఉపదేశం. దీన్ని వారు తమ అనుభవం తోనే చెప్పారు.

సమిష్టిలో (జగత్తులో) సూర్యమండలం ప్రాణశక్తి కేంద్రం కావడం వల్ల ఆ సూర్యుని కరిణాల ఉపాసన ద్వారా మానవుల దేహశక్తి పెరిగి చాలామంది కొడుకులు పుడతారని అధిదేవతల గురించి, సృష్టిలో ఇతర వస్తువులకు తన శక్తిని ప్రసారం చేసే కేంద్రాలు, తదభిమాన దేవతల గురించి బోధించారు. కిరణాల కేంద్రమైన సూర్యమండలాన్ని ఉపాసించడం వల్ల తనకొక్కడే పుత్రుడయ్యాడని చెప్పి, బహుపుత్ర లాభం కోసం కిరణాల్ని ఉపాసించమని కౌశీతకి తన కొడుకుకు బోధించాడట!

అలాగే తన దేహంలో ఉండే ఏకైక ప్రాణుని ఉపాసనను తాను చేయడం వల్ల (ప్రాణంలో మనస్సును లీనం చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల తనకు ఒక్కడే పుత్రుడయ్యాడనీ, తన కొడుకు దేహంలో ప్రాణుని నుండి ఉత్పత్తి అయిన పంచవాయువుల ఉపాసనతో (త్రయీ విద్య–నచికేతాగ్ని ఉపాసన – వాయుమథనం) చాలామంది కొడుకుల్ని పొందాలని కౌశీతకి బోధించాడట. ఈ ఋక్ సామాలన్నీ ఆత్మ యొక్క ఉద్గీథ. (ఈ దేహంలోని జీవాత్మ) ఈ లోకపు గతి ఏమి?

**అస్య లోకస్య గతి? రిత్యాకాశ ఇతి హోవాచ సర్వాణి హవా ఇమానికా?**

**భూతాన్యా కాశాదేవ సముత్పద్యంత ఆకాశం**

**ప్రత్యస్తం యంత్యాకాశో హ్యేవై భోజ్యాయానాకాశః పరాయణం**

ఆకాశం, ఆకాశంలోనే అన్ని భూతాల ఉత్పత్తి, అస్తిత్వం, అలాగే లయము అవుతాయి. సర్వ భూతాలకన్న ఆకాశం శ్రేష్ఠం. అదే సర్వానికి చివరి ఆశ్రయం. అందువల్ల జ్ఞానులు ఆకాశాన్ని భూతమనకుండా 'తత్వ' మన్నారు. అంటే శాశ్వతమైన 'సత్' (దేవుడు) నుండి బయటికి వచ్చి, శక్తి వ్యాప్తికి స్థానమైందని గ్రహించాలి. అది ఎల్లప్పుడూ ఉండేదే. ఉత్పత్తి అయింది కాదు. దీన్ని ప్రవాహణుడు తన సహచరులిద్దరికి బోధించాడు.

ఇలాగే అతిధ్వనుడు ఉదరశాండిల్య శౌనకునికి ఉద్గీథం గురించి చెప్పిన కథ. అనంతరం కురుదేశపు చౌక్రాయణుడు, ఇభ్యుల కథలో చాక్రాయణుడు యజ్ఞంలో ప్రస్తోతృ, ఉద్గాతృ, ప్రతిహర్తలకు బోధించిన ఉద్గీథ వివరణ ఉంది. ప్రస్తావపు అధిదేవత 'ప్రాణ'డనీ, ఉద్యానం అధిదేవత 'ఆదిత్యు'డనీ ప్రతిహారపు అధిదేవత 'అన్న'మనీ చాక్రాయణుని బోధ. అక్కణ్ణుంచి ముందు ఒకదాల్భుడు కుక్క నుండి తెలుసుకున్న ఉద్గీథపు వివరాలు ఇలా వున్నాయి.

ఈ లోకం "హో', 'ఉ', కారం. వాయువు 'హో', 'ఇ'కారం. చంద్రుడు "అథ'కారం. ప్రజాపతి 'హిం'కారం. ప్రాణం 'స్వరం' అన్నం అథవా వాణి విరాట్ ఆత్మ, 'ఇహ'కారం అగ్ని 'ఈ' కారం. ఆదిత్యుడు 'ఊ' కారం (పిలిచేది 'ఏ'కారం) విశ్వదేవతలు 'ఔహో'కారం.

ఇవి అర్థరహితంగా కన్పించినా సాంకేతికమైనవి. 'హ, ఉ' కారాల ఉత్పత్తి వ్యానవాయువు యొక్క ఉగమనం (బహిర్వ్యాప్తి) ద్వారా, బహిర్

వ్యాప్తమైన వాయువు కొంచెం క్రిందిస్థాయిలో (అంతరిక్షంలో) ఉండడాన్ని సూచిస్తుంది. 'హా,ఇ'కారం; వర్ణోచ్చారణ మూలస్థానం నుండి బయటికి వచ్చి స్థిరమైన దాన్నే 'అ,థ' కారం సూచిస్తుంది. లీనం కావడాన్ని సూచిస్తుంది – హింకారం ! అన్ని వర్ణాల ఉత్పత్తికి మూలమైన స్వప్రకాశి ప్రాణం (స్వరం) అన్నిచోట్ల వ్యాప్తమౌతుంది ! (భూతాల్లో) అన్నం మరియు వాక్కులు కావడం వల్ల 'విరాట్' మూలం నుండి దిగి స్థితమైన జ్ఞాన శక్తి, ఆత్మ 'ఇహ'కారం, ఆత్మకార్యం కోసం ఇంకా క్రిందికి దిగిన శక్తి అగ్ని 'ఈ' కారం (వైశ్వానరం). బహిర్వ్యాప్తమైన విశాల శక్తి కేంద్రం. సూర్య 'ఊ'కారం, మానవులు సంబోధించే వేళ అతడు తమకన్న శ్రేష్ఠమనీ ఊర్ధ్వదిశాముఖులై కూయడం వల్ల (అతనిలో ఉండడం వల్ల) 'ఏ'కారం, ఆదిత్యుడి నుండి క్రింది స్థాయిలో ఉంటూ విశ్వాభిమాని దేవతల సంకేతం ' ఔహో' కారం.

ఈ వర్ణోత్పత్తి రహస్యం (సంకేతాల అర్థం) ఏ గ్రంథంలోనూ కన్పించలేదు. విద్యలో సాగి తెలిసుకున్న వారికి మాత్రం సంకేతాలు అర్థమౌతాయి. విద్య లభించకుండా, ఆత్మానుభవం, జ్ఞానప్రాప్తి లభించని వారికి ఈ సంకేతాలు అర్థంలేని మంత్రాలుగా గోచరిస్తాయి.

ఈ పంద్రెండు సంకేతాలు పన్నెండు దేవతల్ని (సమూహాన్ని) సూచిస్తాయి. పదమూడవ 'హుం" తనలోనే నిరతుడైన స్థితికి సంకేతం.

"అనిరుద్ధ స్త్రయోదశ స్తోభః సంచారో హుంకారః" అని చెప్పారు. ఈ పంద్రెండు మందిని 'ఆదిత్యులు' (ద్వాదశాదిత్యులు) అన్నారు. మొదటి నుండి పుట్టి ఉన్నారని, వాళ్ళకు ఆది అయిన దేవుణ్ణి 'ద్వాదశాత్మ' డనీ, 'ద్వాదశాత్మన్నమోస్తుతే' చోట జ్ఞానులు స్తుతించారు. సర్వసృష్టికి

కర్తననిపించుకున్న ప్రజాపతిని భానుమండలాధిపతి అయిన 'భాస్కరు'దని పల్కిన వాళ్ళే, మండలాలకవతల – ఏమీ లేని శూన్యస్థానంలో ఉండే (ఆకాశం) 'ఆత్మ'ను "సర్వఏష రవిః ప్రభుః" అందరికి ప్రభువంటే 'ప్రభవా'న్ని అంటే శక్తినందించే ముఖ్యవ్యక్తి 'రవి' అని గ్రహించి బోధించారు. ఇలాంటి జ్ఞానుల మాటల్ని ఎంత అని వివరించి రాయ గలం ? 'విద్య' నాశ్రయించి, గ్రహించాకే ఎవరికైనా అది సత్యమని పిస్తుంది గాని, మరొక్కరి మాటలు – రాతలు సత్యమనే విషయం పై పూర్ణమైన నమ్మకం కల్గదు. కలుగరాదు కూడ ! అలాగైతే ఇక తపస్సు యొక్క అవసరం ఏముంది? తత్వజ్ఞానం గురించిన ఆకాంక్షను తీవ్రం చేయాల్సిన పని మాటతో, రాతతో జరిగితే చాలు. అనుభవజ్ఞుల మాటలతో, రాతలతో ఇది సంభవిస్తుంది. మహిమలతో ఈ పని జరగదు. ఆశ్చర్యం, భయం కలుగుతాయంతే ! ఇది తారకం కాదు. "నహిజ్ఞానేన సదృశం" అనే గీతా వాక్యం ప్రకారం ముక్తికి సాధనమైన జ్ఞానకాంక్ష పాఠకుల్లో తీవ్రమైతే ఈ రచన సార్ధకమైనట్లే !

2వ అధ్యాయంలో 'పంచవిధ సామా'న్ని గురించి వివరించ బడింది (1) హింకారం, అగ్నిప్రస్తావం, అంతరిక్ష ఉద్గీథం, ఆదిత్య ప్రతిహారం, ద్యులోక నిధనం – అని ఉల్లేఖించబడింది.

అధోలోకాల్లో ఆదిత్యుడు ప్రస్తావం, అంతరక్షి ఉద్గీథం, అగ్ని ప్రతిహారం, పృథ్వీనిధనం, ద్యులోక 'హిం'కారం.

ఇలాగే వానను గురించి, జలాన్ని గురించి, ఋతువులు, పశువుల్ని గురించి చెప్పి చివరగా అన్నిటికన్న శ్రేష్ఠమనీ –

**ప్రాణేషు పంచవిధం పరోవరీయః**

**సామోపాసీత ప్రాణో హింకారో**

**వాక్రస్తావశ్చక్షురుద్గీతః శ్రోత్రం**

**ప్రతిహారో మనోనిధనం పరోవరీయాంసి వా ఏతాని**

సర్వశ్రేష్ఠమైన పంచ ప్రాణాల పంచవిధ సామోపాసనలో ప్రాణ వాయువు 'హింకారం', వాణి ప్రస్తావం, చక్షు ఉద్గీథం, శ్రోత, ప్రతిహారం, మనోలయం – అని చెప్పబడింది.

'హిం' కారం మూలస్థానం మరియు అంతర్ముఖత్వాన్ని సూచిస్తుంది. తనలోని భావాల్ని ప్రాణవాయువు 'వాక్కు' ద్వారా వ్యక్తీకరిస్తుంది. 'వాణి ప్రస్తావం' కన్నుల ద్వారా తెలుసుకుంటుంది. (వస్తువుల రూపం, రంగు, గాత్రం మొ॥) అందువల్ల చక్షు ఉద్గీథం (జ్ఞానానికి – ఎరుక – స్థూల సాధన) ఇంకోదాన్నుంచి స్వీకరించే జ్ఞానం చెవి ద్వారా. అందువల్ల చెవి 'ప్రతిహారం', ఇవన్నీ చేరే స్థానం మనస్సు కావడం వల్ల అది 'నిధనం'.

ఇలాగే ఈ సప్త విధ సామోపాసనలో (హింకారం, ప్రస్తావం, ఆది, ఉద్గీథం, ప్రతిహారం, ఉపద్రవం, నిధనం) ఆది, ఉపద్రవమనే రెండింటిని ఆ ఐదింటిలో చేర్చారు.

ఆదిత్యుడికి చెందిన సప్తవిధ సామంలో –

1) ఉదయ పూర్వపు అతని స్వరూపం 'హింకారం'.

2) ఉదయరూప ప్రస్తావం.

3) కిరణాలు పృథివి ముట్టే సమయంలోని రూపం అది.

4) పట్టపగటి ఆదిత్యుని రూపం ఉద్గీథం.

5) మధ్యాహ్నం తర్వాతి రూపం ప్రతిహారం.

6) సంధ్యాకాలపు పూర్వరూప ఉపద్రవం.

7) అస్తకాలపు రూపనిధనం.

ఇలా వర్ణించారు. వేర్వేరు సమయాల్లో ఆదిత్యోపాసన చేయడం వల్ల పొందగల్గే ఫలాలు వేర్వేరుగా ఉంటాయి.

ప్రాణంలో ప్రతిష్ఠితమైన గాయత్ర సామాన్ని గురించి –

**మనోహింకారో వాక్ప్రస్తావశ్చక్షురుద్గీథః శ్రోత్రం**
**ప్రతిహారః ప్రాణో నిధన మేతద్గాయత్రం ప్రాణేషు ప్రోతమ్**

అంటూ మనస్సు, వాక్కు, చక్షువు, శ్రోత్రాలు ఏకాత్మ స్థితిలో ప్రాణంలో లీనమయ్యే 'విద్య' గురించి చెప్పారు.

దీన్ని తెలుసుకున్న వాడు జ్ఞాని అవుతాడు. ఇచ్ఛా మరణాన్ని పొందే వాడౌతాడు. ఉజ్వల జీవనాన్ని, కీర్తి సంపదల్ని పొందిన వాడు, 'మహామనాః' విశాలభావం ఉన్నవాడూ ఔతాడని ఉపనిషత్కారులు ఉద్ఘోషించారు.

అలాగే రథంతరసామ (అగ్ని గురించి), వామదేవ్యసామ (స్త్రీ పురుష సంగమం గురించి) వీటి గురించి వర్ణించడం జరిగింది. వృష్ఠి, పశువులు (వాన), ఋతువుల వర్ణన కూడా ఉంది. రోమం, చర్మం, మాంసం, ఎముకలు, మజ్జ – ఇత్యాద్యంగాలతో కూడిన దేహానికి సంబంధించిన సామం గురించి వర్ణించబడింది. అగ్ని, వాయు, ఆదిత్య, నక్షత్ర, చంద్రుడు – ప్రకృతి, వీటికి సంబంధించిన 'రాజసామ' వర్ణనం కూడా ఉంది. త్రయీవిద్య, ఈలోకాలు, అగ్ని, వాయువు, ఆదిత్యుడు –

ఈ దేవతలు, నక్షత్రాలు, పక్షులు, కిరణాలు, సర్వగంధర్వ పితృదేవతలకు సంబంధించిన సామల వర్ణన ఉంది. పశువులకు శుభకరమైన వినర్ధి సామాల వర్ణన ఉండి. స్వరాత ఆత్మ ఇంద్రుడనీ, ఊష్మ వర్ణాలు (వ్యంజనాలు) ప్రజాపతి ఆత్మలనీ, దేహంలో ఇంద్రుడంటే శుక్లం. ప్రజా పతి అంటే ప్రాణమనీ ఉపనిషత్కారుల అభిప్రాయాలు.

**సర్వే స్వరా ఘోషవంతో బలవంతో**

**వక్తవ్యా ఇంద్రే బలం దదానీతి**

"సర్వస్వరాల్ని ఘోషించేందుకు శక్తికి కారణమైన ఇంద్రునికి (శుక్ల) నేను బలాన్ని అందిస్తున్నాను" అని అర్థం.

**సర్వే ఊష్మాణోఽ గ్రస్తా నిరస్తా వివృత్తా**

**వక్తవ్యా ప్రజాపతే రాత్మానం పరిదదానీతి**

ప్రజాపతికి (ప్రాణుడు) నేను నన్ను (ఇచ్ఛ - మనస్సు) సమర్పిస్తున్నానని చెప్పడంలో మహర్షుల అభిప్రాయం ఏమనేది అర్థమవుతోంది.

ధర్మం గురించి ఇలా చెప్పబడింది

**త్రయో ధర్మ స్కంధా యజ్ఞోఽ ధ్యయనం**

**దాన మితి ప్రథమ స్తప ఏవ ద్వితీయో**

**బ్రహ్మ చార్యా చార్యకులవాసీ తృతీయోఽ**

**త్యంతమాత్మానమాచార్య కులేఽ వసా**

**దయ స్సర్వ ఏతే పుణ్యలోకా భవంతి**

**బ్రహ్మ సంస్థోఽ మృతత్వ మేతి"**

ధర్మంలో మూడు భాగాలు. యజ్ఞం (కామ్యాదులు), అధ్యయనం (గ్రంథాలు), దానములతో కూడింది మొదటిది. 'తపస్సు' (జ్ఞానం కోసం పరితపించి) రెండోది. ఆచార్యుల నుంచి 'విద్య'ను పొంది బ్రహ్మనిష్ఠను అభ్యసిస్తూ గురుసన్నిధిలో ఉండడం మూడోది. ఈ ధర్మాల్ని అనుసరించే వాళ్ళు పుణ్యలోకాల్ని పొందుతారు. జ్ఞానిగా బ్రహ్మనిష్టలో ఉండేవాడు అమృతత్వాన్ని (మోక్షాన్ని) పొందుతాడు.

ప్రజాపతియు లోకాల్ని గురించి తపించిన వేళ మొదట ఋక్కు, యజుస్సు, సామాలతో ప్రారంభమై, 'భూః భువః సువః' వీటి జ్ఞానం కల్గి, చివరి ఐక్యానికి కారణమైన 'ఓంకార'పు జ్ఞానమై, అన్నిటికీ 'ఓం'కారమే (ప్రణవమే) ఆధారమూ, తారకమూ అయిందని మహర్షు లంటారు.,

చివరి యజ్ఞ విధాన వివరణతో 2వ అధ్యాయం ముగిసింది. 'గాయత్రీ చ త్రాయతే చ' (గానం చేయడం వల్ల రక్షించేది) అనే 'గాయత్రి'ని వర్ణించారు మహర్షులు.

మనిషి ఆయుర్ధాయంలో మొదటి 24 వసంతాలు ప్రాతఃసవన గాయత్రియనీ, తదుపరి 44 సంవత్సరాలు మధ్యాహ్న సవనమనీ, తదుపరి 58 సంవత్సరాలు సాయం సవనమనీ మహీదీస ఐతరేయుని బోధ. మొదట 'అసత్' ఉన్నదనీ, ప్రాణం లేనిది అది 'సత్' (ప్రాణం) అయిందనీ, (నిరాకారశక్తి – లింగం) తదుపరి అంకురించి, దాంట్లోంచి 'అండం' వెలువడి ఓ ఏడాది తర్వాత పగిలి, రెండై ఒకటి పృథ్వి, రెండోది ద్యులోకంగా మారిందనీ సృష్టి క్రమాన్ని వివరించారు. అందులో ఆదిత్యుడు (ఆది పురుషుడు) ఉత్పన్నుడైనాడనీ, అతడే బ్రహ్మ అనీ – అతణ్ణి కొలిచేవాడు సుఖపడతాడనీ చెప్పబడింది.

నాల్గో అధ్యాయంలో రైక్వుని బోధలో–

**వాయుర్వావ సంవర్గో యదా వా అగ్ని రుద్వాయతి**

**వాయుమే వ్యాప్యేతి యదా సూర్యోఽ_స్త మేతి**

**వాయు మేవ ప్యేతి యదా చంద్రోఽ_స్త మేతి వాయు మేవా వాప్యేతి**

(వాయువే చివరి ఆశ్రయం. సూర్యచంద్రులంతా తేజస్సు, వాయువుల నుండే పుట్టి అక్కడే లీనమౌతారు)

అలాగే –

**యదాప ఉచ్ఛు ష్యంతి వాయు మేవా పియంతి**

**వాయుర్గ్హ్యే వైతాన్సర్వాన్సం వృద్ధిం ఇత్యధి దైవతం**

నీళ్ళు గాలిలో చేరతాయి. అన్నిటినీ కలుపుకున్న గాలే అధి దైవతమనీ (ఆదిభూతం) చెప్పి, దేహంలోని శక్తుల గురించి

**అథాధ్యాత్మం ప్రాణోవావ సంవర్గః**

**స యదా స్వపితి ప్రాణమేవ వాగప్యేతి**

**ప్రాణం చక్షుః ప్రాణం శ్రోత్రం ప్రాణం మనః**

**ప్రాణోహ్యే వేతాన్సర్వాన్సం వృంక్త ఇతి**

ప్రాణమే ఆశ్రయం. వాణి, చక్షువు, చెవి, మనస్సు అంటే ఇంద్రియ వృత్తులూ, మనస్సు ప్రాణంలో చేరతాయి. ప్రాణమే అన్నిటినీ లోపలకు తీసుకుంటుందని వివరించి –

**తౌ ఏతౌ ద్వౌ సంవర్గౌ వాయు రేవ దేవేషు ప్రాణః ప్రాణేషు**

దేహంలో ప్రాణుడు, బయటి వాటిలో వాయువు, ఇవి రెండే ఆశ్రయాలని ఋషులు నిర్ణయించారు.

జాబాల సత్యకాముడు గౌతముని ఆశ్రమంలో ఉన్నప్పుడు 'వృషభుడు' (ఎద్దు) అతనికి

1. పూర్వ, పశ్చిమ, దక్షిణ, ఉత్తరాలనే నాల్గు దిక్కులు నాల్గు కళలు. ఇది బ్రహ్మపాదమనియు (ప్రకాశవాన్)
2. అగ్ని "పృథ్వి, అంతరిక్షం, ద్యులోకం, సముద్రం" ఇవి నాల్గు కళలు. బ్రహ్మపాదమనియు (అనంతవాన్)
3. అగ్ని, చంద్రుడు, సూర్యుడు, విద్యుత్తు అనే నాల్గు కళలు, జ్యోతిష్మాన్ బ్రహ్మపాదాన్ని హంస,
4. ప్రాణం, చక్షువు, శ్రోత్రం, మనస్సు అనే నాల్గు కళలుండే ఆయతవాన్ అనే బ్రహ్మపాదాన్ని 'మధు' అనే పక్షి బోధించిన కథ ఉంది.

తర్వాత ఉపకోసలునకు అగ్నులు " ప్రాణం బ్రహ్మకం (సుఖం) ఖం(ఆకాశం) అనే శబ్దాల ద్వారా 'కం' అనే దాన్ని ఉచ్చరించే శంఖం ద్వారా (దేహంలో ఒక స్థానం) శూన్య స్థానంలో (బ్రహ్మరంధ్రం) ప్రాణాన్ని ప్రతిష్ఠిస్తే అనుభవానికి వచ్చే ఆనందమే సుఖం. అదే బ్రహ్మత్వానుభవం (ఆనందానుభూతి) అని బోధించిన కథ ఉంది.

అతని గురువు చివరికి శిష్యులకు ఆత్మజ్ఞానాన్ని బోధిస్తూ అర్చిరాది మార్గం గురించి ఇలా చెప్పాడు. "జ్ఞానులు అర్చి లోకాలకు వెళ్ళుతారు. పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం, సంవత్సరం, ఆదిత్యలోకం, విద్యుల్లోకం ఈ క్రమంలో వెళతారు. అక్కడ దివ్యపురుషుడున్నాడు. "తత్పురుషోఽ మానవః" (విరాట్ పురుషుడు, హిరణ్యగర్భుడు, ప్రజాపతి).

**స ఏనాన బ్రహ్మ గమయ త్యేష దేవ**

**పథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా**

**ఇమం మానవ మావర్తం నావర్తంతే నా వర్తంతే**

అతని వల్ల – దయ వల్ల వాళ్ళు బ్రహ్మలోకి చేరిపోతారు. అదే దేవమార్గం – బ్రహ్మమార్గం. ఆ మార్గం నుండి వెళ్ళే వాళ్ళు మానవ లోకానికి మరలిరారు.

విశ్వసృష్టి కన్న ముందే పుట్టిన శక్తియే పెద్దది. శ్రేష్టం కూడా. దాన్ని తెలుసుకున్న వాడు శ్రేష్ఠజ్ఞాని అవుతాడు. ప్రాణమే మొదటిది. శ్రేష్ఠమైన శక్తి.

**యోఽహ వై వసిష్ఠం వేద వసిష్ఠోఽ హ**

**స్వానాం భవతి వాగ్వావ వసిష్ఠః**

వశిష్ఠుని (సంపద్యుక్తుడైన వానిని) గ్రహించిన వ్యక్తి జనుల్లో వశిష్ఠుడౌతాడని చెప్పడంలో జ్ఞానప్రాప్తి ప్రాణుడి నుండి. జ్ఞానప్రకాశం వాణి నుండి. అందువల్ల ఈ దేహంలోని శక్తుల్లో ఈ రెండింటికి శ్రేష్ఠత్వం ఉందని గ్రహించాలి.

పాంచాల దేశపు రాజు గౌతమునికి బోధించినదాంట్లో 'స్త్రీ అగ్ని, ఉపస్థయే సమిత్తు. సంకేతమే ధూమం. యోనియే జ్వాల. మైధునమే నిప్పుకణికలు. అనందమే నిప్పురవ్వలు" అనే అంశాన్ని పరికిస్తే ఆ కాలంలోనూ (చాలా క్రిందట) అజ్ఞానులు తమకు తెలుసు – అని భావించి ఉపదేశించే సాహసం చేసారనే అంశం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. 'సంతానా'న్ని నిప్పురవ్వలని అనవచ్చు. మైధునం వల్ల (గ్రాహ్య సుఖం – దేహసుఖం) 'ఆనందం' ప్రాప్తమౌతుందనడం ఎంత అజ్ఞానం !

అలాంటి అజ్ఞాని, అహంకారీ కావడం వల్లనే అతడు 'ఈ విద్య (జ్ఞానప్రాప్త సాధనం) ఇది వరకు బ్రాహ్మణులకే తెలియదు. ఇది రాజుల సొమ్ము' అని ఉటంకించాడు. బ్రాహ్మణ శబ్దార్థాన్ని తెలుసు కోకుండ చెప్పిన మాట ఇది ! తాను రాజుననే గర్వమే ఈ మాటకు కారణం. బ్రహ్మత్వానుభవమై ఆత్మ సహజత్వమైన ఆనందానుభవం – ఇది అంతర్ముఖత్వంలో మాత్రమే సాధ్యం.

తత్వాల రహస్యాన్ని తెలుసుకునేందుకు తపస్సును కొనసాగించి, విజ్ఞానవంతుడై (సృష్టి రహస్యాన్ని గ్రహించి) ఆ విశ్వసృష్టికి కారణమైన 'శక్తి' ద్వారా బ్రహ్మను దర్శించి, భక్తి ఉదయించి, ఆత్మార్పణతో కృపాపాత్రుడై 'దేవత్వం' (బ్రహ్మత్వం) అంటే ఏమిటో తెలుసుకున్న బ్రహ్మజ్ఞానియే బ్రాహ్మణుడు.

బ్రాహ్మణులకు 'విద్య' లభించలేదంటే అర్థం ఏమిటి. కేవలం అజ్ఞాన జన్యమైన జాతిమాత్సర్యపు మాట ఇది. వర్ణ రహస్యం తెలుసుకున్న జ్ఞాని మాట కాదు. "చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశః" అనే గీతావాక్యంలో గుణకర్మలు వర్ణద్యోతకాలే కాని జాతి ద్యోతకాలు కావనే అర్థం రాదా?

అందుకే ఈ ఉపనిషత్తుల కన్న గీతయే సమగ్రమైన తత్వగ్రంథం. మహర్షుల కన్న అవతార పురుషుడు, గీతాముఖ స్వరూపుడూ అయిన కృష్ణుడే శ్రేష్ఠుడూ – అనేది మా అభిప్రాయం.

ఆరవ అధ్యాయంలో –

**యే నా శ్రుతం శ్రుతం భవత్యమతం**

**మత మ విజ్ఞాతం విజ్ఞాత మితి కథం**

**ను భగవః స ఆదేశో భవతి**

దేని ద్వారా వినరానిది వినిపిస్తుందో, గ్రహించరానిది తెలుస్తుందో – దాన్ని గురువు గారి నుండి తెలుసుకున్నావా?" అని అరుణి తన కొడుకు శ్వేతకేతువును ప్రశ్నించి, అతడు 'లేదు' అని అనగా, సూర్యుడు, జలం, చంద్రుడు – వీరి గురించి బోధించి ఈ ముగ్గురు దేవతలు పురుషునిలో త్రివృత్ అయ్యే క్రమాన్ని వివరించాడు. (ప్రాణం, జలం, మనస్సులే దేహంలో ఈ దేవతలుగా తెలుసుకోవాలి).

తర్వాత షోడశ కళాపూర్ణుడైన పురుషుని గురించిన బోధ ఉంది.

**తన్మనోదిశం దిశం పతిత్వాఽ న్యత్రాయ**

**తనమలబ్ధ్వా ప్రాణమే వోపశ్రయతే**

**ప్రాణబంధనం హి సౌమ్య మన ఇతి**

మనస్సు దిక్కు దిక్కుకు వెళ్ళి, చాంచల్యానికి బలై, ఎక్కడనూ ఆశ్రయించక ప్రాణాన్నే ఆశ్రయిస్తుంది. మనస్సుకు బంధనం ప్రాణమే! మనశ్చాంచల్య స్థితి తప్పేది ప్రాణంలో లీనం కావడం వల్లే.

**పురుషస్య ప్రయతో వాఙ్మనసి సంపద్యతే మనః**

**ప్రాణే ప్రాణస్తే జసి తేజః పరస్యాం దేవతాయాం**

దేహత్యాగ కాలంలో, వాక్కు మనస్సులో, మనస్సు ప్రాణంలోనూ లీనమై, ప్రాణం తేజస్సులో చేరి, ఆ తేజస్సు పరాదేవతలో (దేవునిలో) లీనమౌతుందనే అంశం ఇక్కడ చాలా మహత్వ పూర్ణమైనది.

7వ అధ్యాయంలో నారదుడు సనత్కుమారుని వద్దకు వెళ్ళి, తాను అంతకు ముందు నేర్చుకున్నదేమిటి? అనే అంశాన్ని తెలిపి బ్రహ్మ జ్ఞాన బోధను వేడుకుంటాడు. సనత్కుమారుడు నాల్గు వేదాలు, ఇతిహాసం, పురాణం, వ్యాకరణం, శ్రాద్ధకల్పం, గణితం, జ్యోతిష్యం, నిధిశాస్త్రం,

తర్కశాస్త్రం, నిరుక్తం, త్రయీ బ్రహ్మవిద్య భూత తంత్రం, ధనుర్విద్య, ఇంద్రజాలం ఇవన్నీ వ్యక్తమైన సృష్టి యొక్క జ్ఞానమే !

'వాక్కు' పేరుకన్న శ్రేష్ఠం. మిగతాదంతా అందులోంచి వెలువడి వచ్చిందే. 'మనస్సు' వాక్కు కన్న శ్రేష్ఠం. నామం, వాక్కులు, మనస్సులో అంతర్హితంగా ఉన్నాయి. 'సంకల్పం' (చాంచల్యం లేని స్థితి) 'ధృతి' మనస్సు కన్న (ఇచ్ఛ) శ్రేష్ఠం. ధ్యానం చిత్ కన్న శ్రేష్ఠం. (అచల స్థితి – ఏకాగ్రత) 'విజ్ఞానం' (వ్యాప్తమైన ఈ సృష్టి యొక్క ఉత్పత్తి రహస్యం) ధ్యానస్థితి కన్న పై నుండేది. 'బలం' (శక్తి) విజ్ఞానం కన్న మించింది. బలానికి అశనం ఆధారమై, అన్నం (అశనం) శ్రేష్ఠం. అన్నం జలసారం కావడంతో జలం శ్రేష్ఠం. ఆ జలం కన్న 'తేజస్' శ్రేష్ఠం. తేజస్సుకు ఆశ్రయమైన 'ఆకాశం' దానికన్న శ్రేష్ఠం. వీటన్నిటి కంటే స్మరణం శ్రేష్ఠం. (తనలో తాను తెలుసుకోవడం) ఆశ లేకుంటే ఏదీ లేదు. కావున ఆశ శ్రేష్ఠం. కేవలం ఆశతోనే ఏమీ లభించదు. ఆశ సిద్ధించడానికి సాధనం ప్రాణం. అందువల్ల 'ప్రాణమే సర్వశ్రేష్ఠం'.

**ప్రాణో హ పితా ప్రాణో మాతా ప్రాణో**

**భ్రాతా ప్రాణః స్వసా ప్రాణ ఆచార్యః ప్రాణో బ్రాహ్మణః**

తండ్రి, తల్లి, సహోదరుడు, తాను, గురువు, బ్రాహ్మణుడు – అంతా ప్రాణమే. అన్ని దేహాల్లో ఉండేది అదే కావడం వల్ల –

**"ఏషాతువా అతివదతి యః సత్యే నాతివహతి"**

ప్రాణం ద్వారా సత్యజ్ఞానాన్ని గ్రహించిన వ్యక్తి తెలియని వాళ్ళ మాటలకు అంగీకరించక వాదం చేసే వాడౌతాడు. నిజంగా అతిగా మాట్లాడే వాడు అతడే అని చెప్పి "విజ్ఞానాన్ని తెలుసుకోవాలి. మనన

శక్తిని గ్రహించాలి. శ్రద్ధకు అనుగుణంగా శ్రద్ధ'ను గ్రహించాలి. సుఖం కోసం కర్మ ఉండడం వల్ల నిజమైన 'సుఖం' ఏది అనే అంశాన్ని తెలుసుకోవాలి.

'యోవై భూమా తత్సుఖం' (ఏది స్వయంభూశక్తియో, విశాల వ్యాప్తమో అందులో ప్రతిష్ఠిమయ్యేదే సుఖం. అదే ప్రాణంలో మనస్సు లీనం కావడం. అంతర్ముఖత్వంలో ఆనందం.

8వ అధ్యాయంలో –

**అద యదిద మస్మిన బ్రహ్మపురే దహరం**
**పుండరీకం వేశ్మ దహరోఽ స్మిన్నంత**
**రాకాశస్తస్మిన్యదంతర న్వేష్టవ్యం**
**తద్వావవిజిజ్ఞాసి తవ్య మితి**

మన దేహంలో బ్రహ్మపురి – బ్రహ్మరంధ్రం అనే చిన్న కమలం ఒకటుంది. అందులో సూక్ష్మమైన శూన్యస్థానముంది. (ఆకాశం). అదే 'దహరాకాశ'మని కొందరంటారు. అందులో ఏముంది? అనే విషయాన్ని గ్రహించాలి. దాన్ని గ్రహించడానికి సాధనమైన 'ప్రాణవిద్య'నే కొందరు "దహరవిద్య' అని పిలిచారు. ఇక్కడ కమలమని చెప్పిందాన్నే 'సహస్రార' మని కొందరు చెప్పారు.

**ఏష ఆత్మాఽ పహత పాప్మా విజరో**
**విమృత్యుర్విశోకో విజిగత్సోఽ**
**పిపాసః సత్యకామః సత్య సంకల్పః**

ఆ అంతరాకాశంలో (బ్రహ్మ రంధ్రంలో) ఉండేదే ఆత్మ. అతడు పాపరహితుడు. చావు, శోకం, రోగం – ఇవేవీ లేని వాడు. ఆకలిదప్పులు లేనివాడు. సత్యకాముడు, సత్య సంకల్పుడూ ! ఇక్కడ ఆత్మ సహజత్వం యొక్క అనుభవానంతర స్థితిని వివరించడం జరిగింది. అతడు అనుకున్న దంతా అవుతుంది. ఆత్మ సహజత్వం (శక్తి) ఇలాంటిదే అయినా మాయావృతుడై అజ్ఞానంలో ఉంటాడు.

ఈ శాంత, ప్రసన్న పురుషుడు (జీవాత్మ) ఈ శరీరాన్ని వదలి, పరంజ్యోతిని పొంది స్వరూప జ్ఞానయుక్తుడౌతాడు. ఆ స్వరూపజ్ఞాన యుక్త స్థితినే "ఆత్మ" అంటారు. "అమర్త్య" "మర్త్యుల్ని" కలిపే సేతువు లాంటివాడు ఆత్మ.

ఈ సేతువును దాటిన వానికి రాత్రి కూడా పగలుగా మారుతుంది. అజ్ఞానలేశం లేకుండా పోతుంది. ఎందుకంటే అవతలి బ్రహ్మ లోకం ప్రకాశపూర్ణంగా ఉంటుంది.

జనులు యజ్ఞం, సత్రాయణం, అనాశకాయం – మొదలగు పేర్లతో పిలిచేది బ్రహ్మచర్యాన్నే. జ్ఞానం బ్రహ్మ నుండి ప్రజాపతికి, ప్రజాపతినుండి మనువు, అతని నుండి ప్రజలకు బోధింపబడిందని చెప్పి, గురుసేవ, జ్ఞానప్రాప్తి – వీటి అనంతరం గృహస్థాశ్రమంలో ఉంటూ జ్ఞానకాంక్షులైన శిష్యులతో పుత్రులతో కలిసి, తీర్థం లాగే సర్వ భూతాల్ని సమదృష్టితో చూస్తూ జీవించే మానవుడు పునర్జన్మ లేని బ్రహ్మలోకాన్ని పొందుతాడని బోధించి ఈ ఉపనిషత్తు ముగుస్తుంది.

# 10. బృహదారణ్యకోపనిషత్తు

**శాంతి మంత్రం :**

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే**

**ఓం శాంతిః శాంతి ః శాంతిః**

అది (బ్రహ్మం) పూర్ణం. ఇది (జగత్తు) పూర్ణం. ఆ పూర్ణం నుండి ఈ పూర్ణం పుట్టింది. పూర్ణం లోంచి పూర్ణం బయటికి వచ్చినా పూర్ణుడు పూర్ణుడుగానే ఉన్నాడు.

**పాఠకులకు సూచన :**

ఈ బృహదారణ్యకోపనిషత్తులో ఆధ్యాత్మ, ఆధి దైవిక చింతనలు ఎక్కువ. ఇదివరకటి ఉపనిషత్తుల్లో వచ్చిన చర్చలే ఇందులోనూ ఉన్నాయి. నా అభిప్రాయం ఏమిటని చెప్పకుండా, ముఖ్యంగా గమనించాల్సిన శ్లోకాల్ని మాత్రం గుర్తించి తాత్పర్యం అందించాను. ఆదిభౌతికానికి సంబంధించిన యజ్ఞ, మైధనాలను గురించి వివరాలు ఎక్కువ. అనవసరమని భావించి వాటిని వదలి వేశాను.

**ఓం ఉషా వా అశ్వస్య మేధ్యస్య శిరః**

**సూర్య శ్చక్షు ర్వాతః ప్రాణో**

**సముద్ర ఏ వాస్య బంధుః సముద్ర యోనిః**

యజ్ఞాశ్వం శిరస్సు ఉషస్సు. సూర్యుడే కన్ను, వాయువే ప్రాణం .....సముద్రమే బంధువు. సముద్రమే దాని ఉత్పత్తి స్థానం.

ఇక్కడ విశ్వాన్నే గుఱ్ఱంతో పోల్చడమైనది. తేజస్సే ఆకృతులుగా మారిన, ఇంతకు ముందున్న వెలుగు, దాని శిరస్సనీ, సర్వత్ర వ్యాపించిన వాయువే ప్రాణమనీ, సముద్రమే (అన్నిటి ఉత్పత్తికి కారణమైన శక్తియే ప్రాణం) దాన్ని ప్రతిష్ఠించిన బంధువు అనీ, దాని ఉత్పత్తికి కారణమనీ చెప్పబడింది.

**నైవేహకించనాగ్ర ఆసీన్మృత్యు నైవేద**
**మావృతమాసీత్, అశనాయయాఽ శ**
**నాయా హి మృత్యు స్తన్మనోఽ కురుతాఽఽ త్మన్వీ స్యామితి**
**సోఽ ర్చన్నచరత స్వార్చకత ఆపోఽ జాయంతార్చతే**
**వై మే కమభూదితి తదేవార్కస్యార్కత్వం**
**కం హవా అస్మై భవతి య ఏవ మేత దర్క స్యార్కత్వం వేద"**

విశ్వం రూపొందే కన్న ముందు ఏమీ లేదు. మృత్యువు ఒకటే ఉన్నది. అంతా మృత్యువు చేతనే ఆవరించబడింది. తాను ఆత్మవంతుడు కావాలని మృత్యువు కోరుకుంది. ఆ మృత్యువు తన్ను తాను అర్చిస్తూ సంచరించగా 'జలం' జన్మించింది. 'అర్చించే నాకు జలం ఉత్పత్తి అయింది సుఖం' అన్నాడు.

ఇక్కడ 'మృత్యు' అనే శబ్దానికి ఐక్యస్థానం నుండి విడివడి, క్రిందికి దిగి బయటపడిన శక్తి (ప్రాణం) అని అర్థం చేసుకోవాలి. తనను తాను అర్చిస్తూ సంచరించిందనే వేళ స్పందిస్తూ వాయువు పుట్టి వ్యాప్తమైందనీ, ముందు దాంట్లోంచి తేజస్సు, దాంట్లోంచి జలం ఉత్పత్తి అయినాయని భావం. స్థూల రూపాన్ని మొదట పొంది, జలం కావడం వల్ల దాన్ని మాత్రమే ఈ ఉపనిషత్ కారులందించారు.

"ఆపోవాఅర్క" ఆపం అర్క అంటే అర్కుడే (తేజస్సుతోనే నీరు కల్గిందని గ్రహించాలి). నీటి నురగే ఘనీభూతమై భూమిగా మారింది. శ్రమపడిన మృత్యువు యొక్క తేజస్సుల సారమే అగ్ని.

వాయువు, అగ్ని, ఆదిత్యుడు – ఇలా మృత్యువు మూడు విధాలైనాడు. తనకు రెండో ఆత్మ పుట్టాలని కోరాక 'వాణి' పుట్టింది. వాణి, మరియు ఆత్మల వల్ల (వాయువు, అగ్ని, ఆదిత్యుడు) ఋక్, యజుస్, సామ, ఛందస్సు, యజ్ఞం, ప్రజలు, పశువులు వీటన్నిటినీ ఉత్పత్తి చేశాడు. మళ్ళీ తపస్సు చేశాడు. యశోవీర్యాలు పుట్టాయి. "ప్రాణావై యశోవీర్యం" (పంచప్రాణాలు, కీర్తి, వీర్యాల).

ప్రజాపతికి దేవతలు, అసురులు కొడుకులు. దేవతలు, చిన్న వాళ్ళు; దేవతలు రాక్షసుల్ని జయించేందుకు వాక్కు ద్వారా కన్ను, చెవి, ముక్కు (ఇంద్రియ వృత్తులు) మనస్సుల ద్వారా ఉద్గీథం చేశాక అసురులు వేధించారు. ప్రాణం ద్వారా ఉద్గీథం చేశాక అసురులు వేధించబోయి నాశనమయ్యారు.

**"వాగ్ వై బ్రహ్మతస్యా ఏషపతి స్తస్మాదు బ్రహ్మణస్పతిః"**

వాక్కే బ్రహ్మం (జ్ఞానం దాని ద్వారా ప్రకటించబడటంవల్ల) అందు వల్ల వాక్కుకు అధిపతి అయిన ప్రాణం బ్రహ్మకు పతి – బ్రాహ్మణ పతి.

**"ప్రాణేన హీదం సర్వముత్తబ్ధం"** (ప్రాణం వల్లనే ఇదంతా ధరించ బడింది).

4వ బ్రాహ్మణంలో

**"ఆత్మైవేదమగ్ర ఆసీత్ పురుషవిధః"** – కన్పించే విశ్వానికిముందు పురుషుడిలా ఉండే ఆత్మ ఒక్కడే ఉండేవాడు.

**"ఇమ మే వాత్మానం ద్వేధాపాత యత్తతః**

**పతిశ్చపత్నీ చాభవతాం**

ఆత్మ తనను రెండు భాగాలుగా విడదీశాడు. వాళ్ళే భార్యాభర్త లయ్యారు. ఈ భార్యాభర్తలు వివిధ రూపాలు ధరించి ప్రాణులన్నిటి ఉత్పత్తికి కారణులయ్యారు.

**బ్రహ్మ వా ఇద మగ్ర ఆసీత్త దాత్మాన**

**మేవావవేదహం బ్రహ్మాస్మీతి**

మొదట బ్రహ్మ ఒక్కడే ఉండెను. అతడు తానే బ్రహ్మమని గ్రహించాడు. బ్రహ్మ అయ్యాడు. అదే రీతిలో ఋషులు, మరియు మనుష్యులు దీన్ని గ్రహించిన వాళ్ళు ఆ బ్రహ్మమే అయిపోయారు.

**బ్రహ్మవా ఇదమగ్ర ఆసీదేకమేవ తదేకం**

**సన్న వ్యభవత్త చ్ఛ్రేయో రూపమత్య**

**సృజత క్షత్రం యాన్యేతాని దేవత్రా క్షత్రా**

**ణీంద్రో వరుణః సోమో రుద్రః పర్జన్యో**

**యమోమృత్యురీశాత ఇతి తస్మాత్ క్ష త్రాత్పరం నాస్తి**

మొదట బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. ఒక్కడే ఉండడం వల్ల (బ్రహ్మత్వంలో ఉండిపోవడం వల్ల) కర్మ చేసేందుకు సాధ్యం కాలేదు. క్షత్రమనే శ్రేయో రూపాన్ని సృష్టించాడు. (బ్రహ్మత్వం నుండి క్రిందికి జారాక క్షాత్రత్వం పుట్టింది) అందువల్ల క్రియాశీలురైన (క్షత్రియ), ఇంద్ర, వరుణ, సోమ, రుద్ర, పర్జన్య, ఋతు, మృత్యు, యమ, ఈశానాది దేవతల సృష్టి అయింది. అందువల్ల క్షాత్రం కన్న శ్రేష్ఠమైనదేదీ లేదు. బ్రహ్మ (బ్రహ్మత్వపు) యశస్సు (క్షాత్రత్వం వల్లనే) క్షత్రియుని వల్లనే!

బ్రహ్మమే క్షాత్రయోని (ఉత్పత్తిస్థానం) వేర్వేరు కర్మల కోసం, వైశ్యుల్ని, శూద్రుల్ని ఉత్పత్తి చేశాడు. తర్వాత ధర్మాన్ని సృష్టించాడు. ధర్మమే (సత్యం, ధర్మం) రెండుగా మారింది. అంటే క్రమం తెలిసిన ఆచరణ మరియు సత్యవాక్కు.

మనస్సే ఆత్మ. వాక్కే దీని పత్ని. ప్రాణమే సంతానం. కన్నులే ధనం, చెవియే దైవం. ఆత్మే కర్మ. ఇది పాంక్తం.

**"ఆత్మైవాస్య షోడశీ కలా"** (ఆత్మయే పదహారవ కళ).

కర్మ వల్ల పితృలోకం, విద్య వల్ల దేవలోకాలు లభిస్తాయి. **'అథ కర్మణా మాత్మేత్యేత దేషా ముక్థం"** (అన్ని కర్మలకు ఆత్మే ఉక్థం కారణం).

**ప్రాణోవా అమృతం నామ రూపే సత్యం**

**త్యాభ్యామయం ప్రాణశ్ఛన్నః**

ప్రాణమే అమృతం (నాశరహితం. నామరూపాలే సత్యం. వీటి వల్ల ప్రాణం ఆచ్ఛాదితం.

**2వ అధ్యాయం**

**ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిధిధ్యాసితవ్యః**

ఆత్మ చూడదగింది. వినదగింది. మననం చేయదగింది. చింతనం, స్మరణం చేయదగింది. ఇక్కడ ఆత్మ నికాకారుడు కాదనే సత్యం చెప్పబడింది.

**సనః కః పరమేష్ఠినః పరమేష్ఠి బ్రహ్మణో**

**బ్రహ్మ స్వయంభూ బ్రహ్మణే నమః**

విద్యను సనగుడు పరమేష్ఠి నుండి పరమేష్ఠియు హిరణ్యగర్భుని నుండి పొందదం జరిగింది.

హిరణ్యగర్భుడు స్వయంభూ బ్రహ్మ అయి వున్నాడు.

**3వ అధ్యాయం**

**"చక్షుర్వై యజ్ఞస్య దృక్"** (కన్నే యజ్ఞపు అధ్వర్యుడు)

**"ప్రాణోవై యజ్ఞస్యోద్గాతా"** (ప్రాణమే యజ్ఞపు ఉద్గాత)

**"మనోవై యజ్ఞస్య బ్రహ్మ"** (మనస్సే యజ్ఞపు బ్రహ్మ)

**"ఆధ్యాత్మమితి ప్రాణ ఏవ పురోనువాక్యా ఉ**

**పానో యా జ్యా వ్యానః శస్యాః"**

ప్రాణమే అధ్యాత్మం. దీంతో అంతరిక్షాన్ని జయిస్తాడు. అపానమే పురోనువాక్యం. దీంతో పృథ్విని జయిస్తాడు. వ్యానమే సస్యం. దీంతో ద్యులోకాన్ని జయిస్తాడు.

**ఆర్తభాగుని ప్రశ్న :-** చనిపోయాక వాక్కు అగ్నిలో, ప్రాణం అగ్నిలో, ప్రాణం వాయువులో, కన్ను సూర్యునిలో, శరీరం పృథ్విలో, 'ఆత్మ' ఆకాశంలో, వెంట్రుకలు ఓషధుల్లో, రక్త రేతస్సులు నీళ్ళలో చేరితే – ఆ తర్వాత ఈ పురుషుడు ఎక్కడికి వెళ్ళతాడు?

యాజ్ఞవల్క్యుడు జనసందడిలో జవాబు చెప్పకూడదని ఏకాంతానికి తీసుకు వెళ్ళాడు. వాళ్ళలో మాట్లాడబడిన విషయం కర్మ. పొగడింది కర్మనే !

**తస్మా ద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య**

**బాల్యేన తిష్టా సేద్బాల్యం చ పాండిత్యం చ**

**నిర్మిద్యాఉ థ మునిర మౌనం చ మౌనంచ నిర్వి**

**ద్యాఉథ బ్రాహ్మణః సబ్రాహ్మణః**

పాండిత్యాన్ని త్రోసిరాజని బాలస్వభావం కలవాడుగా మారాలి. అంటే – నిగర్వి కావాలి. బాల్య పాండిత్యాల్ని త్రోసిపుచ్చి ముని కావాలి. మౌనా మౌనాల్ని త్రోసివేసి బ్రాహ్మణుడై ధన్యుడు కావాలి.

విదగ్ధశాకల్యుని ప్రశ్నలకు యాజ్ఞవల్క్యులు అందించిన జవాబు:

1. మున్నూట మూడు, మూడు, మూడువేల దేవతలు ?

జవాబు : నిజానికి ఉండేది 33 మంది దేవతలే ! 8 మంది వసువులు, 11 రుద్రులు, 12 ఆదిత్యులు, ఇంద్రుడు మరియు ప్రజాపతి.

2. 8 మంది వసువులు ఎవరు?

జవాబు : అగ్ని, పథ్వి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకం, చంద్రుడు, నక్షత్రం.

3. రుద్రులు ఎవరు?

జవాబు : పంచప్రాణాలు (5 కర్మేంద్రియాలు,5 జ్ఞానేంద్రియాలు)) మరియు ఆత్మ.

4. ఆదిత్యులు ఎవరు?

జవాబు : సంవత్సరంలోని 12 నెలలు

5. ఇంద్రుడు, ప్రజాపతి ఎవరు?

జవాబు : ఇంద్రుడంటే – పిడుగు, ప్రజాపతి అంటే యజ్ఞం. పశువులే యజ్ఞం.

6. ఆరుగురు దేవతలు ఎవరు?

జవాబు : అగ్ని, పృథ్వి, వాయువు, అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకం.

7. ముగ్గురు దేవతలు ఎవరు?

జవాబు : మూడు లోకాలే!

8. ఇద్దరు దేవతలు ఎవరు?

జవాబు : అన్నం మరియు ప్రాణం

9. ఒకటిన్నర దేవతలు ఎవరు?

జవాబు : గాలి (వీచడం వల్ల)

10. ఒక్కడే దేవుడెవరు?

జవాబు : ప్రాణం

**విజ్ఞానమానందం బ్రహ్మరాతిర్దాతుః**

**పరాయణం తిష్ఠ మానస్య తద్విదః"**

విజ్ఞానమయుడు, ఆనందమయుడూ అయిన పరబ్రహ్మ కర్మచేసే యజమాని, దాని బ్రహ్మనిష్ఠునికి పరాయణుడుగా వుంటాడు. అతణ్ణి తెలుసుకో.

**4వ అధ్యాయం**

ప్రాణోవై సమ్రాట్ పరమం బ్రహ్మ" (ప్రాణమే పరబ్రహ్మం)

**ప్రాణో న రక్షన్న వరం కులాయం బహిష్కు**

**లాయాదమృతశ్చరిత్వా స ఈయతేఽ**

**మృతోయత్ర కామ హిరణ్మయః పురుష ఏకహస్వ**

ఈ శరీరాన్ని ప్రాణాలతో రక్షిస్తూ అమృతుడైన ఆత్మ శరీరం వెలుపల తన ఇష్టం వచ్చిన చోట సంచరిస్తాడు. హిరణ్మయ పురుషుడు అన్ని చోట్లకు వెళ్ళతాడు. అతడొక్కడే ఉంటాడు.

**పురుష ఏభ్యోంగేభ్యః సంప్రముచ్యపునః**

**ప్రతిన్యాయం ప్రతియోన్యా ద్రవతి ప్రాణాయైవ**

పురుషుడు దేహం నుండి విడుదలై మళ్ళీ జన్మ ఎత్తడానికి వచ్చినట్లుగా ప్రాణుని మూలకంగానే వెళ్ళుతాడు.

**"తం విద్యాకర్మణీ సమన్వారభేతే పూర్వ ప్రజ్ఞా చ"**

విద్య, అతని కర్మ, పూర్వ జ్ఞానాలు అతనితో పాటే నిష్క్రమిస్తాయి.

**యోఽ కామో నిష్కామ ఆప్తకామ ఆత్మ**

**కామోన తస్య ప్రాణా ఉత్క్రామంతి**

**బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి**

అకాముడు, నిష్కాముడు, ఆప్తకాముడు, ఆత్మకాముడూ అయిన వ్యక్తి ప్రాణాలు పోవు. వేరే లోకంలో అతడు బ్రహ్మలో బ్రహ్మగా మారి లీనమౌతాడు.

**"అంధం తమః ప్రవిశంతి యేఽ విద్యాముపాసతే"**

అవిద్యను ఉపాసించే వాళ్ళు అంధ తమస్సులో ప్రవేశిస్తారు.

"“మనస్యేవాను ద్రష్టవ్యం" – మనస్సు ద్వారానే చూడాల్సి ఉంది.

# చివరి మాట

మొత్తానికి నా పూజ్య గురువులు ప్రభు శ్రీ అచ్యుతుల ఆదేశాన్ని శిరసావహించి, ఉపనిషత్తుల గురించి నాకు ముఖ్యమనిపించిన అంశాన్ని ఎన్నుకుని నా మతికి తోచినట్లుగా రాశాను.

ఇంతకు ముందే నేను కొన్ని పుస్తకాలు రాసినా, ఈ పుస్తకం వల్ల కల్గిన కష్టం దేని వల్లనూ కల్గలేదు.

తనకు తెలిసిన దాన్ని, తాను చెప్పదలచుకున్న దాన్ని తన మాటలతో చెప్పడం సులభం. దాని వల్ల విసుగు కల్గదు. అయితే వేరే వాళ్ళ వాక్యాన్ని పరిశీలించి, వాళ్ళ అభిమతాన్ని ఊహించి రాయడం, వాళ్ళ వివరణలోని అభావాన్ని, అపూర్ణతను తొలగించేందుకు తనకు తెలిసిన విషయాల్ని అందులో చేర్చటం – ఇవన్నీ చాలా కష్టంతో కూడిన కార్యాలు. వేరే వాళ్ళ గ్రంథాల్ని తీసుకుని, వాళ్ళ మాటల భావాన్ని ఇంతకు ముందే వివరించి రాయలేదని కాదు.

భగవద్గీత గురించి నేను రాసిన "గీతామృతం", నారదభక్తి సూక్తాల గురించి రాసిన "ఆనంద ఋషుల అమృత వాణి" అలాంటి గ్రంథాలే! అయితే ఆ గ్రంథాల కర్త ఒక్కడే. అందువల్ల అక్కడ చర్వితచరణం చాలా తక్కువ. ఇక్కడ అలా కాదు. ప్రతి ఉపనిషత్తులో వచ్చిన అంశాలే ఇంకో ఉపనిషత్తులో వస్తాయి. తెలుసుకునే రీతి, చెప్పే క్రమం విభిన్నంగా ఉంటుంది. అందువల్ల "ఈ వేదారణ్యం నుండి నేనెప్పుడు బయట పడేది?" అని నాకనిపించింది. ఉపనిషత్తుల్లో పదిమంది మెచ్చుకున్న దశోపనిషత్తుల గురించి రాశాను. ఇక రాసే పని ఆపాలనుకున్నా. బృహదారణ్యకోపనిషత్తులో ఎక్కువ మాటల్ని ఉపయోగించరాదనే బోధ ఉంది. ప్రభు అచ్యుతులు కూడ "మాట వల్ల కొంపలు నాశనం. ధర్మ కర్మాచరణం, సత్యమార్గదర్శనం – వీటికి ఎంత కావాలో అంత వరకే మాటలు" అనే వాళ్ళు.

తారుణ్యం నుండి తపస్సు చేయాలి. తత్వ జ్ఞానం పొందాలి. దైవాన్ని దర్శించాలి. ధర్మబద్ధంగా జీవించాలనే ఆశ నాలో అంకురించి, పెరిగాయి. ప్రభువు గారి దయతో 'విద్య' లభించి, ఆ నా ఆశకు తృప్తి లభించేందుకు 21 సంవత్సరాల కాలం కావాల్సి వచ్చింది. అయితే ఇపుడు ఇంకో ఆశ చిగురించింది.

జగత్తులో ధర్మాచరణం స్థిరం కావాలి. అయితే ఇపుడింకో ఆశ మొలకెత్తింది. జగత్తులో ఏ మాత్రం క్షతి కాకుండా ధర్మాచరణ నిల దొక్కుకోవాలి. దాని కోసం శ్రమించాలి'. అది సాధ్యమని కొందరు అంటే, మరికొందరు అసాధ్యమంటారు. రెండో రకం వాళ్ళే హెచ్చు! ఫలితమేమైనా, ఆశ మొలకెత్తాక, ఇక శ్రమించక తప్పదు.

'ప్రయత్నం నాది, ఫలాన్నిచ్చేది దేవుడు" అనే నమ్మకంతో సాగడమే యోగి లక్షణమట ! ఆ ఓర్పును నాకందించి, యోగుల్లో ఉండే బుద్ధి వైశిష్ట్య ప్రకాశాన్ని నాకు ప్రసాదించి, నన్ను యోగిగా తీర్చిదిద్ది, నా ద్వారా కూడ సాధ్యమైనంత లోక కల్యాణం జరిగేలా చేసి, ఆ ప్రభువు నన్ను ధన్యుణ్ణి కావించాలని ప్రార్థిస్తున్నా ! ఆయన ఆదేశానుసారం రాసిన ఈ పుస్తకాన్ని ఆయన ప్రసాదవాణిగా భావించి పాఠకుల కందిస్తున్నాను.

దీని వల్ల పాఠకుల్లో తత్వజ్ఞానాకాంక్ష కల్గి, దాని ప్రాప్తికి అవసరమైన 'విద్య'ను పొందాలనే కోరిక, ప్రయత్నం ఏర్పడితే నా శ్రమ సార్థకమైనట్లే !

కలినాశకుడైన కల్కి కృప విశ్వానికి శీఘ్రంగా కల్గాలనేదే మహర్షుల ఆశయం. ఆ కృప కార్యరూపం ధరించాలని నా ఆశ.

**ఓం శాంతిః**

**జయ అచ్యుత**